www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



రెవెన్యూ- ఫారెస్ట్ సరిహద్దు వివాదాలకు
జాయింట్ సర్వేతో
శాశ్వత పరిష్కారం
03
లక్ష మంది విద్యార్థులకు
ఉచితంగా ఎఐ, క్లౌడ్ శిక్షణ

సంపుటి 09, సంచిక: 333 | మంగళవారం | 03-11-2026 | ఖమ్మం
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

మణిపూర్‌లో మళ్లీ కల్లోలం

అదృశ్యమైన ఇద్దరు యువకుల ఛిద్రమైన మృతదేహాలు లభ్యం
భద్రతా దళాలతో నిరసనకారులు ఘర్షణ
చెదరగొట్టేందుకు బాష్పవాయువు ప్రయోగం, లాఠీచార్జ్



ఇంపాల్ : కల్లోలిత మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. సమీపంలోని సేనాపతిలో అదృశ్యమైన ఇద్దరు యువకుల ఛిద్రమైన మృతదేహాలు లభ్యం కావడంతో, కాంగ్‌పోక్పి జిల్లాలో నిరసనకారులు భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. వారిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది బాష్ప వాయువు ప్రయోగం, లాఠీచార్జి చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి కాంగ్‌పోక్పి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చెలరేగాయి. ఆందోళనకారులు అనేక రోడ్లపై టైర్లను తగలబెట్టి, కర్రలు, బండరాళ్లతో పలు మార్గాలను దిగ్బంధించారు. పోలీసులు కొన్ని రోడ్లను క్లియర్ చేయగలిగారు. ఆందోళనకారులు భద్రతా దళాలపై రాళ్లు కూడా విసిరారు. దీంతో వారిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది బాష్పవాయువు ప్రయోగించి, లాఠీచార్జి చేశారు. బాష్పవాయువు షెల్ తగలడంతో ఒక నిరసనకారుడి తలకు గాయమైందని, అతని పరిస్థితి నిలకడగా ఉందని వారు తెలిపారు. జిల్లాలో ఉద్రిక్తత అధికంగా సోమవారం ఉదయం అదనపు భద్రతా దళాలను మోహరించినట్లు ఒక జిల్లా అధికారి తెలిపారు. ఇటీవల అదృశ్యమైన ఇద్దరు యువకుల ఛిద్రమైన మృతదేహాలు సేనాపతి జిల్లాలోని ఒక కొండ ప్రాంతంలో ఆదివారం ఉదయం లభ్యమయ్యాయన్నారు. అక్టోబర్ 29న తఫౌ కుకి గ్రామం నుంచి అదృశ్యమైన టి.చోంగ్లోయ్ (21), పాగిన్‌లాల్ హంగ్‌సింగ్ (20) అనే ఇద్దరు యువకుల ఆచూకీ కనుగొనేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా, ఒక అరటి తోటలో గోనె సంచులలో కుక్కిన స్థితిలో ఈ మృతదేహాలను కనుగొన్నారని వారు చెప్పారు. అయితే ఉప ముఖ్యమంత్రులు నెమ్చా కిప్జెన్, లోసీ దిఖో ఈ హత్యలను ఖండించారు. సురక్షితంగా తిరిగి వస్తారన్న ఆశలతో మొదలైనది విషాదంగా ముగిసిందని అని కిప్జెన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దారుణమైన నేరాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దోషులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. 'ఇలాంటి అర్థరహితమైన హింసాత్మక చర్యలను, హత్యలను నిస్సందేహంగా ఖండించాలి. మన రాష్ట్రంలో తరువాయి 8లో



వేగంగా దూసుకొస్తున్న 'మురసు'

- ఎపిలోని ఒంగోలు సమీపంలో తీరందాటే అవకాశం
- ఎపి, తమిళనాడు, తెలంగాణలో వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపాను మురసు కొనసాగుతోంది. కడపటి వార్తలు అందే సమయానికి గత ఆరు గంటలుగా గంటకు 10 కి.మీ. వేగంతో వాయవ్య దిశగా కదులుతున్న ఈ తుపాను ఎపిలోని నెల్లూరుకు 100 కి.మీ., కావలికి 120 కి.మీ., చెన్నైకి 160 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. అలాగే ఒంగోలుకు 160 కి.మీ., మచిలీపట్నానికి 210 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు. మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో ఎపి, ఉత్తర తమిళనాడు తీరాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము సమయంలో ఒంగోలు సమీపంలో మురసు తీరం దాటే అవకాశ ముంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా, అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ సూచించారు. మరో వైపు మురసు తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందని తరువాయి 8లో



జాతీయ విపత్తుగా ఎల్‌నినో కరువు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ • మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన

నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎండిన పంట పొలాల పరిశీలన

ప్రజాపక్షం/నల్లగొండ


ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నల్లగొండ జిల్లా కరువు కోరల్లో చిక్కుకుందని, ఎండిపోయిన పంటలు, పెరిగిన అప్పులతో రైతుల బతుకులు దుర్భరంగా మారాయని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంటలు పూర్తిగా ఎండిపోయి నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి పంటకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కౌలు రైతులను కూడా గుర్తించి నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కరువు యాత్రలో భాగంగా నల్లగొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంలోని మునుగోడు మండలం చల్మెడ, చండూరు మండలం బంగారుగడ్డ, నాంపల్లి మండలం నర్సింహులగూడెం, డిండి మండలంలోని రామంతపూర్ గ్రామాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను తరువాయి 12లో

- వరికి ఎకరాకు రూ.30 వేలు.. పత్తికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి
- రేషన్ కార్డుదారులకు 10 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
- డిండి ఎత్తిపోతల పథకాన్ని వచ్చే ఎన్నికల్లోపే పూర్తి చేయాలి

హైదరాబాద్ మహానగరం
క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీ

తీర్చిదిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి
అవసరాలకు గ్రీన్ ట్యాంకర్లు వాడుకోవాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్



హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సోమవారం మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సిఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సిఎం సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిఎం చెప్పారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్‌డస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు 'ఐలా' అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ తో పాటు ఇతర పనులకు ఎస్‌టిపిలలో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే గ్రీన్ ట్యాంకర్స్‌ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సిఎం అధికారుకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్‌టిపిలలో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సిఎం అభిప్రాయపడ్డారు. జలమండలి తరువాయి 12లో



ఐడిబిఐ అధికారులు, ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష

ఐడిబిఐ విక్రయం దుర్మార్గపు చర్య


- దేశద్రోహంతో సమానం
- జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణతో ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం
- ఎఐబిఇఎ జాతీయ అధ్యక్షుడు బి.ఎస్.రాంబాబు
- ఐడిబిఐ అధికారులు, ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష
- బ్యాంకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ప్లకార్డులతో నిరసన

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ అమూల్య సంపదైన ఐడిబిఐ బ్యాంకును విక్రయించడం దేశద్రోహంతో సమానమని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ) జాతీయ అధ్యక్షుడు బి.ఎస్. రాంబాబు ఆరోపించారు. రూ. లక్ష కోట్లకు పైగా విలువైన ఐడిబిఐ బ్యాంకులోని 60.72 శాతం వాటాను కేవలం రూ.52,878 కోట్లకు విక్రయించాలనే నిర్ణయం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వ బ్యాంకులు అమ్ముకోవాల్సిన ఆస్తులు కావని, అవి దేశ నిర్మాణానికి ఉపయోగపడే సాధనాలని పేర్కొన్నారు. లాభాల బాటలో పయనిస్తున్న బ్యాంకును విక్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఐడిబిఐ విక్రయం, విలువ నిర్ధారణ ప్రక్రియలో పారదర్శకతపై అనేక అనుమానాలు ఉన్నాయని, భవిష్యత్తులో ఇది దేశంలోనే భారీ కుంభకోణంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఐడిబిఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, పార్లమెంటరీ పర్యవేక్షణలో సమగ్ర సమీక్ష తరువాయి 12లో

షరతులు ఒప్పుకున్న రెండో రోజే
హోర్మూజ్ తెరుస్తాం

ఖతార్ సూచనతో ఏడు రోజుల ప్రణాళికలో మార్పు
పరస్పర విశ్వాసం లేకపోవడమే అతిపెద్ద ఆటంకం
అల్-జజీరా ఇంటర్వ్యూలో అబ్బాస్ అరాఘ్చి



టెహ్రాన్: ఇరాన్ షరతులను అమెరికా మనస్ఫూర్తిగా ఒప్పుకుంటే తమ ఏడు రోజుల ప్రతిపాదిత ప్ర ణాళిక అమలు సాధ్యమేనని అబ్బాస్ అరాఘ్చి(ఇరాన్ విదేశాంగమంత్రి)చెప్పారు.ఇరు దేశాలమధ్యా పరస్పర విశ్వాసం లేకపోవడమే అతిపెద్ద సమస్యగా తాము గుర్తించామన్నారు. సంకల్పం ఉంటే పశ్చిమాసియాప్రాంతంలో సాధారణ జీవిత పునరుద్ధరణ జరుగుతుందన్నారు.అల్-జజీరా ప్రచురించిన ఆయన ఇంటర్వ్యూను ఆదివారం రాత్రి టెలిగ్రామ్‌లో పోస్ట్‌చేశారు. ఖతార్ సూచన మేరకు ఏడురోజుల ప్రణాళికను రెండురోజులకు కుదించినట్లు అరాఘ్చి చెప్పారు.ఈ మేరకు,మొదటిరోజు షరతుల అమలుకు అమెరికా అనేక చర్యలు తీసుకుంటుందని, రెండోరోజు హోర్మూజ్ జలసంధిని ఇరాన్ తెరుస్తుందని తద్వారా సముద్ర రవాణా రాకపోకలు మునుపటిస్థితికి వస్తాయన్నారు. అమెరికా తీసుకోవాల్సిన చర్యలు అసాధారణమైనవి కావని, తాము విధించిన షరతులు ఇప్పటికే సంతకాలుచేసి రద్దుచేసుకున్న ''ఇస్లామాబాద్ ఒప్పందం''లో ఉన్నాయని చెప్పారు. ప్రణాళికాబద్ధమైన చమురు ఆంక్షల మినహాయింపులను అమలు చేయాలని కోరారు. హోర్మూజ్ జలసంధిని తెరవాలి, ఇరాన్ షరతులు పరిష్కరించాలి అని కోరారు. ఖతార్,పాకిస్థాన్ మధ్యవర్తుల ద్వారా చర్చలు జరుగుతున్నాయని ఈ చర్చల్లో ప్రతిపాదన గతంలో ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల ప్రణాళిక(ప్రస్తుతం రెండు రోజులు)పై ఆధారపడి ఉందని అన్నారు. ఇటీవల ఖతార్,పాకిస్థాన్ మధ్యవర్తులతో ఇరాన్ జరిపిన చర్చలు ఈ ప్రణాళికను మరింత ఆచరణాత్మకంగా మార్చాయని, ఖతార్ చేసిన సూచన మేరకు ఈ ఏడురోజుల ప్రణాళికను తరువాయి 8లో



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా, కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

అంగన్‌వాడీలకు రూ.18 వేలు ఇవ్వాల్సిందే

- ప్రభుత్వం వేతన హామీని నిలబెట్టుకోవాలి • పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి • న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీల ధర్నా


ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలతో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుహాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల వేళ సీఎం ఇచ్చిన రూ.18,000 వేతన పెంపు హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రగతిలో భాగస్వాములవుతూ మాతాశిశు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ తరువాయి 8లో

ప్రసంగాలతో మభ్యపెట్టొద్దు

- రాష్ట్ర విభజన హామీలు అమలుచేయాలి
- అమిత్ షా హైదరాబాద్ సభతో తెలంగాణకు ఒరిగిందేమీలేదు • కేంద్ర హోంమంత్రిపై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజం

ప్రజాపక్షం/హైదరాబాద్



ఉమ్మడి ఎపి విభజన సందర్భంగా తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేయకుండా రాజకీయ ప్రసంగాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే సహించేదిలేదని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలు, తరువాయి 8లో

ఇవిఎంలు, సర్‌పై చర్చకు సిద్ధం

- కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటన
- హైదరాబాద్‌లో మహాపాదయాత్ర

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇవిఎంలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో బిజెపి నిర్వహించిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం అరాచకత్వాన్ని అంతం చేద్దాం' మహా పాదయాత్ర ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. నిజాం కాలేజీ ఎదుట ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు సాగిన మహా పాదయాత్రలో అమిత్ షా పాల్గొన్నారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న అమిత్ షా నేరుగా పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ తెలంగాణలో తరువాయి 8లో

ప్రజాస్వామ్యానికి బలం ఐక్య ప్రతిపక్షానికి బూస్ట్

నవంబర్ 1 దేశ ప్రతిపక్ష రాజకీయంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఎన్నికల్లో అక్రమాలు, ఓటు దొంగతనం, బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలకు గురైన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) గ్యానేశ్ కుమార్‌ను తొలగించాలన్న డిమాండ్ చుట్టూ సాగుతున్న రాజకీయ ఉద్యమం రాంలీలా మైదానంలో మహార్యాలీగా మారి యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. 19 పార్టీల 'ఇండియా' కూటమి పిలుపుపై, ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో 13కోట్లకు పైగా ఓట్లను తొలగించిన 'సర్' ప్రక్రియకు వ్యతిరేకంగా, ఓట్ చోరీకి వ్యతిరేకంగా 2026 గాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి అవిరామంగా సాగుతున్న ప్రతిపక్ష ఆందోళన రాంలీల ర్యాలీతో ఉచ్ఛస్థాయికి చేరుకుంది. నిరసన ప్రదర్శకులు ఢిల్లీకి ఎక్కువగా చేరుకోకుండా చేసేందుకు బిజెపి ప్రభుత్వం రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను నిరాకరించినా, ఒకే రైల్వే స్టేషన్‌లో బల్క్‌గా టిక్కెట్లు ఇవ్వకపోయినా వారు సొంత ఇతరేతర ఏర్పాట్లతో పెద్దసంఖ్యలో ఢిల్లీ చేరుకున్నారు. 'ఓటును కాపాడండి–దేశాన్ని కాపాడండి' నినాదాలు దళసరి చర్మంగల అధికార పీఠాలను బలంగా తాకాయి. ఈ ర్యాలీ క్లైమాక్స్ కాదు – పోరాటాల విస్తృతికి ఉత్తేజం. నవంబర్ మధ్యనుంచి డిసెంబర్ మధ్యవరకు ఇండియా కూటమి అనేక ఆందోళనలకు ప్రణాళిక తయారుచేసింది. నవంబర్ 25–26 తేదీల్లో మరో ఐదు పెద్ద ఢిల్లీ మార్చ్ ర్యాలీలు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం రోజున ఢిల్లీలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ పోరాటం పార్లమెంటు శీతాకాల సమావేశంలో పార్లమెంటును చేరుతుంది. అంటే ఇదొక రాజకీయ ఉద్యమంగా 2027 సంవత్సరారంభ అసెంబ్లీ ఎన్నికల క్షేత్రంలోకి గొనిపోబడుతుంది. రెండోవైపున సుప్రీంకోర్టులో న్యాయపోరాటం సాగుతుంది. ఈ విచారణలో న్యాయకోవిదులు ఇప్పటికే ఇసి ఒడిగట్టిన అనేక అక్రమాలు, సిఇసి ఏకపక్ష నిర్ణయాలు కోర్టుముందుకు తెచ్చారు. న్యాయమూర్తుల వ్యాఖ్యలు కూడా అక్రమాలను నిలదీసే రీతిగానే ఉన్నాయి.

ప్రతిపక్ష ఇండియా కూటమి ఆందోళనకు వ్యతిరేకంగా బిజెపి దేశవ్యాప్త ప్రచారాందోళన సాగించటంలోనే ఓట్ల దొంగతనాలు, మూకుమ్మడి తొలగింపులను సమర్థించే ధోరణి కనిపిస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా సహా బిజెపి నాయకత్వం పై నుంచి కిందిస్థాయి వరకు ఒకే పాట పాడుతున్నది. 'ప్రతిపక్షం లేదా రాహుల్‌జీ దేశంలో బంగ్లాదేశ్, నేపాల్‌లో లాగా అరాచకం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్య రక్షణ, అరాచకం తొలగింపు' అంటూ కూటమికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నది. హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో 2కిలోమీటర్ల దూరం సాగించిన 'మహాపాదయాత్ర', అనంతర ప్రసంగం ఇందుకోసమే నిర్వహించబడింది. ఢిల్లీకి అన్ని లక్షలమంది ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షాబద్ధులై అరుదెంచారే ఎక్కడైనా ఒక చిన్న అవాంఛనీయ ఘటన జరిగిందా? పైగా బిజెపివారు ఢిల్లీ వ్యాపారుల సంఘాన్ని రెచ్చగొట్టి 'ప్రతిపక్ష ర్యాలీ వల్ల పండగ సీజన్‌లో మా పదులకోట్ల రూపాయల వ్యాపారం దెబ్బతింటుంది. అందువల్ల ర్యాలీ దీపావళి అవతల తేదీకి వాయిదా వేసుకోవాలని రాహుల్ గాంధీకి, ఆ తర్వాత సోనియాగాంధీకి విజ్ఞప్తులు చేయించారు. 1వ తేదీన అల్లర్లు జరగవచ్చనే భయంతో రెండు లక్షలకు పైగా దుకాణాలు మూసివేశారు. వ్యాపారాలకు నష్టం వాటిల్లకుండా ప్రదర్శకులు ఏదోక వస్తువు కొనుక్కుని వెళ్లండని రాహుల్‌గాంధి విజ్ఞప్తి చేయటం వ్యాపారుల మొసలి కన్నీరును పరిహసించటమే! ప్రతిపక్ష కూటమిలో విభేదాలున్నాయని కూడా బిజెపివారు ప్రచారం చేస్తున్నారు. 19పార్టీల నాయకులు ర్యాలీ ముందురోజు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో 'మాక్ పార్లమెంటు' నిర్వహించి సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించటం, ర్యాలీలో అన్ని పార్టీల నాయకులూ టాపులేని శకటంపై ప్రదర్శనలో పాల్గొని, ఉమ్మడి వేదికను పంచుకోవటం ఆ ప్రచారం నోరు మూయిస్తున్నది. రాష్ట్రాల్లో సీట్లు పంచుకోవటం వంటి విషయాల్లో విరుద్ధ ప్రయోజనాలు ఘర్షణ పడుతుండవచ్చు, కాని ఎన్నికల నిజాయితీని పరిరక్షించే డిమాండ్ విషయంలో ముక్తకంఠం వింటున్నాం.

రాంలీలా మైదాన్ ర్యాలీవల్ల ఇండియా కూటమికి అనేక రాజకీయ ప్రయోజనాలు చేకూరి ఉండవచ్చు. ప్రతిపక్ష ఐక్యతను చాటిచెప్పటం, మోదీ భజన చేస్తూ ప్రతిపక్షాన్ని పక్కన పెడుతున్న జాతీయ మీడియాలో తగు కవరేజి, రాహుల్ గాంధి సహా ప్రతిపక్ష నాయకుల 'నాయకత్వ సమర్థతను' పటిష్టవంతం చేయటం, ఎన్నికల జాబితాల తయారీలో నిజాయితీపై చర్చను పెంపొందించటం వాటిలో ముఖ్యమైనవి. ఈ ర్యాలీ తక్షణ ప్రభావం ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్‌పై ఉంటుంది. ఈ ర్యాలీ సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్ రాజకీయ స్థితిని పటిష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌లో రాజకీయ పోరాటానికి నాందిగా ఈ ర్యాలీని ఎస్‌పి నాయకుడు అఖిలేశ్‌యాదవ్ అభివర్ణించారు. దీని ప్రభావాన్ని తక్కువ చేయటానికే అన్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లక్నోలో ఇదే రోజున ర్యాలీ నిర్వహించారు. యుపి పోరాటంలో 'సర్' ఒక ప్రధానాంశంగా ఉంది. రాష్ట్రంలో నికరంగా 2 కోట్ల 5 వేల ఓట్లు తొలగించారు. అందులో అత్యధికం మైనారిటీలు, దళితులు, అల్ప సంఖ్యాకులవని ఊహించటం కష్టం కాదు.

ఢిల్లీ ర్యాలీ సాధించిన మరో సాఫల్యం – హిందీ భాషా రాష్ట్రాలన్నిట్లో ప్రతిపక్ష గొంతుక బలపడింది. ఇండియా కూటమి 'ఎన్నికల జవాబుదారీ ఉద్యమం' మరింత బలంగా ముందుకు వెళుతుంది. రాహుల్‌గాంధి హెచ్చరించినట్లు దోషులు శిక్ష తప్పించుకోలేరు.



ఇంధన భద్రత భవిష్యత్తు అంతా క్లీన్ ఎనర్జీలోనే

కొవిడ్ మహమ్మారి నుంచి పశ్చిమాసియా సంక్షోభం వరకు ఇవన్నీ ఇంధన భద్రత నేరుగా దేశ ఆర్థిక భద్రతతోనే ముడిపడి ఉందనే స్పష్టమైన సందేశాన్ని ప్రతి దేశానికి అందించాయి. శిలాజ ఇంధనాలపైనే విపరీతంగా ఆధారపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచుగా సంక్షోభాల్లో కూరుకుపోతుంది. మనందరికీ తెలుసు, ఇంధన భద్రత భవిష్యత్తు కేవలం స్వచ్ఛ ఇంధనంలోనే ఉంది. అందుకే పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెంచడమే భారత్ ఎంచుకున్న మార్గం.

- ప్రధాని నరేంద్ర మోదీ



ప్రకృతి సృష్టించిన పారదర్శక అద్భుతం జెల్లీఫిష్

సముద్ర గర్భంలో ఎలాంటి ఎముకలు, గుండె, మెదడు లేదా రక్తం లేకుండానే మిలియన్ల సంవత్సరాలుగా విజయవంతంగా జీవిస్తున్న విచిత్రమైన జీవులు జెల్లీఫిష్‌లు. సముద్ర జీవావరణ వ్యవస్థలో వీటి ప్రాముఖ్యతను తెలియజేయడానికి, అలాగే వీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిఏటా నవంబర్ 3వ తేదీన 'వరల్డ్ జెల్లీఫిష్ డే' (మహాసముద్రాల జెల్లీఫిష్ దినోత్సవం) జరుపుకుంటారు. డైనోసార్లు ఆవిర్భవించడానికి కంటే ముందే, అంటే దాదాపు 500 మిలియన్ సంవత్సరాలకు పూర్వం నుంచే ఇవి భూమిపై ఉనికిలో ఉన్నట్లు శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయి. కాలంతో పాటు వచ్చిన వాతావరణ మార్పులను తట్టుకుని నేటికీ నిలబడటం వీటి ప్రత్యేకత.

జెల్లీఫిష్‌లు నిజమైన చేపలు కావు, ఇవి సముద్రంలో నివసించే అకశేరుక జీవులు. ఇవి జీవశాస్త్ర పరంగా 'నిడేరియా' విభాగానికి, 'స్కిఫోజోవా' తరగతికి చెందుతాయి. సాధారణంగా వీటిని 'ట్రూ జెల్లీఫిష్' అని పిలుస్తారు. ఇవి 'మెడుసా' దశలో ఉండే జెలాటినస్ (అంటే గెలాంటిన్ లాంటి మెత్తని శరీరం) రూపంలో నీటిలో తేలుతూ సంచరిస్తాయి. వీటి శరీరంలో 95 శాతానికి పైగా నీరు మాత్రమే ఉంటుంది. అయినప్పటికీ తమ స్పర్శకాల్లో ఉండే 'నెమటోసిస్ట్స్'అనే విషపూరితమైన కణాల ద్వారా ఆహారాన్ని వేటాడగలవు, శత్రువుల నుండి తమను తాము రక్షించుకోగలవు.

అనేక రకాల సముద్ర జీవులకు జెల్లీఫిష్‌లు ప్రధాన ఆహార వనరుగా పని చేస్తాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న అరుదైన లెదర్‌బ్యాక్ తాబేళ్లు, కొన్ని రకాల పెద్ద చేపలు, సముద్ర పక్షులు వీటిపైనే ఆధారపడి జీవిస్తాయి. ఇవి ఆహార గొలుసులో ఒక ముఖ్యమైన లింక్‌గా ఉంటూ, సముద్రపు జీవావరణాన్ని సమతుల్యంగా ఉంచడంలో సాయపడతాయి. అంతేకాకుండా, చిన్న రకాల చేపలు మరియు పీత పిల్లలు పెద్ద జీవుల బారిన పడకుండా జెల్లీఫిష్‌ల సున్నితమైన భాగాల చాటున ఆశ్రయం పొందుతాయి. ఈ రకంగా ఇవి సముద్రంలో ఒక సురక్షితమైన ఆవాసాన్ని కూడా అందిస్తాయి. వైద్య, అణు జీవశాస్త్ర పరిశోధనల్లో జెల్లీఫిష్‌లు విప్లవాత్మకమైన మార్పులకు కారణమయ్యాయి. 'విక్టోరియా ఆక్వోరియా' అనే జెల్లీఫిష్ జాతి నుంచి సేకరించిన 'గ్రీన్ ఫ్లోరోసెంట్ ప్రొటీన్ వైద్య రంగానికి ఒక దివ్యౌషధంగా మారింది. ఈ ప్రొటీన్ ద్వారా మానవ శరీరంలో క్యాన్సర్ కణాలు ఎలా విస్తరిస్తాయి, అల్జీమర్స్, ఇతర వ్యాధుల ప్రభావం ఎలా ఉంటుంది అనే విషయాలను కణజాల స్థాయిలో అధ్యయనం చేయడం సాధ్యమైంది. ఈ ఆవిష్కరణకుగానూ 2008లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి కూడా లభించింది. అంటే మానవ ఆరోగ్య పరిశోధనలకు జెల్లీఫిష్ ప్రత్యక్షంగా దోహదపడుతోంది.

ప్రస్తుత కాలంలో భూతాపం పెరగడం, సముద్ర నీటి ఉష్ణోగ్రతలు పెరగడం. సముద్ర కాలుష్యం కారణంగా జెల్లీఫిష్‌ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. దీనిని 'జెల్లీఫిష్ బ్లూమ్' అని పిలుస్తారు. ఇతర సముద్ర జీవులు ఉష్ణోగ్రతల మార్పులకు తట్టుకోలేక అంతరించిపోతుంటే, జెల్లీఫిష్‌లు మాత్రం ప్రతికూల పరిస్థితుల్లో కూడా వేగంగా సంతానోత్పత్తి చేసుకోగలవు. ఇవి అధిక సంఖ్యలో పెరగడం వల్ల చేపల వేటకు అంతరాయం కలగడం, సముద్రతీర విద్యుత్ కేంద్రాల కూలింగ్ పైపులు మూసుకుపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇది సముద్రంలో పర్యావరణ అసమతుల్యతకు స్పష్టమైన సంకేతం. వరల్డ్ జెల్లీఫిష్‌డే అనేది కేవలం ఒక విచిత్రమైన జీవిని కొనియాడటానికి మాత్రమే కాదు, మహాసముద్రాల ఆరోగ్యం ఎంత ప్రమాదంలో ఉందో గ్రహించ డానికి ఒక అవకాశంగా భావించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరడం వల్ల, తాబేళ్లు ఆ ప్లాస్టిక్ ప్యాకెట్లను జెల్లీఫిష్‌లుగా పొరబడి తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. సముద్ర కాలుష్యాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం ద్వారా మాత్రమే మనం సముద్ర వ్యవస్థను కాపాడుకోగలం. ప్రకృతిలో ప్రతి జీవికి ఒక నిర్దిష్ట ప్రాధాన్యత ఉందనే నిజాన్ని గ్రహించి, జెల్లీఫిష్‌ల ఆవాసాలను

ఫ్రాన్స్ ఎన్నికలపై

విద్యార్థి నిరసనల ప్రభావం

డెన్నిస్ బ్రోయి

ఫ్రాన్స్‌లోని రెండవ అతిపెద్ద, అత్యంత వైవిధ్యభరిత నగరమైన సెయింట్ డెన్నిస్‌ను కేంద్రంగా చేసుకుని జరుగుతున్న పాఠశాల విద్యార్థుల నిరసన రోజురోజుకూ వేడెక్కుతుండడంతో పాటు, మొదట్లో నిందలు వేసిన పాశ్చాత్య కార్పొరేట్ మీడియా, కొన్నిసార్లు తమ వైఖరిని సరిదిద్దుకోవలసి వస్తోంది.

కొత్త బ్యారక్‌లలోకి దూసుకెళ్తున్న విద్యార్థుల బృందాలను, వారి పాఠశాలల చుట్టూ దిగ్బంధనాలను చిత్రీకరించడానికి బదులుగా, 'ది న్యూయార్క్ టైమ్స్' మొదట్లో ఈ సమీకరణకు చిహ్నంగా మండుతున్న చెత్తబుట్ట వీడియోను ఉత్సాహంగా ప్రచురించింది. తద్వారా నిరసనకారులను హింసాత్మక ఉగ్రవాదులుగా ఆపాదించిది.

సెకండరీ పాఠశాలల్లో మొదలైన ఈ నిరసనలు ఇప్పుడు విశ్వవిద్యాలయాలకు కూడా వ్యాపించాయి. ఇవి కేవలం విద్యార్థులనే కాకుండా, యూనియన్‌లు, ఉపాధ్యాయులను, వారి తల్లిదండ్రులు, తాతలు, నానమ్మ, అమ్మమ్మలను కూడా చుట్టుముట్టాయి. వీరందరూ కేవలం నిరసనలకు మద్దతు ఇవ్వడానికే కాకుండా, అసలైన ఉగ్రవాదులైన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ పోలీసుల నుంచి తమ పిల్లలను, మనమలను కాపాడుకోవడానికి కూడా ముందుకు వచ్చా రు.

విద్యార్థులు ఏమి కోరుకుంటున్నారో, దేనికి ప్రతిస్పందిస్తున్నారో అనే విషయాలను అంతటా కనిపిస్తున్న బ్యానర్లు తెలియజేస్తున్నాయి. పదవీ విరమణ చేసిన లేదా ఒత్తిడిని తట్టుకోలేని ఉపాధ్యాయు ల స్థానంలో కొత్త ఉపాధ్యాయులు రాక పోవడంతో పాఠశాలలు కిటకిటలాడుతున్నా యి. 'పని ఒత్తిడితో అలసిపోయిన కొంతమంది ఉపాధ్యాయుల స్థానం లో 'మా అమ్మ వస్తోంది, కానీ మా అమ్మ స్థానంలో కి ఎవరు వస్తారు?' అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిరసనకారులను అణచివేయడం ద్వారా కాకుండా, ఇతర మార్గాల ద్వారా నిధుల కొరత సమస్య పరిష్కారాన్ని చూడాలి. 'ఫ్లిక్ నాన్ ఫ్లిక్', అంటే పోలీసులకు కాదు, విద్యకు డబ్బు కావాలి. పారిస్, సెంట్రల్ సిటీల వెలుపల ఉన్నవారికి నిధుల కొరత మరింత తీవ్రంగా ఉండటంతో, ఖర్చు చేసే నిధులలో అసమానతలు కనపడుతున్నాయి.

అమెరికా సామాజిక, కార్పొరేట్ మీడియాలో విస్తృతంగా కనిపిస్తున్న చెత్తను తగలబెడుతున్న దృశ్యాలు... మాక్రాన్ తొమ్మిదేళ్ల పొదుపు బడ్జెట్‌ల తర్వాత నిధుల కొరత కారణంగా తమ భవిష్యత్తును నాశనం చేస్తూ, అదే సమయంలో అత్యంత ధనవంతులకు భారీ పన్ను రాయితీలు కల్పిస్తున్నందుకు విద్యార్థులు చేస్తున్న నిరసనకు ప్రధాన ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

వాస్తవ నిరసనలకు, వాటిని ప్రసారం చేస్తున్న తీరుకు మధ్య ఉన్న వ్యత్యాసం, అసలు ఫ్రెంచ్ విప్లవాన్ని బూర్జువా మీడియా ఎలా చూసిందో అనే విషయాన్ని కూడా గుర్తు చేస్తుంది. దానిని ప్రజల విముక్తికి చేసిన తొలి ప్రయత్నంగా కాకుండా, 'భయోత్పాతం' అని పిలవబడిన దానిగా అది దిగజారిపోయినట్లుగా చిత్రీకరించారు. చార్లెస్ డికెన్స్ రచించిన 'ఎ ఎ ఆఫ్ టూ సిటీస్' నవలలో యువ మనసుల్లో బలంగా నాటుకుపోయిన ఈ చిహ్నాలు,



నేటి బూర్జువా మీడియాలో మళ్ళీ వినిపిస్తున్నాయి. ఇక్కడ ఆస్తి, చివరికి చెత్తబుట్టలు కూడా పవిత్రమైనవిగా పరిగణించబడుతున్నాయి. మరోవైపు నిరసనకారులు, ఫ్రెంచ్ రచయిత ప్రౌధాన్ చెప్పిన 'ఆస్తి దొంగతనం' అనే మాటను పునరుద్ఘాటిస్తున్నారు.

నిజానికి, 1789 విప్లవానికి ఆరంభ స్థలమైన బాస్టిల్ వద్ద గత వారం అతిపెద్ద నిరసన జరిగింది. ఇందులో వేలాదిమంది విద్యార్థులు చౌరస్తాను ముట్టడించారు. విప్లవానికి జన్మస్థలమైన ఇక్కడే, విద్యార్థులు 'లే మార్సెయిలీస్' గీతాన్ని ఆలపించి ఈ వారసత్వాన్ని గుర్తించారు. పారిస్ వీధి తిరుగుబాటులో కలవడానికి కార్మిక మిలీషియాలు మార్సెయిల్ నుండి పారిస్‌కు కవాతు చేస్తున్నప్పుడు ఈ గీతాన్ని ఆశువుగా పాడారు.

ట్రంప్ ఈ నిరసనలను కమ్యూనిస్టు, ముస్లిం ప్రేరేపితమైనవిగా అభివర్ణించారు. ఈ రెండు శక్తులే అమెరికాను లోపలి నుంచే కూల్చివేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక అద్భుతమైన, ఆశ్చర్యకరమైన చిత్రీకరణ. ఎందుకంటే అమెరికాను లోపలి నుంచి కూల్చివేయగల అసలైన శక్తి, అంటే నిజమైన పంచమాంగ దళం, ట్రంప్ కుటుంబం, ట్రంపిస్టులు (ట్రంప్‌వాదులు).

ఆ వారంలో నిరసనలు ఒక అప్రతిహత ఉద్యమంగా మారడంతో 'ది టైమ్స్' వాటిని కొంత నిష్పక్షపాతంగా కవర్ చేసింది. కానీ వారి కవరేజీకి పైన, ఫ్రాన్స్ అధిక అప్పుల కారణంగా ఫ్రెంచ్ బాండ్ల ధర ల పెరుగుదలను వేగవంతం చేస్తున్నాయని, ప్రభుత్వానికి రుణాలు తీసుకోవడాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయని తెలిపే మరో కథనాన్ని చేర్చింది. ప్రజలు ఏమన్నప్పటికీ, పొదుపు చర్యలు తప్ప మరో మార్గం లేదనేది ఆ కథనంలోని సారాంశం.

వచ్చే ఏప్రిల్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో నేతృత్వం వహించనున్న మారిన్ లూ పెన్ కొద్దిరోజుల క్రితం తన సొంత ప్రతిపాదిత బడ్జెట్‌ను ఆవిష్కరించారు. ఇది అత్యంత సంపన్న కార్పొరేషన్‌లకు పూర్తిగా వరాలు ఇచ్చేలా ఉంది. ఎందుకంటే ఆమె ఫ్రెంచ్ ప్రభుత్వం నుంచి సుమారు \$154 బిలియన్లు (116.4 బిలియన్‌ల పౌండ్లు) ఆ మొత్తాన్ని తగ్గించాలని ప్రతిపాదించారు.

ఫ్రాన్స్ సామాజిక సేవలను నిర్వహించడానికి అత్యంత సంపన్నులపై 2 శాతం పన్ను విధించాలని తరచుగా ముందుకు తీసుకువచ్చి, అంతే వేగంగా విరమించుకున్న ప్రత్యామ్నాయానికి ఇది విరుద్ధం.

నిరసనకారులలో అధికశాతం మంది సెకండరీ పాఠశాల విద్యార్థులే కావడంతో, తమ ప్రభుత్వం సంపదను పైకి బదిలీ చేయడం వల్ల తలెత్తిన అశాంతిని అణచివేయడానికి మాక్రాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్దిష్ట వ్యూహంపై వారు దృష్టిని సారించారు. ఆ వ్యూహం ఏమిటంటే, భీకరమైన పోలీసు హింసను ప్రయోగించడం. పేలుడు ధాటికి ఒక 15 ఏళ్ల బాలుడి చేయి తెగిపోగా, 16 ఏళ్ల బాలుడు ఒక కన్ను కోల్పోయాడు. బహుశా ఎల్‌బిడి (లాన్సర్ డి బాల్స్ డి డిఫెన్స్) అనే అల్లర్ల నిరోధక గన్‌తో కొట్టినందుకే ఇలా జరిగి ఉండవచ్చు. 5,000 మందికి పైగా విద్యార్థులను అరెస్ట్ చేశారు. వీరిలో అధిక శాతం సెకండరీ పాఠశాల విద్యార్థులే. చాలా మందిని నిర్బంధంలో ఉంచారు.

మాక్రాన్ మరో 'ప్రభావవంతమైన ఆవిష్కరణ' పట్ల కూడా విద్యార్థులు అసంతృప్తిగా ఉన్నారు. అది పార్కోర్సప్ అనే పేరుతో ఎలాన్ మస్క్ తరహా కంప్యూటర్ అప్లికేషన్‌ను ఏర్పాటు చేయడం. ఇది ఇప్పుడు విశ్వవిద్యాలయ దరఖాస్తులను నిర్వహిస్తూ, క్రమబద్ధీకరిస్తుందని భావిస్తున్నా రు.

విద్యార్థులను చేర్చుకునేందుకు అంగీకరించారా లేదా తిరస్కరించారా అనే విషయాన్ని వారికి తిరిగి తెలియజేయడంలో ఈ వ్యవస్థ నెమ్మదిగా వ్యవహరిస్తోంది. అంతేకాకుండా, అత్యంత సంపన్న, పలుకుబడి గల పాఠశాలల విద్యార్థులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని కూడా దీనిపై ఆరోపణలు ఉన్నాయి.

ఈ వ్యవస్థలోని అపారదర్శకత వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. ఫ్రాన్స్‌లోని ఒక విద్యార్థి జీవిత భవిష్యత్తును నిర్ణయించడంలో అత్యంత కీలకమైన ఈ ఎంపిక ప్రక్రియలో ఎలాంటి ప్రమాణాలను ఉపయోగిస్తారో ఎవరికీ తెలియదు.

ఈ నిరసనలు, అత్యంత ప్రజాదరణ పొందిన వామపక్ష పార్టీ అయిన లా ఫ్రాన్స్ ఎన్‌సూమీజ్ (ఎల్‌ఎఫ్‌ఐ) పై కూడా ఆరోపణలకు దారితీశాయి. ఆ పార్టీ, దాని నాయకు డు, అధ్యక్ష అభ్యర్థి అయిన జాన్ లుక్ మెలాన్‌షోన్ ఈ తిరుగుబాటును ప్రేరేపించారని ఆరోపణలు వచ్చాయి. వచ్చే ఎన్నికల రెండవ రౌండ్‌లో పచ్చి మితవాద పక్షానికి చెందిన లూ పెన్, ఎల్‌ఎఫ్‌ఐకి చెందిన మెలాన్‌షోన్‌తో తలపడతారనే భయం తో, మధ్యేవాద, మితవాద పక్షాలలో ఈ ఆరోపణ విస్తృతంగా వ్యాపించింది. ఈ ఆరోపణను మెలాన్‌షోన్‌కు ఏ మాత్రం మిత్రుడు కాని మధ్యేవాద పత్రిక 'లూ మాండ్' కూడా ఖండించింది. దీని మూలాల పై రాసిన ఒక వ్యాసంలో, ఇది ఆకస్మికంగా జరిగిన తిరుగుబాటు అని ఆ పత్రిక పేర్కొంది. నిరసనకారులకు భద్రత కల్పించడంలోనే ఎల్‌ఎఫ్‌ఐ కీలక పాత్ర పోషించింది. వచ్చే ఏప్రిల్‌లో ఈ విద్యార్థులలో చాలామంది ఓటు వేసే వయస్సుకు చేరుకున్నప్పుడు, ఈ పార్టీ గణనీయంగా లబ్ధి పొందవచ్చు.

(సౌజన్యం : మార్నింగ్ స్టార్)

యుపి ఎమ్మెల్సీ ఎన్నికలు – బిజెపిలో కలవరం

మహారాష్ట్రలోనూ మహాయుతికి ఎదురుదెబ్బ

డాక్టర్ జ్ఞాన్‌పాఠక్

ఎం.ఎల్‌సి. ఎన్నికల ఫలితాలు వెలువడిన తదుపరి అక్టోబర్ 28న కాంగ్రెస్ నష్టాన్ని గేలిచేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోస్టు పెట్టారు. బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ గోత్రీకులు దాన్ని అనుసరించారు. ప్రధానమంత్రి పోస్టు ఇలా వుంది ''4 పెద్ద రాష్ట్రాల్లో – ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్నాటకల్లో 28సీట్లకు శాసనమండలి సభ్యుల కోసం ఎన్నికలు జరిగాయి. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిపారు. కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలిచిందో ఊహించండి?''. బిజెపి నాయకుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పద్నవీస్ నుంచి జవాబు వచ్చింది ''పెద్ద సున్న! కాంగ్రెస్ నిలకడగా ఉంది'' అని ఆయన రీ పోస్టు చేశారు.

బిజెపి ప్రధాన కార్యదర్శి ఒకరు ముంబయి నుంచి ఇలా పోస్టు పెట్టారు : ''బ్యాలెట్ పేపర్ లేదా ఇవిఎం–ఏదైనా కాంగ్రెస్ ఫలితం ఒక్కటే!''. అయితే ఆ తర్వాత వెలువడిన మహారాష్ట్ర ఫలితం పద్నవీస్‌ను ఎంతో అవమానభారంలో పడేసింది. ఎందుకంటే ఆయన సొంత జిల్లా నాగపూర్ సీటును కాంగ్రెస్ గెలుచుకుంది. అది ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యనిర్వాహక కేంద్రం కూడా. పద్నవీస్ సిగ్గుతో తన పోస్టు తొలగించారు.

ఇవిఎంల్లో ఓట్లు తారుమారు చేస్తున్నారని ఆరోపిస్తూ, అన్ని ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో జరపాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌ను గుర్తు చేస్తూ ప్రధాని తమ ట్వీట్‌లో బ్యాలెట్ పేపర్ ప్రస్తావన చేశారు. అయితే 2014 నుంచి తాను లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు రెండు ఎంఎల్‌సి స్థానాలను సమాజ్‌వాది పార్టీకి కోల్పోయినందుకు నరేంద్ర మోదీ సిగ్గుపడలేదు. ఆయన కాళ్ల కింద రాజకీయ ఇసుక కదులుతున్నది. మండలి ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగవు. రాజకీయ పార్టీలు అభ్యర్థులను బలపరుస్తాయి.

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎంపిగా ఉన్న లక్నోలో కూడా సమాజ్‌వాది ఒక సీటు గెలుచుకుంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌పూర్–ఫైజాబాద్ టీచర్స్ సీటును బిజెపి కేవలం 307 ఓట్ల ఆధిక్యతతో గెలుచుకుంది. సమాజ్‌వాది పార్టీ తమకు 2020లో ఉన్న మూడు సీట్లను ఐదుకు పెంచుకోగా, బిజెపి తమకున్న 6సీట్లు నిలుపుకుంది. ఆరు టీచర్ల సీట్లలో బిజెపి 4, ఎస్‌పి2 గెలుచుకున్నాయి. గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల్లో చెరి రెండు గెలుపొందాయి. ఆగ్రాలో బిజెపి కార్యకర్తలు ఎస్‌పి అభ్యర్థిని బెదిరించటం, అతను కళ్ళనీళ్ల పర్యంతం కావటం జరిగింది. చివరకు, ఎస్‌పి అభ్యర్థి గెలుపొందారు. సమాజ్‌వాది పార్టీ తమ పిడిఎ (పి–బలహీనవర్గాలు, డి–దళితులు, ఎ–అల్పసంఖ్యాకులు) పునాదిని పటిష్టం చేసుకోవటంతోపాటు శక్తివంతమైన బ్రాహ్మణ సమాజం నుంచి అదనపు మద్దతు పొందినట్లు ఓటింగ్ సరళి తెలుపుతున్నది.

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు. ఇండియా కూటమి భాగస్వామి అయిన ఎస్‌పి అభ్యర్థులను బలపరిచింది. వారణాసిలోని రెండు సీట్లు సహా ఐదు ఎస్‌పి గెలవటం, మోదీకి, బిజెపికి ఆందోళన కలిగించే విషయం. అభిప్రాయాలను తీర్చిదిద్దే విద్యావంతులు బిజెపికి దూరమైనారు. 2027 ప్రథమార్థంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఇండియా కూటమి బలంపుంజుకుంటున్నది. బిజెపి ప్రధాన ప్రత్యర్థి సమాజ్‌వాది పార్టీయే. కాంగ్రెస్, ఎస్‌పి మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయి.

తూర్పు ఉత్తరప్రదేశ్‌లో మోదీ ప్రభావం తగ్గుదలలో ఉన్నట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. పశ్చిమ యుపిలో బిజెపి బలంగా ఉంది – మీరట్ పట్టభద్రుల, టీచర్ స్థానాలు నిలుపుకుంది. బరేలీ – మొరాబాద్, లక్నో టీచర్స్ సీట్లు, ఆగ్రా పట్టభద్రుల సీటు గెలుచుకుంది. అయితే ఎస్‌పి కూడా ఆగ్రా టీచర్స్ సీటు, అలహాబాద్–ఝూన్సీ పట్టభద్రుల సీటు గెలుచుకుని పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కూడా తాము బలపడుతున్నట్లు రుజువుచేసుకుంది.

బిహార్ కూడా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ పరిపాలనలో ఉంది. 8 సీట్లకు ఎన్నికలు జరిగాయి. బిజెపి 3, జెడి(యు)1, ఆర్‌జెడి1, జనసు రాజ్ పార్టీ (తొలిసారి)1, ఇండిపెండెంట్లు 2 సీట్లు గెలుచుకున్నారు.

ఎన్‌డిఎ 2020లో గెలుచుకున్న 4 స్థానాల సంఖ్యను నిలుపుకుంది. అయితే బిజెపి అభ్యర్థి గత 5 పర్యాయాలు గెలిచిన పట్నా టీచర్ సీటులో ఓడిపోవటం ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. ఆర్‌జెడి అభ్యర్థి గెలుపొందారు. తిర్‌హట్ స్థానాన్ని సిపిఐ నుంచి గెలుచుకోవటం బిజెపి ముఖ్యమైన విజయం. దర్భాంగా సీటును కాంగ్రెస్ ప్రశాంత్ కిశోర్ పార్టీ జెఎస్‌పికి కోల్పోయింది.

బిజెపి పాలిత మహారాష్ట్రలో ఐదు సీట్లకు ఎన్నికలు జరగ్గా, పాలక మహాయుతికి రెండు సీట్లే దక్కాయి (బిజెపి1, శివసేన–ఏక్‌నాథ్‌షిండే–1. ప్రతిపక్ష మహావికాస్ అగాడి(ఎంవిఎ) మూడు సీట్లు గెలుచుకుంది – ఎన్‌సిపి (శరద్‌పవార్2, కాంగ్రెస్ 1. కాంగ్రెస్ నాగపూర్ గెలుచుకోవటం ముఖ్యమంత్రి పద్నవీస్‌కు, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి నిజంగా అవమానకరం. అది ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయ స్థానమేగాక, గడ్కరి 2014లో కేంద్ర రాజకీయాల్లోకి వచ్చేవరకు – 24సంవత్సరాలు ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు.

అయితే కర్నాటకలో పాలక కాంగ్రెస్ మొత్తం నాలుగు ఎంఎల్‌సి స్థానాలను కోల్పోయింది. ఇది ఆ పార్టీకి, దాని పరిపాలనకు గట్టి ఎదురుదెబ్బ. అంతర్గత కుమ్ములాటలు విడనాడి పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత చింతించి లాభం ఉండదు.

రెవెన్యూ- ఫారెస్ట్ సరిహద్దు వివాదాలకు
జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం



• ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు సమస్యల కారణంగా సామాన్య ప్రజలు, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకూడదన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం రెవెన్యూ, అటవీ శాఖలు, సర్వే అండ్ సెటిల్‌మెంట్ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శాఖలు పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలో సంయుక్త సర్వేలు చేపట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులను వినియోగించి భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు పూర్తిగా తెరపడుతుందన్నారు.

రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల విభాగాల ద్వారా సమగ్ర సంస్కరణలను అమలు చేస్తోందన్నారు. భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిష్కారం చూపాలని మంత్రి సూచించారు. సంయుక్త సర్వేలకు రైతులు, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. జిల్లా, మండలస్థాయిలో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో సంయుక్త కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పిసిఎఫ్ వినయ్‌కుమార్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లక్ష మంది విద్యార్థులకు
ఉచితంగా ఎఐ, క్లౌడ్ శిక్షణ

• అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో టాస్క్ ఒప్పందం
• నాన్ స్టెమ్ విద్యార్థులకూ ప్రత్యేక శిక్షణ.. అర్హులకు జాబ్ మేళాలు: మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భవిష్యత్తు ఉద్యోగ మార్కెట్‌లో యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు కృత్రిమ మేధ (ఎఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వంపై, కళాశాలలపై, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యూఎస్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.'తెలంగాణ ఎఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా టాస్క్, ఎడబ్ల్యూఎస్ మధ్య సోమవారం తెలంగాణ సచివాలయంలో ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందిస్తామని తెలిపారు. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రయోగాలు, అభ్యాసం చేసేందుకు ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతోపాటు ఆర్ట్స్, కామర్స్ తదితర నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకు కూడా ప్రత్యేక అభ్యాస మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

సాంకేతిక విద్యకే పరిమితం కాకుండా అన్ని విభాగాల విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలను సాధించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. ఈ కోర్సుల్లో చేరిన ప్రతి విద్యార్థికి ఎడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ వేదిక ద్వారా 900కు పైగా డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా అభ్యసించే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ధ్రువీకరణ పరీక్షలకు సంబంధించి రాయితీ వోచర్లు కూడా అందిస్తామన్నారు. విద్యార్థులకు సాంకేతిక నిపుణులతో పరిశ్రమల అనుసంధాన సమావేశాలు, హ్యాకథాన్‌లు నిర్వహించి, వాస్తవ పరిశ్రమల సమస్యలపై పనిచేసే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉద్యోగ మేళాలు నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆయా కళాశాలల అధ్యాపకులకు కూడా ఎఐ, క్లౌడ్ సాంకేతికతల్లో ప్రపంచస్థాయి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐటి శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, టాస్క్ సిఇఒ నితిన్ రెడ్డి, ఎడబ్ల్యూఎస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ హెడ్ అభినవ్, కంట్రీ మేనేజర్ (స్కిల్లింగ్ అండ్ సోషల్ ఇంపాక్ట్) ప్రతిభా, ఎడబ్ల్యూఎస్ అకాడమీ టిపిఎం ఆకాంక్ష రాయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కెటిఆర్‌ది గోబెల్స్ ప్రచారం..

• కెసిఆర్‌ను అసెంబ్లీకి తీసుకురండి : వేముల వీరేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టి, రైతులకు అన్యాయం చేసిన బిఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పర్యటనలో మాజీ మంత్రి కెటిఆర్ అబద్ధాల గోబెల్స్‌గా మారారని విమర్శించారు. సోమవారం సిఎల్‌పి కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కరువు, ఎల్‌నినోపై చిత్తశుద్ధి ఉంటే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలని, చర్చకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. ప్రాణహిత–చేవెళ్లను పూర్తి చేయకుండా ఆదిలాబాద్ రైతులకు బిఆర్‌ఎస్ అన్యాయం చేసిందని ఆరోపించారు. బిఆర్‌ఎస్ ఖాతాలోని రూ.1,500 కోట్లను రైతుల కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం రాష్ట్రంపై పడిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసమే సిఎం ఢిల్లీకి వెళ్తున్నారని స్పష్టం చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో పంట మార్పిడిపై ప్రభుత్వం చేస్తున్న సూచనలను కూడా వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

అమిత్ షా పర్యటన
కాంగ్రెస్‌ను విమర్శించడానికే పరిమితం

• తెలంగాణ విభజన హామీలు, కేంద్ర నిధులపై ఎందుకు మాట్లాడలేదు?: మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన కాంగ్రెస్‌ను విమర్శించడానికే పరిమితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ విభజన హామీల అమలు, రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న నిధులపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయడం మానుకొని, కేంద్రం ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని, అయితే కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్ షా దేశంలోకి చొరబాటుదారులు ఎలా ప్రవేశించారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ఎంతమంది విదేశీయుల ఓట్లు తొలగించారు? ఎంతమందిని వారి దేశాలకు పంపించారు? ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందన్నారు. ఎస్‌ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నెలవారీ పింఛన్లు, ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికి రూ.15 లక్షలు, పెట్రోల్ రూ.50కే అందిస్తామన్న బిజెపి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగ నియామకాలు వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న పన్నులు, తిరిగి రాష్ట్రానికి వస్తున్న నిధులపై కేంద్రం సమాధానం చెప్పాలని కోరారు. దేశంలో మోదీ, అమిత్ షా పాలనలో అదానీ, అంబానీలకే ప్రయోజనం చేకూరుతోందని, ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మణిపూర్ సంక్షోభంపై స్పందించకుండా గల్లీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బిజెపి ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్రం తక్షణమే సహాయం అందించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఎఐతో మార్కెట్ యార్డుల్లో
విప్లవాత్మక మార్పులు

• పంట విక్రయం నుంచి చెల్లింపుల వరకు అంతా డిజిటల్..
• అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎఐ వినియోగం : మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో తెలంగాణలో ఏఐ ఆధారిత డిజిటల్ మార్కెట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. రైతు మార్కెట్ యార్డులోకి ప్రవేశించినప్పటి నుంచి పంట విక్రయం, తూకం, బిల్లుల తయారీ, చెల్లింపుల వరకు అన్ని ప్రక్రియలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పంటలకు ప్రత్యేక లాట్ ఐడీలు, నాణ్యత పరీక్షలు, ఆన్‌లైన్ బిడ్డింగ్, వేలం, రైతు అంగీకారానికి ఓటిపి, డిజిటల్ చెల్లింపులు, ఈ రసీదులు, ఈపర్మిట్ల విధానం అమలు చేయాలని సూచించారు. సిసి కెమెరాలు, డిజిటల్ స్క్రీన్లతో మార్కెట్ కార్యకలాపాలను పర్యవేక్షించాలని, ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన సాంకేతిక వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. వారం రోజుల్లో టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. అదే విధంగా కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది మార్చి నాటికి తొలిదశను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి చదును సవరణలకు ముఖ్యమంత్రి ఆమోదం తీసుకొని వారం రోజుల్లో టెండర్లు పిలవాలని సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌ను నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సమీక్షలో మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐఆర్‌సి సదస్సుతో తెలంగాణకు ప్రపంచ గుర్తింపు

• 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు ప్రీ -సమ్మిట్‌గా నిర్వహణ
• 19న నితిన్ గడ్కరీ, సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
• సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సి) సదస్సును మలచాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మౌలిక వసతుల అభివృద్ధిని ప్రపంచానికి చాటాలని సూచించారు. ఈ నెల 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సదస్సు ప్రారంభం కానుంది. సచివాలయంలో సోమవారం ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులతో సుమారు మూడున్నర గంటల పాటు మంత్రి సమీక్ష నిర్వహించారు. ఐఆర్‌సి సదస్సు ఏర్పాట్లతో పాటు రాష్ట్రంలో కొనసాగుతున్న రోడ్లు, ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. సదస్సులో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో పాటు ప్రత్యేకంగా తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ తెలంగాణ కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఐఆర్‌సి సదస్సును డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీసమ్మిట్‌గా ఉపయోగించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను వివరించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాల్లోని విమానాశ్రయాలు, మెట్రో, రైల్వే స్టేషన్లలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదిలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 85వ ఐఆర్‌సి వేదికగా రాష్ట్ర రోడ్డు నెట్‌వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కీలక ప్రకటనలు వెలువడనున్నాయని, ఈ సదస్సు తెలంగాణ అభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమీక్షలో ఆర్ అండ్ బి శాఖ కార్యదర్శి ఇలంబర్తి, స్పెషల్ సెక్రటరీ గంగాధర్, మోర్త్, ఎన్‌హెచ్‌ఎఐ ప్రాంతీయ అధికారులు, శాఖ చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికతను సంక్షేమ కోణంలో చూడొద్దు: సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహిళా పారిశ్రామికతను సంక్షేమ కోణంలో మాత్రమే చూడకూడదని, రాష్ట్ర ఆర్థిక బలాన్ని పెంచే కీలక రంగంగా గుర్తించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా వ్యాపారవేత్తలకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం 'వి హబ్' ద్వారా కృషి చేస్తుందన్నారు. 'డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ' వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్' తొలి సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం జరిగింది. ఈ కౌన్సిల్‌కు 'వీ హబ్' సిఇఒ సీత పల్లచోళ్ల కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ, స్వయం సహాయక సంఘాల నెట్వర్క్‌ల ద్వారా మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. నాలుగు కీలక రంగాలపై కౌన్సిల్ దృష్టి సారిస్తుందని సీతక్క తెలిపారు.

బిజెపి పతనం మొదలైంది

• రాహుల్‌గాంధీ ర్యాలీ దెబ్బకే అమిత్ షా పోటీ ర్యాలీ : ప్రభుత్వ విప్ దయాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పదవి నుంచి దించాలని బిజెపి నేతలు కలలు కంటున్నారని, వారి ప్రయత్నాలు ఫలించబోవని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. రేవంత్‌రెడ్డిని దింపడం కాదు.. కేంద్రంలో ప్రధాని మోదీ, అమిత్ షాల ప్రభుత్వాన్ని దింపే రోజులు దగ్గరపడ్డాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. బిజెపి పతనం ప్రారంభమైందని, తెలంగాణలో ఆ పార్టీకి అధికారం ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అమిత్ షా నిర్వహించిన ర్యాలీపై స్పందించిన అద్దంకి దయాకర్.. రాహుల్‌గాంధీ ర్యాలీకి వచ్చిన స్పందన చూసి అమిత్ షా పోటీ ర్యాలీ నిర్వహించారని విమర్శించారు. అయినప్పటికీ బిజెపి కార్యకర్తలు, ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉందంటూ అమిత్ షా మాట్లాడుతున్నారని, వాస్తవానికి బిజెపినే క్రిటికల్ ఐసియులో ఉందని ఎద్దేవా చేశారు. మోదీ, అమిత్ షాల పాలనకు ముగింపు పలకాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోదీ, అమిత్ షాలకు పన్నులు చెల్లిస్తున్నారా అంటూ నిలదీశారు. నిజాయితీగా పాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం సరికాదన్నారు. తెలంగాణకు ప్రధాని మోదీ నుంచి బిజెపి ఎంపిల వరకు పలువురు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని అద్దంకి దయాకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో బిజెపికి రాజకీయంగా చోటు లేదని, ఆ పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అణచివేత చర్యలకు వ్యతిరేకంగా
జర్నలిస్టులు ఐక్యం కావాలి

• పంజాబ్–చండీగఢ్ జర్నలిస్ట్ యూనియన్ వార్షికోత్సవ వేడుకల్లో వక్తల పిలుపు!



లూధియానా : దాడులు, బెదిరింపులు, తప్పుడు కేసులు, నిర్బంధాలు , ఆంక్షల ద్వారా మీడియా గొంతు నొక్కడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని జర్నలిస్టులు ప్రతిఘటించాలని పలువురు వక్తలు పిలుపు ఇచ్చారు. పంజాబ్ – చండీగఢ్ జర్నలిస్టు యూనియన్ 13వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం లూధియానా బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర స్థాయిలో వేడుకలు జరిగాయి. 'గదర్' పత్రిక సంపాదకుడు, విప్లవకారుడు, షహీద్ కర్తార్ సింగ్ సరాభాకు అంకితంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి 22 జిల్లాల నుండి 250 మందికి పైగా పాత్రికేయులు హాజరయ్యారు. తొలుత షహీద్ కర్తార్ సింగ్ చిత్రపటానికి అతిథులు పుష్పాంజలి ఘటించారు. పలువురు మేధావులు, రచయితలు, జర్నలిస్ట్ యూనియన్ జాతీయ, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తూ ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా పాత్రికేయులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. మీడియా గొంతు నొక్కడానికి జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టడం, వారిపై దాడులు చేయడం, పోలీసులు, పౌర యంత్రాంగం ద్వారా వారిని భయభ్రాంతులకు గురిచేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. సమాచార వ్యవస్థను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చట్టాలను, అడ్డగోలు నిబంధనలను తీసుకు వస్తోందని వారు తెలిపారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం ప్రకారం, వార్తా కథనాలను ప్రచురించే ముందు లేదా ప్రసారం చేసే ముందు సంబంధిత వ్యక్తుల నుండి ముందస్తు సమ్మతి తీసుకోవాలనే నిబంధన పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టని విమర్శించారు. జర్నలిజం రంగాన్ని ఈ చట్టం పరిధి నుండి మినహాయించాలని డిమాండ్ చేస్తూ డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించిందనీ, ఈ చట్టం అమలుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వక పోయినప్పటికీ, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తెస్తున్న ఇలాంటి ఆంక్షల వల్ల అనేక న్యూస్‌రూమ్‌లు మూతపడే ప్రమాదం ఉందని వక్తలు హెచ్చరించారు. ప్రముఖ మేధావి, బాబా ఫరీద్ విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్యారా లాల్ గర్గ్, పంజాబ్ విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యుడు, అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుఖ్‌దేవ్ సింగ్ సిర్సా, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము, ఐజెయు సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, ఐజెయు పూర్వాధ్యక్షుడు ఎస్.ఎన్.సిన్హా, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.ఎస్.ధలీవాల్ తదితరులు కార్యక్రమంలో మాట్లాడారు. బల్వీందర్ సింగ్ జమ్ము మాట్లాడుతూ మీడియాని అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్ధతులను అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలను కవర్ చేస్తున్న సమయంలో జర్నలిస్టులను, ముఖ్యంగా మహిళా పాత్రికేయులను వేధించిన ఘటనలను ప్రస్తావిస్తూ జర్నలిస్టులు కేవలం తమ వృత్తిపరమైన బాధ్యతలను మాత్రమే నిర్వర్తిస్తున్నారనీ, వారు తమ గుర్తింపు కార్డులను కూడా చూపించినప్పటికీ పోలీసులు పట్టించుకోకుండా పాశవికంగా దాడు లు చేశారని, అరెస్టులు చేసి వేధించారని బల్వీందర్ సింగ్ మ్ము విమర్శించారు. మీడియాను మతప్రాతిపదికన విభజించే ప్రయత్నాలు కూడా ఇటీవల జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ దేశంలో మీడియా రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నప్పటికీ వర్కింగ్ జర్నలిస్టుల వేతనాలు అల్పంగా ఉంటున్నాయని వారు గత ఇరవై ఏళ్లుగా వేతన సవరణకు నోచుకోలేదని, పైగా పని పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని వెంటనే పునరుద్ధరించాలని, వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బిందు సింగ్, జగ్తార్ భుల్లర్, జగ్తార్ సిద్ధూ, సుఖ్‌నైబ్ సిద్ధూ, జగ్సీర్ సంధు, తేజిందర్ థిండ్ తదితరులు పాల్గొన్నారు. యూనియన్ వ్యవస్థాపక కమిటీ సభ్యులను, సీనియర్ పాత్రికేయులను ఈ సందర్భంగా సత్కరించారు.

నగరపాలక సంస్థ, కరీంనగర్.
నెం.A/14562/2026-27 వేలం ప్రకటన తేదీ: 31-10-2026
ఇందుమూలముగా కరీంనగర్ నగరపాలక ప్రజలకు తెలియజేయునది ఏమనగా నగరపాలక సంస్థ కరీంనగర్ పాత యునాని హాస్పిటల్ స్థలములో కరీంనగర్ నగరపాలక సంస్థచే నిర్మించబడిన భవనము (పాత పాస్‌పోర్ట్ ఆఫీసు) వద్ద క్రింది అంతస్తులో (6) షాప్‌లు నెలసరి అద్దెపై లీజుకి ఇచ్చుటకు మరియు మొదటి అంతస్తులో ఓపెన్ హాల్ మొత్తం నెలసరి అద్దెపై లీజుకి ఇచ్చుటకు తేదీ: 10-11-2026న ఉదయము 11.00 గం.లకు కార్యాలయ సమావేశ మందిరము హాలులో బహిరంగ వేలం ఈ దిగువ సంతకము దారుచే నిర్వహించబడును.

క్ర. సం.	వేలం నిర్వహించు భవనము యొక్క వివరములు	వేలం యందు చెల్లించ వలసిన ధరావత్తు మరియు దరఖాస్తు రుసుం	వేలం సమయములో దాఖలు చేయవలసిన ధృవీకరణ పత్రములు
1	క్రింది అంతస్తులో (6) షాప్‌లు మొత్తం ఒకరికే లీజుమీద కేటాయించుటకు	వేలంలో పాల్గొనదలచిన వారు కమిషనర్, మునిసిపల్ కార్పొరేషన్, కరీంనగర్ గారి పేరున రూ.2,00,000/- డిపాజిట్ క్రింద, దరఖాస్తు ఫీజు రూ.5,000/- (రూ.లు అయిదువేలు) డిడి రూపంలో చెల్లించి, వేలం సమయములో వేలం నిర్వహించు అధికారికి చూపించి వేలంలో పాల్గొన వలసి యుండును.	వారి యొక్క ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఇంటి యజమాని ధృవీకరణ పత్రం / ఇంటి పన్ను చెల్లించిన రశీదు వేలం సమయములో చూపించి వేలంలో పాల్గొనవలెను.
2	మొదటి అంతస్తులో ఓపెన్ హాల్ మొత్తం ఒకరికే లీజు మీద కేటాయించుటకు	వేలంలో పాల్గొనదలచిన వారు కమిషనర్, మునిసిపల్ కార్పొరేషన్, కరీంనగర్ గారి పేరున రూ.2,00,000/- డిపాజిట్ క్రింద, దరఖాస్తు ఫీజు రూ.5,000/- (రూ.లు అయిదువేలు) చెల్లించి, వేలం సమయములో వేలం నిర్వహించు అధికారికి చూపించి వేలంలో పాల్గొన వలసి యుండును.	

ఇతర నియమ నిబంధనలు ఈ కార్యాలయము రెవెన్యూ విభాగములో పని చేయు వేళల యందు పొందగలరు.
సం/- కమిషనర్
నగరపాలక సంస్థ, కరీంనగర్
DIPR R.O. No. : 12947-PP/CL/ADVT/2026-27, Date: 02-11-2026

విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

ప్రజాపక్షం/నెక్కొండ: విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణను, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని డిఇ, టిజి రెడ్‌కో రాజేందర్ గంధం నెక్కొండలో జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల సందర్భంగా మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) లక్ష్యాలను ప్రజలు నిత్య జీవితంలో ఆచరించాలని సూచించారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆదా చేసే ప్రతి యూనిట్ విద్యుత్ దేశ సంపదకు తోడ్పడుతుందని, పొదుపు చేసే ప్రతి నీటి బొట్టు భావితరాలకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. 'విద్యుత్‌ను ఆదా చేద్దాం..నీటిని సంరక్షిద్దాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ సుస్థిర భవిష్యత్తు కోసం భాగస్వాములు కావాలని రాజేందర్ గంధం విజ్ఞప్తి చేశారు.

బ్లాక్ మార్కెట్ బియ్యం దందా ఆపండి



ప్రజాపక్షం/ నర్సంపేట : బ్లాక్ మార్కెట్ బియ్యం దందాను ఆపాలని వరంగల్ జిల్లా కన్స్యూమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, కన్వీనర్ ఎర్రబోయిన రాజశేఖర్‌లు అన్నారు. సోమవారం ప్రజావాణిలో బియ్యం వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారన్న సమాచారం మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో కరువు ప్రభావం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వంమూడు రకాల బియ్యం ధరలను నిర్ణయించారు. బిపిటి/కెఎన్ఎం రూ. 66, ఆర్ఎన్ఆర్ సోనా రూ.74, హెచ్ఎంటి/ జై శ్రీరామ్ రూ.79 ధరలను కాకుండా ఇదే అదనుగా బియ్యం వ్యాపారులు రూ. 80 నుండి రూ. 95లు అధిక ధరలకు అమ్ముతున్నారు. వీరి వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు దోపిడికి గురి అవుతున్నారన్నారు. వీరిపై చట్టపర చర్యలుతీసుకొని ప్రజలకు న్యాయం గా బియ్యం అందేటట్లు చూడాలన్నారు. ఆహార నిల్వలు అధికంగాఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి 20 కెజీలు, ఆధార్ కార్డు ఉన్నవారికి 10కెజీల బియ్యాన్ని రూ. 38 చొప్పున అందించి వచ్చే ఎలొనినో కరువునునియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వాన్నికోరుతున్నారు. ఈకార్యక్రమంలో కన్స్యూమర్ ఫోరం బాధ్యులు బెజ్జంకి ప్రభాకర్, నాగెల్లి సారంగం, బోయిని వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి



ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో యున్న ప్రభుత్వభూములు రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అన్యాక్రాంతం అవుతున్నాయని సిపిఐ జఫర్‌గడ్ మండల జోన్ బాధ్యులు వడ్లకొండ సుధాకర్ అన్నారు. సోమవారం స్టేషన్ ఘనపూర్ డివిజనల్ రెవిన్యూ ఆఫీసులో ప్రజావాణి కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిఒకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ప్రధానంగా మండలంలోని అలియాబాద్ రెవెన్యూ శివారు పరిధిలోని సర్వే నెంబర్ 10లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని కొన్ని నెలలు గా పార్టీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మండ ల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టా లని కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడేందుకు తాగిన చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎండి.యాకు పాషా, వేల్పుల పెద్ద రాములు, అన్నెపు అజయ్, ఎండి.నూర్జిన, అన్యపు విష్ణు, కుక్కల శోభ మంద బుచ్చయ్య పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పావని తనిఖీ



ప్రజాపక్షం/టేకుమట్ల: భూపాలపల్లి జిల్లా మండలంలోని వినాయక మెడికల్ షాపులో ఆకస్మికంగా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పావని, ఎస్ఐ అమూల్య తనిఖీలు చేశారు. మెడికల్ షాపులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ పావని ఎస్ఐ అమూల్య సూచించారు. ఈ సందర్భంగా షాపుల్లోనే మందుల నిల్వలు, మందుల కొనుగోలు, అమ్మకాల బిల్లులు, గడువు ముగిసిన మందులు, డ్రగ్ లైసెన్స్, ఫార్మసిస్ట్ వివరాలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన మందులు అందించాలని వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయించకూడదని సూచించారు. గడువు ముగిసిన మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా మెడికల్ షాపుల యజమానులు నిబంధనలు పాటించాలని డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

ప్రజాపక్షం/పాలకుర్తి: అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలని ఎమ్మెల్సీ ఓటరు నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎ మ్మె ల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమో దు ప్రక్రియకు ఈ నె 6 చివరి తేదీ కావడంతో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎ న్ఎస్‌యుఐ నాయకులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఓటరు నమోదు కోసం గడువు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, అర్హులైన పట్టభద్రులందరు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

వరంగల్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్



ప్రజాపక్షం/వరంగల్ : వరంగల్ జిల్లాను కరు వు ప్రాంతంగా ప్రకటించాలని, రైతాంగాన్ని ప్ర భుత్వం తక్షణమే ఆదుకోవాలని, రైతులకు సా గు నీరు వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్ తమ్మెర భ వన్‌లో సోమవారం జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ముఖ్య కార్యకర్తల సమావేశానికి సంఘీ ఏలేంధర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో ఈ సంవత్సరం వర్షా భావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన సమయానికి వర్షాలు కు రవక పోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికి ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులకు పెట్టుబడి భారం పెరిగి అప్పు ల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని, పంటల బీమా పరిహారం చెల్లించాలని రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేసి చెరువులు కుంటల్లో నీటిని నింప డంతో పాటు రైతులకు సాగునీరు అందించాలని, వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రత, సంక్షేమ సదుపాయాలు కల్పించే వరకు ఎఐటియుసిఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నూతన మండల కమిటి ఎన్నిక

అనంతరం మహాదేవపూర్ మండల తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా కుమ్మరి చిన్న లక్ష్మీ య్య, అధ్యక్షుడు కాల్వపల్లి శారద, ఉపాధ్యక్షుడు చింతకుంట్ల సుజాత, ఎస్.కె షాకీర్ బేగం, కార్యదర్శిగా మార్గం స మ్మక్క, సహాయ కార్యదర్శి కోట పద్మ, సిహెచ్ వెంకటమ్మ, కోశాధికారి సుమలతలను పదిమంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షురాలు సుగుణ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీస్‌ల దాడి.. ఏడుగురు అరెస్ట్..



ప్రజాపక్షం/గణపురం: పేకాట ఆడుతున్న వారిపై గణపురం పోలీసులు దాడి నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గణపురం ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న గణపురం మండల కేంద్రంలోని నాగవీధికి చెందిన ఏడుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుండి పేకాటకు ఉపయోగిస్తున్న నగదును పరిశీలించగా రూ.5290 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్ హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో పేకాట స్థావరాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటూ పోలీస్‌లకు తెలియజేయాలని సూచించారు.

మండలస్థాయి ప్రజావాణికి స్పందన కరువు

స్వీకరణకే పరిమితం..పరిష్కారంపై ప్రజల్లో నిరాశ



ప్రజాపక్షం/వేలేరు : ప్ర జా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు వినతులు సమర్పిస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినతులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపడంతోనే అధికారులు సరిపెడుతున్నారని, వాటిపరిష్కారంపై పర్యవేక్షణ కొరవడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తుల పురోగతిపై సమాచారం లేక పోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. ప్ర జావాణి కేవలం వినతుల స్వీకరణకే పరిమితం చేయకుండా ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించి బాధితులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ డిమాండ్



ప్రజాపక్షం/భూపాలపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు కల్పించాలని మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికను ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నుంచి పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిత్యం భోజనం అందిస్తూ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా గౌరవ వేతనాలను పెంచి ప్రతి నెలా సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

116 దరఖాస్తులు స్వీకరించిన బల్దియా కమిషనర్ వెంకన్న



ప్రజాపక్షం/ఖిలావరంగల్: ప్రజావాణిలో అంది న ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం సహించబోమని స్పష్టం చేశారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత విభాగాలకు పంపించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, సూపరింటిండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ముఖ్య హార్టి కల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కార్యదర్శి అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యం: కలెక్టర్

ప్రజాపక్షం / జనగామ : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వస్తున్న అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సమస్యల్ని క్షుణంగా పరిశీలించి ప్రాధాన్యత కలిగినవి పరిష్కరించాలన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్నాలోమ్‌తో కలిసి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 221 అర్జీలు అందగా వాటిని క్షుణంగా పరిశీలించి ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామానికి చెందిన మల్‌రెడ్డి నారాయణమ్మ తనకు ఎకరం నాలుగు గుంటల భూమి ఉందని, టిఒబిలో ఆగి న్నందున తమ వారసుల పేరు మీదకు విరాసత్ చేయగలరని విజ్ఞప్తి చేశారు. స్టేషన్‌ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన కరాజుల ధర్మారెడ్డి అక్రమంగా కొందరు తన భూమి ఆర్ఓఆర్ ద్వారా పట్టా చేయించుకున్నారని ఆ భూమి పట్టా రద్దు చేసి రికార్డుల్లో తమ పేరుకు సరిచేసి పాస్‌పుస్తకం ఇప్పించాలని కోరారు. జఫర్‌గడ్ మండలం కూనూరు గ్రామానికి



చెందిన రైతులు ఆకేరు చెక్ డ్యాం నుండి పక్క గ్రామానికి చెందిన కొంత మంది అక్రమంగా మోటార్లు ఎర్పాటు చేసి పైపులైన్ల ద్వారా నీటిని తరలిస్తూ ప్రజా నీటిని దుర్వినియోగం చేస్తున్నారని, అక్రమ మోటర్లు, పైపులైన్లు తొలగించి ప్రజా వనరుల్ని పరిరక్షించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలా పలు సమస్యలపై ప్రజలు కలెక్టర్‌కు ఆర్జీలు సమర్పించారు. ఈ ప్రజావాణిలో డిఆర్‌డిఒ భాస్కర్, సిపిఒ చినకోట్యానాయక్, ఎన్‌పిడిసిఎస్ ఎస్ఇ సంపత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు మహమ్మారికి దూరంగా యువత

కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపు



ప్రజాపక్షం/భూపాలపల్లి: యువత పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అవగాహన పొగాకుపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పొగాకు రహిత యువతే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొగాకు వ్యసనాలకు బానిసలై యువత తమ అమూల్యమైన జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని సూచించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 26 వరకు 60 రోజుల పాటు దేశవ్యాప్తంగా పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యశాఖ అధికారి సిహెచ్ మధుసూదన్ మాట్లాడుతూ.. పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డిఆర్ఒ వసంతకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, జాతీయ అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ దేవేందర్, జిల్లా కార్యక్రమ సమన్వయకర్త మురళీధర్ రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ నాగరాణి, సుధీర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు ఫార్మర్ ఐడి తప్పనిసరి



ప్రజాపక్షం/ములుగు: జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ఫార్మర్ ఐడి పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సూచించారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అగ్రిస్టాక్...ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుపై అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, జి సంపత్‌రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ అందేలా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సురేష్ కుమార్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండలో అమల్లోకి నూతన సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం

మూడు నుంచి ఐదు రోజుల్లో అనుమతులు మంజూరు
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు మట్టి (గ్రావెల్) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో నూతనంగా పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన సమీకృత గ్రావెల్(మట్టి) నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం) పోర్టల్‌ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అమలు గురించిన వివరాలను అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మీడియాకు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ఈ విధానం ద్వారా పౌరులు తమ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఒటిపిద్వారా సులభంగా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.దరఖాస్తులు సంబంధిత అధికారులకు చేరతాయని, రెవెన్యూ భూములకు సంబంధించిన అనుమతులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమన్వయంతో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన అంశాలుంటే ఆ శాఖ లాగిన్‌కు కూడా దరఖాస్తును పంపించడం జరుగుతుందన్నారు. సొంత పట్టా భూమి నుంచి గ్రావెల్ తీసుకోవాలనుకుంటే పట్టాదారు పాస్‌బుక్ కాపీని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇతరుల పట్టా భూమి నుంచి తీసుకోవాలనుకుంటే సంబంధిత భూయజమాని నుండి సమ్మతి పత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.అనుమతి మంజూరైన తర్వాత పూర్తి వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుందన్నారు. అలాగే అనుమతించిన ట్రాక్టర్లు, ఇతర వాహనాల నంబర్లు కూడా నమోదు అవుతాయని, అనుమతి పొందిన వాహనాల ద్వారా మాత్రమే గ్రావెల్ (మట్టి)తరలించాల్సి ఉంటుందన్నారు. ఈ పోర్టల్ ఇసుకకు సంబంధించినది కాదని, (మట్టి)గ్రావెల్ మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇసుక కోసం ఇప్పటికే ప్రత్యేక పోర్టల్ ఉందని తెలిపారు. జిల్లాలో నూతనంగా తీసుకువచ్చిన ఈ విధానం ద్వారా ఇసుక అనుమతులు జారీ చేయడం జరగదని తెలిపారు. జాతీయ రహదారుల వంటి పనులకు 2వేలు లేదా 3వేల మెట్రిక్ టన్నుల పరిమాణంలో అనుమతులు తీసుకునే ప్రక్రియ అందులో ఉందని వివరించారు. గ్రావెల్ అవసరమైన ప్రతి ఒక్కరూ ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం (ఐ జి ఎం ఎస్) పోర్టల్ కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు లాంఛనంగా ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఒ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఎడి రామాచారి, డి ఆర్ డి ఒ మేన శ్రీను, సిపిఒ సత్యనారాయణరెడ్డి, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్,సిజిజి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఇడిఎం శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు వేగవంతం

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని వేగవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇది ప్రకృతి కరువు కాదని కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థత లేకపోవడం వల్ల వచ్చిన కరువు అని అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం మండలంలో నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్, గ్రామాల్లో నమోదు చేసిన పట్టభద్రుల ఓట్లను కెసిఆర్ ప్రత్యేకంగా డిజైన్ చేయించిన పార్టీ యాప్ ద్వారా మన ఓటర్ల నమోదు వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కోసం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటో, ఓటరు ఐడి కార్డు, మొబైల్ నెంబర్, అప్లికేషన్ ఫారాలు నింపి నమోదు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు విజయ్‌కుమార్, అజ్మీర వీరునాయక్, మద్దినేని వెంకటరమణ, గుత్తా రవి, నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, దండా జ్యోతిరెడ్డి, కొనకంచి ప్రసాద్, వల్లభనేని రామారావు, మాధంశెట్టి హరిప్రసాద్, పిన్ని కోటేశ్వరరావు, మెంటెం రామారావు, లక్ష్మణ్ నాయక్, యాసా రామారావు, పెంట్యా, శంకర్, రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వేసవి తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు : విద్యాచందన

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఎల్ నినో ప్రభావంతో రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 15 నుండి డిసెంబర్ 31వరకు చేపట్టనున్న మిషన్ భగీరథ ప్రత్యేక డ్రైవ్‌పై సమీక్షించారు. జిల్లాలోని చేతిపంపులు మోటార్లు పైప్‌లైన్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని, నీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ నిర్వహించాలని సూచించారు. ప్రతీ మండల కేంద్రంలో బ్లీచింగ్ పౌడర్ నిల్వలు సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెం.1916పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వేసవిలో ఏ ఒక్క ఆవాసంలోనూ నీటి ఎద్దడి తలెత్తకుండా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఐటిడిఎ ఎపిఒ హామీతో దీక్షలు విరమణ

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఎ ఎదుట చేపట్టిన 22 రోజుల దీక్షలను ఎపిఒ జనరల్ డేవిడ్ రాజు హామీతో సోమవారం విరమించారు. శిబిరం వద్దకు వచ్చిన డేవిడ్ రాజు దీక్షాపరులకు నిమ్మరసం అందించి దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ సర్వేనెం.83 లో 790 సెంట్ల ప్రభుత్వ భూమిపై సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడామని సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చర్ల మండలంలోని కుదునూరు దేవరపల్లి పోటు భూము సమస్యలను తొందరగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలపై ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ప్రతీ నెలా ఆదివాసీ నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి అభిప్రాయాలు సేకరిస్తామని హామీ ఇచ్చారు.

అమరుల ఆశయానికి పోరాడుదాం

ప్రజాపక్షం/గుండాల : భూమికోసం, భుక్తికోసం పేదప్రజల విముక్తికోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల ఆశయ సాధనకై పోరాడాలని న్యూడెమోక్రసి పార్టీ మండల కార్యదర్శి, సర్పంచ్ కోరం సీతారాములు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రోళ్లగడ్డ, నర్సాపురం గ్రామాల్లో అమరుడు లింగన్న, బోడ వీరు స్తూపాల వద్ద ఎర్రజెండాలను ఎగురవేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ ఉమ్మడి గుండాల మండలంలో అమరులు బాటన్న, లింగన్న, నాయకత్వంలో పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం, నేటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు ప్రజలకు ఒరగపెట్టింది లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమన్నారు. కార్యక్రమంలో ఈసం క్రిష్ణ, గడ్డం లాలయ్య, ఎల్లన్న, బానోత్‌లాలు, భూక్యవేణు, బోడ రాము, రమేష్,పాల్గొన్నారు.

ఖమ్మంను కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం జిల్లా మొత్తాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. సంఘ సమావేశం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం మలీదు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను భయపెడుతూ పంటలు వేయకుండా చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కరువు చర్యలు చేపట్టకుండా బాధ్యత నుంచి తప్పించుకో చూస్తుందని అచ్చయ్య తెలిపారు. కరువు వల్ల నష్టపోతున్న వారికి పరిహారం ఇవ్వకుండా తప్పించుకునేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం సాగుకు అనుకూలమైన విత్తనాలను ప్రభుత్వం అందించాలని, వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, తేజ్ నాయక్, పాశం అప్పారావు, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పిజి కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాపక్షం/ఖమ్మం : స్థానిక ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పిజి అటానమస్ కళాశాలలో వివిధ పిజి కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు ఈనెల ఐదున స్పాట్ అడ్మిషన్లు ఉదయం 11 గంటల నుంచి నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అసలు ధృవపత్రాలతో రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని సూచించారు. స్పాట్ ప్రవేశం పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని ఆయన తెలిపారు. ఎంఎ తెలుగు, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, యంకాం కామర్స్, యంఎస్సీ కెమిస్ట్రి, ఫిజిక్స్, బోటని, జువాలజీ, కంప్యూటర్ సైన్స్‌లో ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పిజి సెట్ రాసిన, రాయని వారు కూడా హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. సంబంధిత డిగ్రీ సర్టిఫికెట్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9666398304 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేయండి

అండగా ఉంటాం

ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/పాల్వంచ : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని, దానికి సిపిఐ అండగా ఉంటుందని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు చేస్తున్న నిరధిక సమ్మె శిబిరాన్ని సోమవారం సందర్శించి తమ సంఘీభాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కరోనా లాంటి కష్ట కాలంలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు. తక్కువ వేతనాలతో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ఎంతమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వారి శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆరోపించారు. 78 కేడర్ల ఎన్‌హెచ్ఎం ఉద్యోగులదరినీ ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

మహిళా ఉద్యోగులకు వేతనాలతో కూడి ప్రసూతి సెలవులు ఇవ్వకపోవటం దారుణమని మండిపడ్డారు. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారికి ఇన్సూరెన్స్ లేకపోవటం శోచనీయమని, ప్రభుత్వం స్పందించి ఇన్సూరెన్ కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తూ సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చెశారు. 1195 జీఓ వలన తగ్గిన వేతనాలను సవరించాలని, అన్ని కేడర్లకు న్యాయం జరిగేటట్లు పెంచిన జీతాలలో ఎటువంటి మార్పులు లేకుండా నూతన జీవో అమలు చేయాలన్నారు. మీ సమస్యలు పరిష్కారం అయ్యేదాకా పోరాటం చేయాలని, మీకు సిపిఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాంబశివరావు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.





లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటాం

తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన పాల్వంచ హెచ్‌పి గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీ నారాయణ కుటుంబానికి అండగా ఉంటామని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక నవభారత్‌లోని లక్ష్మీ నారాయణ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం నుండి అందాల్సిన సహాయ సహకారాలు, సంక్షేమ పథకాలను సకాలంలో అందించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం కేసు పురోగతిపై ఎస్‌పి రోహిత్‌రాజుకు ఫోన్ చేసి ఆరా తీశారు. కేసు విచారణ వేగవంతం చేసి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసం శెట్టి పూర్ణచందర్‌రావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, గుర్రం వెంకటేశ్వర్లు, బాలునాయక్, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, దినేష్, పద్మశాలి సంఘం నాయకులు గుండు రవి కుమార్, ఉదయ్, కన్నయ్య, బొమ్మ రామకిషోర్ తదితరులున్నారు.

యువతను వ్యసనాలకు దూరంగా ఉంచాలి

కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : యువతను పొగాకు, మాదక ద్రవ్యాలు తదితర వ్యసనాలకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 60రోజుల పాటు పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాలలో పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు, యువత వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. పొగాకు వినియోగం వల్ల గుండె, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించాలన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే మానసిక, సామాజిక సమస్యల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. వ్యసనాల నిర్మూలనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి, వ్యసనాలకు బానిసలు కావద్దు జీవితాన్ని ఆనందంగా గడపండి అనే నినాదాలతో యువతలో చైతన్యం తీసుకు రావాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా పొగాకు, మత్తు పదార్థాల వినియోగం నుంచి దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నూతన విద్యా విధానం రద్దు

ఎఐఎస్ఎఫ్ నేత రామకృష్ణ డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మం : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, రద్దు చేసేంత వరకు ఎఐఎస్ఎఫ్ వివిధ రూపాల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. భారతదేశంలో నూతన విద్యా విధానం పేరుతో విశ్వ విద్యాలయాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షుడు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ మత ఎజెండాను విద్యా విధానంలో చొప్పించే ప్రయత్నం జరుగుతుందన్నారు. మరో పక్క ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులను యూనివర్సిటీలలో నియమిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన రీతిలో నిధులు కేటాయించడంలేదన్నారు. నిధులు లేకుండా భవిష్యత్తు తరాన్ని ఎలా తయారు చేస్తారని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను ప్రస్తుత పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని, యూనివర్సిటీలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇబ్బందికర పరిస్థితులను ప్రభుత్వమే సృష్టిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యారంగ సమస్యల పరిష్కారంలో తాత్సరం చేస్తుందని ఆయన తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకు సమస్యల పరిష్కారానికి కనీస చొరవ చూపడంలేదన్నారు. సంక్షేమ గురుకులాల్లో పరిస్థితి దారుణంగా ఉందని, ఈ సమస్యల పరిష్కారానికి ఆందోళన ఒక్కటే మార్గమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బూర మనోజ్, నాయకులు చిన్నంశెట్టి ఆకాష్, నాగులమీరా, మధు, శివ, అభిరాంరెడ్డి, మనోహర్, అమృత, దుర్గ, భవాని పాల్గొన్నారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెంకు చెందిన కె.రవీంద్రబాబు సర్వే నెం.230లో ఉన్న భూమిని సర్వే చేసి రికార్డు మార్పు చేయాలని దరఖాస్తు చేశారు. ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం తురకగూడెం సర్పంచ్ బుర్రా కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయించారని, దురదృష్టవశాత్తు ఆ కుటుంబ సభ్యులంతా మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కుదారులు ఉంటే పరిశీలించాలని, లేకపోతే మరో లబ్ధిదారుని ఎంపిక చేసి పంపిణీ చేయాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం, వందనం గ్రామానికి చెందిన ప్రజలు, మత్స్యశాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్, డిఆర్‌వొ సిహెచ్.రామ్మూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరువు మండలంగా చింతకానిని ప్రకటించాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల

సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



ప్రజాపక్షం/చింతకాని : చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ చింతకాని మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చింతకాని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, గోదావరి జలాలతో బోనకల్ బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు, కుంటలు నింపాలని, రైతు బీమా పునరుద్ధరించాలని, యూరియా యాప్ రద్దు చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజరు చేయాలని, వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలకు, దివ్యాంగులు పెన్షన్ రూ.6వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, మహిళలకు 2500, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయాలని, మండలంలో 155 కుటుంబాలకు మంజూరైన దళితబంధు నిధులు గ్రౌండింగ్ చేయాలని, అర్హత ఉన్న 3800 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 11 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కరుణశ్రీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు పర్చా రామచంద్రరావు, నారపోగు హేమ, సహాయ కార్యదర్శులు మార్గం శ్రీను, అబ్బూరి మహేష్, బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, నాయకులు పగిడిపల్లి ఏసు, దొబ్బల వెంగళరావు, పదిమల వెంకటనర్సయ్య, గోగుల ఆది, గోగుల వెంకట్, హుస్సేన్, గుండ్ల బేబీరాణి, తుపాకుల లక్ష్మీ నారాయణ, అంజయ్య షేక్ దస్తగిరి ఏసు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల హక్కులకు భంగం



మున్సిపల్, హౌసింగ్‌శాఖలపై సమగ్ర విచారణకు సిపిఐ డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పివిఆర్‌గార్డెన్‌లో అక్టోబర్ 31వ తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న వివాదంపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు సిపిఐ ఖమ్మంరూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ దివాకర టిఎస్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.ఏదులాపురంమున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరుతో కౌన్సిలర్లు హక్కులకు భంగం కలిగిందని సిపిఐ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అధికారుల వద్ద నుంచి ప్రొసీడింగ్ పత్రాలు తీసుకొని పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఏదులాపురం మున్సిపాలిటీ పర్యవేక్షణ, హౌసింగ్‌శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వివాదానికి సంబంధించిన ఫోటోలు, వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాల క్లిప్పింగులను ఆధారాలుగా సమర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ పార్టీలకు అర్హులైన ప్రజలకు సమానంగా అందాల్సి ఉండగా, ఒకే పార్టీకి చెందిన కార్యక్రమంగా వ్యవహరిస్తూ ఇతర పార్టీల నాయకులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిపిఐ నాయకులు సమర్పించిన ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్‌రావు, వెంపటి సురేందర్, బానోత్ రాంకోటి, బూర నాగేశ్వరరావు, పగీళ్ల వీరభద్రం, బట్ట బాబు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, 28వ వార్డు సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు పాల్గొన్నారు.

తెలంగాణ గొంతుక గూడ అంజన్న



ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ ప్రజల గొంతుకగా గూడ అంజయ్య పాటలు రచించాడని, తన కలాన్ని ప్రజా చైతన్యానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రమే వినియోగించాడని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత యస్‌పాల్ తెలిపారు. గూడ అంజయ్య జయంతి సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి, జిల్లా అధ్యక్షుడు పాగి వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో యస్‌పాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే కవిత్వం రాయడం ప్రారంభించిన ఆయన సమాజాన్ని చూసి స్పందించాడని ఆనాటి జీవన పరిస్థితులకు అనుగుణంగా పాటలు రాశాడన్నారు. ఆయన రాసిన 'ఊరు మనదిరా... ఈ వాడ మనదిరా' అన్న పాట పదహారు భాషల్లోకి అనువాదమైందన్నారు. గూడ అంజన్న సాహిత్యాన్ని భావితరాలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని, ట్యాంక్ బండ్‌పై గూడ అంజన్న విగ్రహాన్ని ప్రతిష్టించాలని యస్‌పాల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీరభద్రం, ఐలయ్య, సుబ్బారావు, నరేందర్, చిర్రా రవి, శ్రీనివాస్, దేవిరెడ్డి విజయ్, శ్రీను, పమ్మి రవి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఎపిడి జయశ్రీ

ప్రజాపక్షం/రఘునాథపాలెం : స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి లక్ష్యాధికారిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌డిఎ అడిషనల్ పిడి జయశ్రీ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం రైతు వేదిక నందు రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన గ్రామ దీపికలకు లఖ్‌పతి దిది పథకంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపిడి జయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా (ఎంటర్ ప్రెన్యూర్స్) ఎదిగేందుకు ప్రభుత్వం అవసరమైన రుణ సదుపాయాలను అందజేస్తుందన్నారు. మహిళలు ఆయా రుణాల ద్వారా స్వయం ఉపాధి పొంది తమ వార్షిక ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆదాయ వివరాలను లోకో (ఎల్‌వొకెవొ) అజ్వీక యాప్‌లో నాలుగు త్రైమాసికాల వారీగా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని, అందుకోసమే గ్రామ దీపికలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, డిపిఎం ఆంజనేయులు, ఎపిఎం శ్రీనివాస్, తిరుమలరావు, శిక్షకులు దేవ్‌సింగ్, కృష్ణయ్య, సిసిలు, అనిల్, జ్యోతి, సునీత, చందు, రేణుక, నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, చారి, మండల సమాఖ్య అధ్యక్షులు, గ్రామదీపికలు పాల్గొన్నారు.

అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించాలి

ఎల్ నినో నేపథ్యంలో జలసిరి పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
కలెక్టర్ చిత్రా మిశ్రా



ప్రజాపక్షం/కరీంనగర్: ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు నేటి సంరక్షణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడిఓసిలో ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తుందని, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజల సాయంతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారంలో ఏ ప్రాంతాలకు వెళ్లారు. చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ల అధికారులు.. గ్రామాల్లో తరచుగా పర్యటిస్తూ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన పంట మార్పిడి పద్ధతులను వివరించాలన్నారు. ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వివరించారు. మండలంలో చేపట్టిన వి బిజి రాంజీ పనులు, నీటి సమస్యలు, ఇతర అభివృద్ధి పనులపై అధికారులు తరచుగా సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. పనుల పురోగతి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించాలని ఆదేశించారు. గ్రామాల్లో మంజూరైన ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణాల దశలు , ఓహెచ్ఎస్ లీకేజీలు, తాగునీటి పైపులైన్ల పనులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కరువు పునరావాస చర్యలతో పాటు.. భూగర్భ జలాల స్థితి, పశుగ్రాసం కొరత, వీ బీ జీ రాంజీ పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి..

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, డిఆర్ఓ స్వామి.. తదితర శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం దరఖాస్తులు 287 రాగా.. అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 121, కరీంనగర్ నగర పాలికకు 45, హుజురాబాద్ ఆర్డీవో కార్యాలయానికి 39 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎన్ హెచ్ఆర్సీ, విద్యా సంబంధిత దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఆయా మండలాలు రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం తో పాటు అధికారుల పనితీరును డీఆర్వో స్వయంగా పర్యవేక్షిస్తారని తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల: ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి 75 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసూనాంబ,జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్,తదితరులు ఉన్నారు.

6 క్వింటాళ్ల పిడిఎస్ సన్నబియ్యం పట్టివేత

జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్



ప్రజాపక్షం/పెద్దపల్లి : అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ తెలిపారు.జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనాథ్ ఆధ్వర్యంలో సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో గల ఇంటి నంబర్ 33136/A/1లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా సరఫరా చేసే సన్నబియ్యాన్ని ప్యాకేజీ బ్యాగుల్లో నింపుతున్న బజ్జూరి శంకర్, తండ్రి రాములును అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 23 బ్యాగుల్లో ఉన్న మొత్తం 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని స్వాధీనం చేసుకుని, భద్రత నిమిత్తం ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు.పీడీఎస్ సన్నబియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు బజ్జూరి శంకర్‌పై 6A కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో పోచయ్య , రాజిరెడ్డి ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలో విద్యుదాఘాతం

పరుగులు తీసిన విద్యార్థులు...



ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట పట్టణంలోని సుడా కార్యాలయం పక్కన ఉన్న 9ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో కళాశాల భవనంలో భారీగా పొగ వ్యాపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విద్యార్థులు తరగతి గదుల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనతో కళాశాల ప్రాంగణంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అదృష్టవశాత్తూ విద్యార్థులంతా సురక్షితంగా బయటపడటంతోపాటు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో విద్యార్థులు,కళాశాల సిబ్బంది,తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

నిధుల వినియోగంపై విచారణ

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన తిగుల్ గ్రామస్థులు



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: నూతన భవనాల నిర్మాణం పేరుతో నిధులు పక్కదారి పట్టే అనుమానాలు వ్యక్తం అవుతున్నందున నిధులు వినియోగంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తిగుల్ గ్రామస్థులు జిల్లా కలెక్టర్ హైమావతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో ప్రజా సమస్యలను పక్కన బెట్టి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని భవనాల నిర్మాణం కోసం అధికారులు పనులు ప్రారంభించటం పట్ల గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కొన్ని కాలనీలలో సిసి రోడ్లు, మురికినీటి కాలువలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఉపయోగం లేని పనులకు భూమి పూజలేందుకని వారు ప్రశ్నించారు. దినిపై అధికారులు విచారణ నిర్వహించి ప్రజాప్రయోజనకరమైన పనులను చేయాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాపక్షం/కొండపాక : సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలై సదరు వ్యక్తి శరీరం ఛిద్రమైనట్లు స్థానికులు తెలిపారు. మృతుడు నల్ల రంగు ప్యాంట్, నల్ల రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. అలాగే మృతుని ఎడమ చేతిపై కిష్టయ్య పేరుతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. ఈ ఆచూకీ తెలిసినవారు ఎవరైనా ఉంటే కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

విద్యార్థిని బలవన్మరణంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



ప్రజాపక్షం/పెద్దపల్లి: కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దక్కలి చంద్రకళ బలవన్మరణం పై సమగ్ర విచారణ జరపాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్.ఎల్.బి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దక్కలి చంద్రకళ బలవన్మరణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్ వార్డెన్, సంబంధిత సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే ఈ ఘటన జరిగిందని, కండ్లకు కట్టినట్టుగా కనబడుతున్నదని, ఇలాంటివి పునరావృతం కాకుండా వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బలవన్మరణానికి గల కారణాలను సమగ్ర విచారణ చేసి తెలుసుకొని, కారకులు ఎవరైనా ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.బాధిత కుటుంబానికి న్యాయం చేసేంతవరకు ఎఐఎస్ఎఫ్ పోరాటమాగదని ఆయన అన్నారు.

4న ఆర్జీ-1 జిఎం ఆఫీస్ ముట్టడి

ఎఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను



ప్రజాపక్షం/పెద్దపల్లి: సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఏఐటియుసితో ఆగస్టు 27న లేబర్ కమిషనర్ వద్ద 23 డిమాండ్ల పై జరిగిన అగ్రిమెంట్‌ను అమలు కోసం సర్క్యులర్లు జారీ చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ జోక్యం వల్ల యాజమాన్యం సర్క్యులర్ లు జారీ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ జాప్యానికి వ్యతిరేకంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో నవంబర్ 4న సాయంత్రం 3 గంటలకు ఆర్జీ1 జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ముట్టడి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఆందోళన కార్యక్రమానికి కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి ఆర్జీ1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఒక ప్రకటనలో కోరారు.

అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టు నియామకంపై విచారణ

ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణ పెళ్లి యుగేందర్ డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్: ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టు నియామకంపై విచారణ జరిపించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన జీవోకు వ్యతిరేకంగా ఉద్యోగం నియామకం చేపట్టిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యములో ఏర్పడిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విధులు నిర్వహించేందుకు అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టు నియామకానికి ఇచ్చిన అర్హత దరఖాస్తులలో కొన్ని అవకతవకలు ఉన్నాయన్నారు. విద్యార్హతలు అసిస్టెంట్ లైబ్రేరియన్ కు అభ్యర్థి గుర్తింపు పొందిన యునివర్సిటీ నుండి బ్యాచ్‌లర్ అఫ్ లైబ్రేరి మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ (బి.ఎల్.ఐ.సి) ఉత్తీర్ణత పొంది ఉండాలని, అభ్యర్థి మెడికల్ డిపార్టుమెంట్‌లో కనీసం రెండు సంవత్సరాలు అసిస్టెంట్ లైబ్రేరియన్ గా పని చేసి ఉండాలని ఉద్యోగ ప్రకటనలో కోరారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నియామకం జరిగినట్లు యుగేందర్ ఆరోపించారు. ఈ నియామకంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్ ను ఈ సందర్భంగా యుగేందర్ కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిఉదయ భాస్కర్, నగర సహాయ కార్యదర్శి జువ్వాజి తిరుపతి, నాయకులు రమేష్,రవీందర్, అవినాష్ అఖిల్, నరేందర్, ఉమేష్, చందు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మలోద్ది చారిత్రక వారసత్వ సంపదను

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

భావితరాలకు అందించాలి




ప్రజాపక్షం/పెద్దపల్లి: సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంత విశిష్టతను భావితరాలకు అందించడంతో పాటు, చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంతంలో నిర్వహించిన హెరిటేజ్ ట్రెక్కింగ్ కార్యక్రమంలో 560 మందికి పైగా ట్రెక్కర్లు,చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై వ్యక్తం చేశారు.సీతమ్మలోద్ది గుహాలో లభించిన సుమారు 10,000 సంవత్సరాల నాటి ప్రాచీన గ్రైండింగ్ పరికరం ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా పెద్దపల్లి కలెక్టరేట్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా డిస్నవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి ప్రాచీన గ్రైండింగ్ పరికరం ప్రత్యేకత, వినియోగం గురించి కలెక్టర్‌కు వివరించారు.ఈ సందర్భంగా ప్రాచీన గ్రైండింగ్ పరికరం విశిష్టతను వివరిస్తూ, శాడిల్ క్వెర్న్ అనేది ప్రాచీన మానవులు ధాన్యాలు, మొక్కల భాగాలు, వేర్లు, ఖనిజ వర్ణద్రవ్యాలను నూరి పొడి చేసుకోవడానికి ఉపయోగించిన పరికరమని తెలిపారు. ఒక పెద్ద రాయిపై చిన్న రాయిని ముందుకు వెనుకకు రుద్దుతూ పదార్థాలను మెత్తటి పొడిగా చేసుకునేవారని వివరించారు.సీతమ్మలోద్ది గుహాలో ఇలాంటి గ్రైండింగ్ రాళ్లు లభించడం ఆ ప్రాంతంలో ప్రాచీన మానవుల జీవన విధానం, ఆహారపు అలవాట్లు, కళా సంప్రదాయాలు, అప్పటి సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విలువైన ఆధారాలను అందిస్తోందని పేర్కొన్నారు.

చారిత్రక విశేషాలతో హెరిటేజ్ బుక్ రూపకల్పన : సీతమ్మలోద్ది చారిత్రక విశేషాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో రూపొందించిన హెరిటేజ్ బుక్ ప్రచురణకు కృషి చేసిన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.చారిత్రక ప్రదేశాల విశిష్టత,పురాతన మానవుల జీవన విధానానికి సంబంధించిన ఆధారాలను పుస్తక రూపంలో భద్రపరచడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి, హెరిటేజ్ బుక్ రూపకల్పనలో కృషి చేసిన అనిల్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు పర్యాటక అభివృద్ధికి ప్రోత్సాహం అందించడం, భావితరాల్లో చరిత్ర పట్ల అవగాహన పెంపొందించడం వంటి లక్ష్యాల సాధనలో హెరిటేజ్ ట్రెక్కింగ్ కార్యక్రమం ఒక మంచి ముందడుగుగా నిలిచిందని పేర్కొన్నారు.

దరఖాస్తుపై చర్య తీసుకోని శాఖలపై జరిమానా

కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట : ప్రజావాణి సమస్యలను పెండింగులో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ద్వారా వివిధ సమస్యలపై 123 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి ఇఆయా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను విని వాటి పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఎంతో నమ్మకంతో వారి సమస్యలు పరిష్కారం అవుతాయని వచ్చే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. 30 రోజులలో దరఖాస్తు పై చర్య తీసుకోని శాఖలపై ఫైన్ విధిస్తామని అన్నారు. అదేవిధంగా ఎల్ నినో ప్రభావంతో త్రాగునీటికి ఎదుటి ఏర్పడకుండా ముందస్తుగా గ్రామాలు మున్సిపాలిటీలలో త్రాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మరమ్మత్తు పనులు పూర్తిచేసి ఎక్కడ నీరు లీకేజీ కాకుండా చూసుకోవాలని, ప్రజలకు నీటిని పొదుపుగా వాడడంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రైని డిప్యూటీ కలెక్టర్, వివిధశాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండ్లు తదితరులు పాల్గొన్నారు.

జనగాంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

సిపిఐ డివిజన్ కార్యదర్శి రమేశ్ కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ జనగాం, ఐదవ డివిజన్ గంగానగర్ పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు తిరుగుతున్నారని, డివిజన్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని వన్ టౌన్ పోలీసుల ఆదేశాల మేరకు అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల భద్రతకు విఘాతం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ ఆరవ డివిజన్ జనగాం కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో పోలీసు అధికారులను కోరారు. అదేవిధంగా జనగాం పరిసర ప్రాంతాల్లో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని,రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కరుణాకర్‌కు రూ.7 లక్షల ఎల్ఓసి అందజేత

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర: గంగాధర ఏఎంసీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్ ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. తోట కరుణాకర్ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 7 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆసుపత్రి వేదికగానే కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నిమ్స్ లో వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కరుణాకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంటా పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ, సేవలపై ఆరా



ప్రజాపక్షం/గంగాధర: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు సోమవారం గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు లక్ష్మీ దేవిపల్లి, బూరుగుపల్లి, నారాయణపూర్ సబ్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో హాజరు రిజిస్టర్, ఔట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్ సీడీ రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ ఆర్ మరియు దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లను సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్త, అంగన్ వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి కలిసి ప్రతి వారం సమావేశం నిర్వహించి ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంపులపై చర్చించాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రై డే గా పాటించాలని సూచించారు. టీ–చాబ్ కు ఫీవర్ శాంపిల్స్ రెగ్యులర్ గా పంపాలని, పీహెచ్ సీ వైద్యాధికారులు ముందస్తుగా మెడికల్ క్యాంపు తేదీలు, స్థలం తెలియజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, తాగునీటి వనరులు, వెక్టార్ బాండ్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పాముకాటు, కుక్కకాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సిబ్బంది సెలవు అవసరమైతే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. గర్భిణీల చెకప్ లు, ఆభా కార్డుల క్రియేషన్ సంఖ్య పెంచాలని, 13 ఏళ్ల పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో స్క్రీనింగ్, రీ స్క్రీనింగ్ చేసి ఫాలోఅప్ చేయాలన్నారు. 14 ఏళ్ల నిండిన బాలికలకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సర్' తరువాత ఐదు రాష్ట్రాల్లో

13.24 శాతం తగ్గిన ఓటర్లు

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపూర్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు



న్యూఢిల్లీ : వచ్చే ఏడాది ఆరంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎన్నికల జరిగే ఈ ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ పూర్తయిన తరువాత ఓటర్ల సంఖ్య 13.24 శాతం వరకు తగ్గిందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల సంఘం, ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈ ఐదు రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య సుమారు 18.71 కోట్ల నుండి 16.43 కోట్లకు తగ్గింది. అంటే, మొత్తం మీద సుమారు 2.29 కోట్ల మంది ఓటర్లు (సుమారు 12.2 శాతం) తగ్గారు. ఈ మొత్తం తగ్గుదలలో దాదాపు 90 శాతం వాటా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానిదే కావడం గమనార్హం; అన్ని రాష్ట్రాల్లోకెల్లా ఇక్కడే అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నారు.

రెండవ దశలో 'సర్' చేపట్టిన ఉత్తరప్రదేశ్‌లో, అంతకుముందు 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య, ముసాయిదా జాబితాలో 12.56 కోట్లకు పడిపోయి, ఆ తర్వాత తుది జాబితాలో 13.40 కోట్లుగా నమోదైంది. ఇక్కడ మొత్తం 2.04 కోట్ల మంది ఓటర్లు తగ్గారు (సుమారు 13.24 శాతం). ఈ ఐదు రాష్ట్రాలతో పోలిస్తే, ఇదే అత్యధిక తగ్గుదల. ముసాయిదా జాబితా నుండి సుమారు 2.89 కోట్ల పేర్లను తొలగించగా, అందులో సుమారు 0.84 కోట్ల పేర్లు (సుమారు 29 శాతం) తిరిగి చేర్చబడ్డాయి.

పంజాబ్‌లో, ఓటర్ల సంఖ్య 2.15 కోట్ల నుండి ముసాయిదా జాబితాలో 1.94 కోట్లకు తగ్గి, తుది జాబితాలో 2.01 కోట్లుగా నమోదైంది. ఇక్కడ మొత్తం 0.14 కోట్ల మంది ఓటర్లు (సుమారు 6.34 శాతం) తగ్గారు. ఇక్కడ ఓటర్ల సంఖ్య తిరిగి చేరడం (రికవరీ) అత్యంత ప్రభావవంతంగా జరిగింది. ముసాయిదా జాబితా నుండి తొలగించిన సుమారు 0.21 కోట్ల పేర్లలో, 0.07 కోట్ల పేర్లు (సుమారు 34 శాతం) తిరిగి జాబితాలోకి చేరాయి.

ఉత్తరాఖండ్‌లో, ఓటర్ల సంఖ్య 0.80 కోట్ల నుండి 0.71 కోట్లకు తగ్గి, చివరకు 0.72 కోట్లుగా నమోదైంది. ఓటర్ల సంఖ్యలో నికర తగ్గుదల సుమారు 0.08 కోట్లు లేదా 10.07 శాతంగా ఉంది. తొలగించిన ఓటర్లలో కేవలం 0.0025 కోట్లు (సుమారు మూడు శాతం) మాత్రమే తిరిగి చేర్చబడ్డారు.

మణిపూర్‌లో ఇక్కడ ఓటర్ల సంఖ్య 0.209 కోట్ల నుండి 0.193 కోట్లకు తగ్గి, చివరకు 0.196 కోట్లకు చేరింది. పంజాబ్ మాదిరిగానే, ఇక్కడ కూడా ఓటర్ల సంఖ్యలో సుమారు 0.013 కోట్లు లేదా 6.33 శాతం నికర తగ్గుదల నమోదైంది. తొలగించిన ఓటర్లలో సుమారు 17 శాతం మంది తిరిగి చేర్చబడ్డారని గణాంకాలు చెబుతున్నాయి.

రెండవ దశలో ప్రత్యేక ముమ్మర సవరణ చేపట్టిన గోవాలో, ఓటర్ల సంఖ్య 0.1185 కోట్ల నుండి 0.1085 కోట్లకు, ఆపై మరింత తగ్గి 0.1058 కోట్లకు పడిపోయింది. గోవాలో నికర తగ్గుదల సుమారు 0.013 కోట్లు లేదా 10.76 శాతంగా ఉంది. ఈ ఐదు రాష్ట్రాల్లో గోవాలో మాత్రమే తుది ఓటర్ల జాబితా ముసాయిదా జాబితా కంటే తక్కువగా ఉంది. కాగా, జనవరి 1వ తేదీన లేదా అంతకు ముందు 18 ఏళ్లు నిండే యువ ఓటర్లకు, ఓటర్ల జాబితాలో చేరేందుకు, ఈ ఐదు రాష్ట్రాల్లో ఓటు వేసేందుకు అవకాశం కలుగుతుంది.

ఉత్తరప్రదేశ్ (403 సభ్యుల అసెంబ్లీ) పదవీకాలం వచ్చే ఏడాది మే 22న ముగుస్తుంది. మణిపూర్ (60 సభ్యులు), గోవా (40 సభ్యులు), పంజాబ్ (117 సభ్యులు), ఉత్తరాఖండ్ (70 సభ్యులు) అసెంబ్లీల పదవీకాలం 2027 మార్చిలో వేర్వేరు తేదీల్లో ముగుస్తుంది.

అయోధ్య రామాలయం నిధులపై

ముగిసిన సుప్రీం విచారణ

● ఇక స్థానిక న్యాయస్థానంలో విచారణ చేపట్టండి ● ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశం



న్యూఢిల్లీ:అయోధ్య రామాలయం నిధుల దుర్వినియోగంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన అనేక పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు సోమవారం ముగించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ నిధుల అవినీతి కేసులో కేసుల విచారణ పూర్తి చేయడం ఒక ప్రాధాన్యత ఘట్టంగా మారింది. దీంతో ఇకమీదట స్థానిక న్యాయస్థానం నిందితులపై విచారణ కొనసాగించవచ్చునని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానంమొదట ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్)ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం ఛార్జిషీటు దాఖలు చేసింది.అందువల్ల ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇకమీదట చట్టానికి అనుగుణంగా విచారణ కొనసాగించవచ్చునని సూర్యకాంత్ ఆదేశించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బిఎన్ఎస్ఎస్)లోని నిబంధనలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది.ఈ కేసులో ప్రజాప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని, ఈ కేసు దాఖలు చేసిన పిటిషనర్లు కూడా ధర్మాసనం ఎదుట ఒక బాధితులేనని, అందువల్ల స్థానిక న్యాయస్థానంలో చేపట్టబోయే విచారణ సందర్భంగా పిటిషనర్లు న్యాయమూర్తికి పూర్తి సహాయం అందించాలని,సుప్రీంకోర్టుకు సహాయం చేసినవిధంగానే ఆ మేరకు ఆయనకు పూర్తి స్వేచ్ఛతో సహకారం ఇవ్వాలని జస్టిస్ వి.మోహన కోరారు. సుప్రీంకోర్టు ఎదుట విచారణకు వచ్చిన పిటిషన్లపై విచారణ పూర్తయినట్లు ధర్మాసనం ప్రకటించింది.ఈ కేసులో మంచి చెడ్డల గురించి,యోగ్యతలు, అయోగ్యతల గురించి తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, దిగువకోర్టులో విచారణలు కొనసాగుతాయని ధర్మాసనం పేర్కొంది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసులో వాదనలు వినిపించేందుకు ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన విరాళాల లెక్కింపులో దుర్వినియోగం జరిగిందని తేలిందని మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. విరాళాల లెక్కింపు సందర్భంగా నిధులు కాజేసినవారిలో కొందరు ఆ ధనాన్ని ఆస్తులలో పెట్టుబడులుగా సమకూర్చగా, మరికొందరు బ్యాంకులలో డిపాజిట్లుగా ఉంచారని చెప్పారు. దర్యాప్తు బృందాలు ఈ ధనాన్ని బ్యాం కుల నుండి తిరిగి స్వాధీనం చేసుకున్నాయని, వాస్తవంగా ఆస్తి విలువ రూ.50 లక్షలు ఉండగా,అమ్మకపు ఒప్పందాన్ని రూ.15 లక్షలుగా చూపించారని చెప్పారు. మిగిలిన మొత్తాలను నగదు రూపంలో చెల్లించి ఉండవచ్చునని,ఈ ధనం కూడా కాజేసిన నిధులవే అయి ఉండవచ్చునని చెప్పారు.ఇక భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించినప్పుడు,అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా అయోధ్యలోని రామాలయం ప్రధాన స్థలం కొలతలపై కొత్తగా ఎలాంటి పిటిషన్లను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. సెప్టెంబరు 21వ తేదీన సుప్రీంకోర్టు రామాలయం నిధుల దుర్వినియోగం కేసులో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.సెప్టెంబరు 25వ తేదీ నాటికి మొదటి ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది. సత్వరం దర్యాప్తు పూర్తిచేయాలని కూడా సిట్‌ను ఆదేశించింది. విరాళాల దొంగతనంపై నివేదికను సీల్డు కవరులో తమకు అందజేయాలని కోర్టు ఆదేశించింది.ఐజిపి కిరణ్ నాయకత్వాన నలుగురు సభ్యులతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం జులై 27వ తేదీన ఏర్పాటు చేసిన సిట్ బృందాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ బృందంలో కొత్త వారిని కూడా అదనంగా నియమించింది.

'విదేశీ సాయం'పై బహిరంగ చర్చకు రండి

ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ సవాల్



న్యూఢిల్లీ : దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు విదేశీ సహాయం తీసుకుంటున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఆయన మోదీకి సవాలు విసిరారు. మోదీ కూడా విదేశీ సహాయంతోనే ప్రధాన మంత్రి పదవిని అధిష్టించారని రాహుల్ ఆరోపించారు. 'మోదీ జీ ఈ దేశానికి అబద్ధాలు చెప్పడం ఆపండి. మీరు విదేశీ సహాయంతోనే ప్రధాని అయ్యారు, ఇప్పటికీ విదేశీ సహాయంతోనే ఆ పదవిలో కొనసాగుతున్నారు. మీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విదేశీయుల నియంత్రణలో, వారి మద్దతుతో నడుస్తోంది. విదేశీ సోషల్ మీడియా సంస్థలు మీకు పూర్తి మద్దతునిస్తున్నాయి' అని ఆయన 'ఎక్స్' వేదికగా దుయ్యబట్టారు. దీనిపై బహిరంగ చర్చకు సవాలు విసురుతున్నాను, ఎక్కడైనా, ఎప్పుడైనా సరే... మీకు ధైర్యం ఉంటే రండి. కానీ మీరు రారు, ఎందుకంటే మీ గురించి నాకు తెలిసిన విషయాల పట్ల మీకు భయం ఉంది అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశాన్ని విభజించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, సోషల్ మీడియాను ఉపయోగించి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. శనివారం గుజరాత్‌లో పర్యటించిన సందర్భంగా మోదీ మాట్లాడుతూ 'దేశం బాహ్య సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో, దేశంలోని కొన్ని శక్తులు అబద్ధాలు, పుకార్లను వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించాయి. కానీ, దేశ ప్రజలు మాత్రం దేశానికి అండగా నిలిచారు' అని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, 'దశాబ్ద కాలానికి పైగా పేరుకుపోయిన నిరాశతో, వీరు ఇప్పుడు బహిరంగంగానే బయటకు వచ్చారు. విదేశాల్లో రహస్యంగా ఎవరిని కలుస్తున్నారు? భారత్‌కు వ్యతిరేక శక్తులు ఎవరికి మద్దతు ఇస్తున్నాయి? మన శత్రువుల భాషలో ఎవరు మాట్లాడుతున్నారు? వీటన్నింటినీ మనం గుర్తించాల్సి ఉంది' అని మోదీ పేర్కొన్నారు.

బిజెపి నిర్లక్ష్యం, అసమర్థతతో

దీర్ఘకాలిక సంక్షోభంలోకి మణిపూర్

రాష్ట్ర ఎన్నికలలో బిజెపి దుష్పరిపాలనకు ముగింపు పలకాలి

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో తాజా హింసాత్మక ఘటనలకు సంబంధించి బిజెపి సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆ పార్టీ నిర్లక్ష్యం, తీవ్రమైన అసమర్థత వ్యూహాత్మకంగా కీలకమైన ఈ సరిహద్దు రాష్ట్రాన్ని దీర్ఘకాలిక సంక్షోభంలోకి నెట్టాయని మండిపడింది. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులతో కూలంకషంగా చర్చించిన అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ ఆరోపణ చేశారు. రాబోయే రాష్ట్ర ఎన్నికలలో బిజెపి దుష్పరిపాలనకు ముగింపు పలకాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఈ సమావేశానికి ఖర్గేతో పాటు, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, మణిపూర్ ఎఐసిసి ఇన్‌చార్జి సప్తగిరి ఉలక, మాజీ ముఖ్యమంత్రి, మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇబోబి సింగ్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు కె మేఘచంద్ర తదితరులు హాజరయ్యారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న తీవ్ర సవాళ్లపై మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులతో కూలంకషంగా చర్చలు జరిపినట్లు ఖర్గే ఒక పోస్ట్‌లో తెలిపారు. 'బిజెపి రాజకీయ అహంకారం, నిర్లక్ష్య వైఖరి, ఘోరమైన అసమర్థత వ్యూహాత్మకంగా కీలకమైన ఈ సరిహద్దు రాష్ట్రాన్ని దీర్ఘకాలిక సంక్షోభంలోకి నెట్టాయి. శాంతిభద్రతల క్షీణతకు కారణమైన బిజెపి నాయకత్వం, పరిస్థితి అదుపు తప్పుతుండగా జవాబుదారీతనం నుండి తప్పించుకుంటూ మాయం కావాలని చూసింది' అని ఆయన ఆరోపించారు. మణిపూర్ ప్రజలు శాంతి, స్థిరత్వం, గౌరవం, న్యాయానికి అర్హులని ఖర్గే నొక్కి చెప్పారు. ఆదివారం జరిగిన ఇండియా బ్లాక్ ర్యాలీని ప్రస్తావిస్తూ, రామ్‌లీలా మైదాన్‌లో కనిపించిన కోపం మణిపూర్, ఉత్తరాఖండ్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలలో విస్తరిస్తున్న ప్రభుత్వ వ్యతిరేకతకు ఒక చిన్న సూచన మాత్రమేనని వేణుగోపాల్ అన్నారు. 'పాలక ప్రభుత్వం రాజేసిన జాతి ఘర్షణల జ్వాలల్లో మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది. అక్కడి ప్రజలు 2024లో జరగనున్న రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బిజెపిని ఇప్పటికే తిరస్కరించారు, వారిని పూర్తిగా తరిమివేయడానికి వేచి ఉండలేకపోతున్నారు' అని ఆయన అన్నారు. 'అయోధ్య, భారతదేశమంతటా బిజెపి అలవాటు చేసుకున్న వచందా చోరీ' (విరాళాల సేకరణలో అవకతవకలు) నుండి దేవభూమి ఉత్తరాఖండ్‌లోని దేవాలయాలు కూడా తప్పించుకోలేదు. కేవలం పవిత్ర దేవాలయాలే కాకుండా, ఉత్తరాఖండ్‌లో బిజెపి చూపుతున్న అత్యాశ కారణంగా విశాలమైన పర్వత ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు. ప్రకృతి మాత ఇటువంటి వినాశకర చర్యలకు వ్యతిరేకంగా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు' అని ఆయన అన్నారు.

ఢిల్లీలో దుర్భరస్థాయికి చేరిన గాలి నాణ్యత

తొమ్మిది నెలల తర్వాత మళ్లీ ఆరో కేటగిరీ

న్యూఢిల్లీ:ఢిల్లీలో సోమవారం నాడు గాలినాణ్యతా ప్రమాణాలు తీవ్రస్థాయిలో దిగజారిపోయాయి. కాలుష్య కారకాలు పరాకాష్ఠకు చేరి గాలి నాణ్యతా సూచిక(ఎక్యూఐ) ఆరో కేటగిరీ(సివియర్)కు చేరిపోయింది. దీంతో గాలిలో కాలుష్య కారకాలు విపరీతంగా పెరిగాయి.సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఐదో కేటగిరీకి చేరుకుని 436 పాయింట్లుగా నమోదు కావడంతో గాలి నాణ్యత దుర్భరస్థితికి చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీన అత్యధికంగా ఢిల్లీలో గాలి నాణ్యత కనిష్ఠస్థాయికి దిగజారిపోయింది. ఆ తర్వాత మళ్ళీ తొమ్మిది నెలలకు ఈ నాడు నాలుగో కేటగిరీలో 324 పాయింట్ల వద్ద స్థిరపడి నగర వాసుల జీవితాలను దుర్భరంగా మార్చింది. గడచిన ఫిబ్రవరిలో గాలినాణ్యతా ప్రమాణాలు 339 పాయింట్లుగా నమోదయ్యాయి.271 రోజుల తర్వాత కాలుష్యం మళ్ళీ పతాకస్థాయికి చేరుకుంది.నగరంలో నాలుగువైపులా ఉన్న మూడు గాలి నాణ్యతా పర్యవేక్షణ,నమోదు కేంద్రాలు ఇచ్చిన సమాచారం ప్రకారం కాలుష్యం 'దుర్భర కేటగిరీ'లోకి చేరింది. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి జహంగీర్‌పూరి కేంద్రం సమాచారం ప్రకారం గాలి నాణ్యత 436గా నమోదైంది. దీనిని కాలుష్య నియంత్రణ విభాగం ''సివియర్'' కేటగిరీగా పేర్కొంది. గాలిలో కాలుష్యం 0–50 గా ఉంటే మంచిది(గుడ్)అనే కేటగిరిగా గుర్తిస్తారు.51–100 మధ్య నమోదైంతే దానిని 'సంతృప్తికరం(శాటిస్‌ఫ్యాక్టరీ)గా 101–200 మధ్య నమోదైతే 'పరిమితం'(మోడరేట్)అని పేర్కొంటారు.201–300 మధ్య నమోదైతే 'హీనం'(పూర్) కేటగిరీగా,301–400 మధ్య కాలుష్యం నమోదైతే 'అత్యంతహీనం'(వెరీపూర్) కేటగిరీగా,401–500గా నమోదైతే 'ఘోరమైన'(సివియర్) కేటగిరీగా విభజించారు.దేశరాజధానిలో కాలుష్య కారక తునకలు (పార్టిక్యులేట్ మేటర్) 2.5గా ఉన్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సిపిసిబి) తెలియజేసింది.ఈ కాలుష్య సూక్ష్మ కణాలు గాలి పీల్చినప్పుడు ఊపిరితిత్తులలోకి ప్రవేశించి రక్తప్రవాహంలోకి చేరిపోతాయి. ముందస్తు సూచనల ప్రకారం ఈనెల మూడు నుండి ఐదో తేదీ వరకూ కాలుష్యం ఢిల్లీలో బాగా దిగజారి తర్వాత మెరుగుపడుతుంది. దేశరాజధానిలో కాలుష్య కారక తునకలు (పార్టిక్యులేట్ మేటర్) 2.5గా ఉన్నాయని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సిపిసిబి) తెలియజేసింది.ఈ కాలుష్య సూక్ష్మ కణాలు గాలి పీల్చినప్పుడు ఊపిరితిత్తులలోకి ప్రవేశించి రక్తప్రవాహంలోకి చేరిపోతాయి. ముందస్తు సూచనల ప్రకారం ఈనెల మూడు నుండి ఐదో తేదీ వరకూ కాలుష్యం ఢిల్లీలో బాగా దిగజారి తర్వాత మెరుగుపడుతుంది.డేడెసిషన్ సపోర్ట్ సిస్టమ్(డిఎస్ఎస్) ప్రకారం,ఢిల్లీలో రవాణారంగం ద్వారా సోమవారం 19.2 శాతం కాలుష్యం ఏర్పడింది. పరిశ్రమలవల్ల,పరిసర ప్రాంతాల వల్ల 4.2 శాతం కాలుష్యం చేరింది. వీటిల్లో నివాసిత ప్రాంతాల ద్వారా 4.9శాతం, ఇంధనం ద్వారా 1.8 శాతం,వ్యర్థాలు దగ్ధం చేయడం వల్ల 1.8 శాతం కాలుష్యం, ఇతర రంగాల ద్వారా 1.3 శాతం కాలుష్యం ఢిల్లీలో చేరింది. రాజధాని పొరుగున ప్రాంతీయ జిల్లాలో ఝూజ్జర్‌లో 6.9 శాతం కాలుష్యం నమోదు కాగా, సోనీపట్‌లో 5.1 శాతం,కాలుష్యం నమోదైంది. అదేవిధంగా రైతులు వ్యర్థాలు దగ్ధం చేయడంవల్ల 8.4 శాతం కాలుష్యం వచ్చి చేరింది. మరో 20.7 శాతం కాలుష్యం చేరింది.

రోడ్డు నిర్మాణ పనుల్లో కరెంట్ షాక్

8 మంది కూలీలు మృత్యువాత

● రాజస్థాన్ ఝున్‌ఝును జిల్లాలో విషాద ఘటన ● తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోదీ ● మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన



జైపూర్ : రాజస్థాన్‌లో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. ఝున్‌ఝును జిల్లాలో సోమవారం రోడ్డు నిర్మాణ పనుల్లో ఉపయోగిస్తున్న ఒక యంత్రం విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ఘటనలో ఎనిమిది మంది కూలీలు విద్యుదాఘాతానికి గురై మరణించారు. మరో ఐదుగురు వ్యక్తులకు తీవ్రంగా గాలిన గాయాలయ్యాయి. వారు చికిత్స పొందుతున్నారు. ఉదయ్‌పుర్‌వాటి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఛపోలి గ్రామంలో ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ ప్రజల భాగస్వామ్యంతో ఛపోలిని కదమ్‌కుండ్‌తో కలిపే ఒక ఇరుకైన రహదారిని నిర్మిస్తున్నారు. ఉదయ్‌పుర్‌వాటి ఎస్‌హెచ్‌ఒ రాంపాల్ తెలిపిన వివరాల ప్రకారం, కంకరను కలిపేందుకు ఉపయోగిస్తున్న యంత్రం పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలకు తగిలింది. యంత్రం హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ ప్రవహించి అక్కడ పనిచేస్తున్న కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు అని ఆయన చెప్పారు. మరణించిన వారిని హరిరామ్ గుర్జర్ (30), మంగళ్‌చంద్ గుర్జర్ (22), కాలురామ్ గుర్జర్ (20), పవన్ గుర్జర్ (23), విష్ణు సైనీ (38), సురేష్ సైనీ (30), ముఖేష్ సైనీ (27) మరియు ఫతేచంద్ సైనీ (32)గా గుర్తించారు. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పిఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా (పరిహారం) ప్రకటించారు. 'రాజస్థాన్‌లోని ఝున్‌ఝునులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు పిఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున పరిహారం అందజేయబడుతుంది. అలాగే, గాయపడిన వారికి కూడా రూ. 50,000 అందిస్తాం' అని పిఎంఒ ఎక్స్‌లో పేర్కొంది. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేసి, ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఆయన జిల్లా కలెక్టర్ నుంచి సవివరమైన నివేదికను కోరి, గాయపడిన వారికి సత్వర, సరైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలాన్ని సందర్శించి, ఈ ఘటన వల్ల ప్రభావితమైన వారికి సాధ్యమైనంత సహాయం అందేలా చూడాలని ముఖ్యమంత్రి, మంత్రి జబర్ సింగ్ ఖర్రాను కూడా ఆదేశించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ రహదారిని ప్రజా భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారని, అయితే పనులు ప్రైవేటుగా చిన్న స్థాయిలో జరుగుతున్నాయని ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్ తెలిపారు. ఛపోలిని కదమ్‌కుండ్‌తో కలిపే ఒక ఇరుకైన రహదారిపై ఈ పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించుకోవడానికి సాంకేతిక అధికారులను సంఘటనా స్థలాన్ని సందర్శించాలని ఆదేశించినట్లు నగర్ తెలిపారు. ఏదైనా శాఖాపరమైన లేదా సాంకేతిక లోపం కనుగొనబడితే, చర్య తీసుకోబడుతుంది అని ఆయన అన్నారు. మృతుల పట్ల మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ విచారం వ్యక్తం చేసి, ఈ ప్రమాదం ఎలా జరిగిందో, ఎవరు బాధ్యులో తేల్చడానికి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం, సాధ్యమైన అన్ని సహాయాలు అందించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

లాలూతో సోనియాగాంధీ భేటీ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సోమవారం ఢిల్లీలో ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు యుపిఎ హయాంలోని రోజులను, అలాగే ఎంజి నరేగా, ఆర్‌టిఇ, ఆర్‌టిఐ వంటి చట్టాల అమలును గుర్తు చేసుకున్నారు. సోనియా గాంధీ, లాలూను ఆయన కుమార్తె, ఎంపి మీసా భారతి నివాసంలో కలిశారు. సోనియా గాంధీ తమ నివాసానికి వచ్చి, తమ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారని, ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నట్లు ఎక్స్‌లో లాలూ పోస్టు చేశారు. 'యుపిఎ ప్రభుత్వ హయాంలో యువత, రైతులు, సైనికులు, సామాన్యుల కోసం పారదర్శకమైన ప్రజా సంక్షేమ పథకాలను ఎలా అమలు చేశామో, అలాగే ఎంజి నరేగా, ఆర్‌టిఇ, ఆర్‌టిఐ వంటి చట్టాల ద్వారా దేశ ప్రజలను ఎలా సాధికారులను చేశామో చర్చించుకున్నాం' అని ఆయన తెలిపారు. సర్దార్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో, బిహార్ అభివృద్ధి కోసం తాము లక్షా 45 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను అందించాం అని లాలూ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌జెడి నేత, లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ కూడా పాల్గొన్నారు. తేజస్వీ విలేకరులతో మాట్లాడుతూ లాలూ తన సాధారణ వైద్య పరీక్షల కోసం ఢిల్లీకి వచ్చారని, ఆదివారం తాను సోనియాను కలిసినప్పుడు, ఈ విషయం గురించి చెప్పానన్నారు. అప్పుడు వారే స్వయంగా లాలూను కలవాలని కోరారని, అందుకే ఆయనను పరామర్శించడానికి వచ్చారన్నారు. తమ కుటుంబాల మధ్య చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, కష్టకాలంలో లాలూ, సోనియా ఒకరికొకరు అండగా నిలిచారని, చాలా కాలంగా వారు కలుసుకోకపోవడంతో, సోమవారం సోనియా ఆయనను కలిసేందుకు వచ్చారని చెప్పారు.

బెడిసిగొట్టిన బిజెపి ప్రచారం

ఢిల్లీలో మార్కెట్లు మూతపడతాయన్న ప్రచారంపై మండిపడ్డ కాంగ్రెస్

ర్యాలీ సందర్భంగా వ్యాపారాలు జోరందుకున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ విజయంతమైంది. ఈ కార్యక్రమం వల్ల నగరంలోని వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడే అవకాశం ఉందని బిజెపి చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సోమవారం విమర్శలు గుప్పించింది. ఢిల్లీలో మార్కెట్లు జోరుగా సాగుతున్నాయని, బిజెపి ప్రచారం బెడిసికొట్టిందని పేర్కొంది. ఢిల్లీ వ్యాప్తంగా దుకాణాలు తెరిచే ఉన్నాయని, రాజకీయ కార్యకలాపాల వల్ల వ్యాపారం దెబ్బతింటుందన్న భయాలు నిరాధారమని తేలిందని పేర్కొన్న ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సోమవారం ఎక్స్‌లో షేర్ చేశారు. 'బిజెపి ప్రచారం మొత్తం బెడిసికొట్టింది. ఇండియా కూటమి మెగా ర్యాలీని అప్రతిష్టపాలు చేయడానికి, ప్రజలు ఢిల్లీకి రాకుండా నిరోధించడానికి, వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడతాయని తప్పుడు ప్రచారం చేశారు. దేశవ్యాప్తంగా వచ్చే ప్రజలు కూడా కొనుగోళ్లు చేస్తారనేది ఎవరికైనా స్పష్టమే. దీనివల్ల ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఢిల్లీలోని ప్రతి వ్యాపార యజమాని లబ్ధి పొందుతారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి, అలాగే ప్రజలను ర్యాలీకి హాజరు కాకుండా నిరుత్సాహపరచడానికి, ఓట్ల దొంగతనం, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి ప్రధాన సమస్యల నుండి దేశ ప్రజల దృష్టిని మళ్లించాలన్న బిజెపి ఉద్దేశం, ఈ అబద్ధపు, అహేతుకమైన దుష్ప్రచార ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశం స్పష్టంగా ఉంది' అని ఆయన అన్నారు. కానీ దానికి పూర్తి విరుద్ధంగా జరిగిందని, దేశవ్యాప్తంగా వచ్చిన వారితో పాటు ఢిల్లీ ప్రజలు కూడా ఈ ప్రచారానికి తమదైన రీతిలో స్పందించారని ఆయన తెలిపారు.'రాహుల్ గాంధీ విజ్ఞప్తి మేరకు, ప్రజలు ఢిల్లీ మార్కెట్లలో కొనుగోళ్లు చేశారు. పాత ఢిల్లీలోని హోల్‌సేల్ మార్కెట్లలో దుకాణాలు తెరిచే ఉన్నాయి, వ్యాపారాలు వృద్ధి చెందాయి. అంతేకాకుండా, ప్రజలు చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్ద కూడా పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేశారు. ఈ తప్పుడు కథనంలోని డొల్లతనాన్ని వార్తాపత్రికల నివేదికలే బట్టబయలు చేస్తున్నాయి' అని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ప్రజాస్వామ్య నిరసనకు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా నిలిచిన ఈ విజ్ఞప్తిని మన్నించిన వ్యాపారులకు, దుకాణదారులకు, ఢిల్లీ పౌరులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అని రమేశ్ అన్నారు. భయం లేదా ప్రచారంతో ప్రజాస్వామ్య వాణిని అణచివేయలేమని బిజెపి గ్రహించాలని ఆయన నొక్కి చెప్పారు. 'గత 12 ఏళ్లుగా దేశ ప్రజలు ఈ ఎత్తుగడలను చూస్తూనే ఉన్నారని, ఇకపై వారి కుతంత్రాలకు లొంగిపోరని బిజెపి అర్థం చేసుకోవాలి' అని రమేశ్ అన్నారు. హక్కును కాపాడుకుంటారు, వ్యాపారాలను కొనసాగిస్తారు, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తా రు. ఓటు దొంగ, గద్దె వదల్!' అని రమేష్ అన్నారు.

8 యుద్ధ నౌకల కొనుగోలుకు

రూ. 53,866 కోట్ల ఒప్పందం

రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : హిందూ మహాసముద్రంలో భారత నౌకాదళ పోరాట సామర్థ్యాన్ని బలోపేతం చేయనున్నారు. అందుకు ఎనిమిది అత్యాధునిక యుద్ధ నౌకలను కొనుగోలు చేసేందుకు రెండు ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థలతో రూ. 53,866 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. సంక్లిష్టమైన మిషన్లను చేపట్టడానికి వీలు కల్పించే అధునాతన క్షిపణులు, ఆయుధాలు, సెన్సార్ సూట్‌లను కలిగి ఉన్న ఈ కార్వెట్‌ల కొనుగోలు కోసం గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ (జిఆర్ఎస్ఇ), గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జిఎస్ఎల్)తో ఒప్పందాలు కుదిరాయి. ఈ ఒప్పందాల ప్రకారం, జిఆర్ఎస్ఇ ఐదు కార్వెట్‌లను నిర్మిస్తుండగా, మిగిలిన మూడింటిని జిఎస్ఎల్ నిర్మిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. 'భారత నౌకాదళం స్వదేశీంగా రూపొందించి, ప్రభుత్వ రంగ సంస్థలతో నిర్మించబడుతున్న మొట్టమొదటి ప్రాజెక్ట్ ఇదే కాబట్టి, భారతదేశ స్వదేశీ యుద్ధనౌకల రూపకల్పన, నిర్మాణ సామర్థ్యాలలో ఈ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది' అని పేర్కొంది. ఈ కార్వెట్‌లు అత్యాధునిక క్షిపణులు, ఆయుధాలు, సెన్సార్ సూట్‌లతో సహా అత్యాధునిక సామర్థ్యాలను కలిగి ఉంటాయని, ఇవి గాలి, ఉపరితలం, సముద్రగర్భ రంగాలలో మిషన్లను చేపట్టడానికి వీలు కల్పిస్తాయని తెలిపింది. రక్షణ రంగ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ షిప్‌యార్డులు, భారత పారిశ్రామిక భాగస్వాముల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ కార్వెట్‌లు భారతదేశ నౌకా నిర్మాణ రంగానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ నౌకల నిర్మాణం రానున్న 10 ఏళ్లలో షిప్‌యార్డులలో సుమారు 72 లక్షల పనిదినాలు, అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఇలలో 460 లక్షల పనిదినాల ఉపాధిని కల్పిస్తుంది అని రాజ్‌నాథ్ సోషల్ మీడియాలో తెలిపారు. 'మేడ్ ఇన్ ఇండియా మెటీరియల్స్, పరికరాలు, స్వదేశీ సాంకేతికతలు, భారతీయ నైపుణ్యాలు, నిపుణతల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా, ఈ ప్రాజెక్ట్ రక్షణ తయారీ రంగంలో ఆత్మనిర్భరతను సాధించే దిశగా ఒక ప్రధాన ముందడుగు వేస్తుంది' అని ఆయన అన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను అనగా **గజ్జి మణిదీప్ s/o రాజేందర్,** వయస్సు: (23) సంవత్సరాలు. నివాసం: ఓబులాపూర్ గ్రామం, మల్లాపూర్ మండలం, జగిత్యాల జిల్లాకు చెందిన వాడను. తేదీ: 10-9-2026 రోజున ఓబులాపూర్ నుండి మల్లాపూర్ వెళ్తున్న క్రమంలో మార్గం మధ్యలో **W9734738** నంబర్ గల నా పాస్‌పోర్ట్ మరియు ఇతర సర్టిఫికెట్లు పోయినవి. తర్వాత నేను వెతికి చూడగా పాస్‌పోర్ట్ మరియు సర్టిఫికెట్ల ఆచూకీ కనబడలేదు. కావున ఎవరికైనా దొరికినచో నాకు సంప్రదించగలరని మనవి

ఇట్లు :
గజ్జి మణిదీప్
గ్రా॥ ఓబులాపూర్,
మం॥ మల్లాపూర్,
జిల్లా జగిత్యాల.
సెల్ నం: 8520057320

వారం రోజుల్లో '2 వేల ఇందిరమ్మఇండ్ల' మంజూరు పక్రియను పూర్తి చేయండి

గృహ నిర్మాణ సంస్థ ఎండి వి.పి.గౌతం

ప్రజాపక్షం/హైదరాబాద్: ' ఇందిరమ్మ ఇండ్ల పథకం' రెండవ విడత ఇండ్ల మంజూరును వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం అధికారులకు సూచించారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 2వేల ఇండ్ల మంజూరు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు.గృహ నిర్మాణ సంస్థ జిల్లాల ప్రాజెక్టు డైరక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో హైదరాబాద్‌లోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వి.పి గౌతం మాట్లాడుతూ ఇందిరమ్మ మొదటి విడత విజయవంతమవ్వడంతో రెండవ విడత మంజూరు కోసం ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయి అధికారులు మరింత వేగవంతంగా చర్యలు తీసుకుని, ఇండ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. రెండవ విడత పథకంలో ఇండ్ల కేటాయింపును గుడిసెల్లో నివసిస్తున్న వారికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గుడిసెలో నివసిస్తున్న వారిని ఎంపిక చేసే అంశంపైన ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఇండ్ల మంజూరు విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా ఇన్ ఛార్జి మంత్రులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇండ్ల మంజూరు విషయంలో ఎటువంటి ప్రలోభాలకు లోను కావద్దన్నారు. రూఫ్ రీప్లేస్ మెంట్ కార్యక్రమం కింద మంజూరైన 500 ఇండ్ల కు కూడా అర్హులైన వారిని గుర్తించి, పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. బిల్లుల విడుదలలో జాప్యాన్ని నివారించేందుకు లబ్ధిదారులే ఆన్ లైన్ లో స్వయంగా ఫోటోలు అప్ లోడ్ చేసుకునే విధానంపై సమగ్రమైన అవగాహన కల్పించేందుకు ప్రాజెక్టు డైరక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజనీర్ ఎం. చైతన్యకుమార్, సీనియర్ టెక్నికల్ కన్సల్టెంట్ ఎస్ ఈశ్వరయ్య, జనరల్ మేనేజర్లు మమత, శ్రీదేవి సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓడిపోతే 'మిస్టర్ వీటో'గా అవతరిస్తా



ముందే బ్లాక్‌మెయిల్ ప్రారంభించిన ట్రంప్

నెలలుగా వైట్‌హౌస్‌లో ముందస్తు సన్నాహాల ప్రణాళిక!

వాషింగ్టన్: మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోతే ''మిస్టర్ వీటో''గా అవతరిస్తానని న్యూయార్క్‌పోస్ట్‌కు సంబంధించిన పాడ్‌కాస్ట్(పాడ్‌ఫోర్స్–1)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోమవారం చెప్పారు. డెమోక్రాట్లు కాంగ్రెస్ ఉభయసభల్లోనూ ఈ ఎన్నికల్లో ఆధిపత్యం సాధిస్తే ప్రభుత్వాన్ని నడిపేందుకు వీలుగా అధ్యక్షుడు–కాంగ్రెస్ మధ్య రాజీ కుదిరేలోపు రెండు నెలలపాటు డెమోక్రాట్లు చేసే ప్రతి శాసనాన్నీ వీటో చేస్తానని పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. తద్వారా వారు విసిగిపోయి కొద్ది కాలానికి తనతో రాజీపడతారని ట్రంప్ చెప్పారు. చట్టబద్ధంగా డెమోక్రాట్లు తనతో ఒప్పందం చేసుకునేలా చేస్తానని అన్నారు. ఎన్నికల్లో రిపబ్లికన్లు ఓడిపోతారని ఆయన మానసికంగా సన్నద్ధమయ్యారని ఈ వ్యాఖ్యలే చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో ఆధిపత్యం సాధించాలంటే ఇప్పుడున్నసీట్ల కంటే దిగువసభలోనూ, ఎగువసభలోనూ డెమోక్రాట్లు చెరో నాలుగు సీట్లు అదనంగా సంపాదించాలి. ముందస్తు సర్వే ఫలితాలు డెమోక్రాట్లకే అనుకూలంగా కనిపిస్తున్నాయి. కాగా, డెమోక్రాట్లు కాంగ్రెస్ ఉభయసభలనూ స్వాధీనం చేసుకునే అవకాశాలు గ్రహించి ముందుగానే కొన్ని సన్నాహాలతో ఒక ప్రణాళికను ట్రంప్ యంత్రాంగం అనేక నెలలుగా తయారు చేస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ముగ్గురు వైట్‌హౌస్ సీనియర్ అధికారులు తెలియజేసినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ వెల్లడించింది. ట్రంప్ తన అజెండాలో ఉన్న అంశాలను ఎన్నికల వరకూ ఆగకుండా వేగంగా అమలు చేయడంకోసం కార్యనిర్వాహక వ్యవస్థల ద్వారా వేగిరపరచే ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. వలసలు, సుంకాలు, హౌసింగ్ కాస్ట్స్, ఫెడరల్ వ్యయాలకు సంబంధించి కాంగ్రెస్ ఆమోదం లేకుండా ట్రంప్ చేపట్టగల అంశాలను నిర్ధారించేందుకు, తగిన ఏర్పాట్లు చేసేందుకు కొద్ది నెలలుగా వైట్‌హౌస్ కార్యాలయంతో డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లెర్,బడ్జెట్ డైరెక్టర్ రస్సెల్ వౌట్‌లతో కలిసిపనిచేస్తున్నారని రాయిటర్స్ పేర్కొంది.అధ్యక్షహోదాలో కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా చట్టబద్ధంగా ట్రంప్ ఏం చేయగలరు?తన అధికార పరిమితులను ఏ సందర్భాలలో ఎలా ఉపయోగించుకోవాలి? తీసుకున్న నిర్ణయాలను ఎలా సమర్థించుకోవాలి?అనే విషయాలపై వైట్‌హౌస్ న్యాయసలహాదారు విల్‌షార్ప్, ఆయన బృందం అనేక ఆలోచనలను సమకూర్చేపనులపై కసరత్తు చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ గనుక డెమోక్రాట్ల చేతుల్లోకి వెళితే చట్ట ప్రకారం ప్రతి విషయానికి ట్రంప్ చాలా సందర్భాలలో ఉభయసభల ఆమోదం పొందాల్సి ఉంటుంది. ట్రంప్ వ్యయాల ప్రాధాన్యతలను కాంగ్రెస్ నియంత్రించగలదు.చట్టాలను అద్దుకోగలదు. ఐతే వాణిజ్యం,విదేశాంగవిధానం,ఫెడరల్ యంత్రాంగాలకు సంబంధించి ఆయనకు కొన్ని అధికారాలు ఉంటాయి.

ఇదిలాఉండగా వైట్‌హౌస్ ప్రతినిధి లారెన్ బిస్ మాట్లాడుతూ,దేశ సరిహద్దులను భద్రంగా ఉంచడం, అమెరికన్ల జేబులు నింపడం,దేశ ఖజానాను సుంకాల ద్వారా నింపడం, శాంతి భద్రతల పరిరక్షణ వంటి చర్యలన్నీ ప్రస్తుత అధికార పక్షమే చేయగలదని అన్నారు.

నేడు మధ్యంతర తీర్పు

గత ఏడాది జనవరిలో డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి కాంగ్రెస్ ఉభయసభలకు(సెనేట్‌లో కొన్నిసీట్లకు మాత్రమే) మంగళవారం జరుగనున్న పోలింగ్‌లో ప్రజలు 'మధ్యంతర తీర్పు'ఇవ్వనున్నారు. ఈ ఎన్నికలపై డెమోక్రాట్లు భారీ ఆశలు పెట్టుకున్నారు. వారి అంచనాలన్నీ చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయి. బ్యాలెట్ పత్రాలలో ట్రంప్ పేరు ఎక్కడా లేకపోయినాగానీ, తనను చూసి ఓటు వేయాలంటూ ట్రంప్ ప్రతికూల పరిస్థితుల్లో కూడా తన ఇమేజ్‌ను తెరమీదకు తీసుకురావడంతో ఇది ట్రంప్ పనితీరుపై మధ్యంతర తీర్పుగా మారనున్నది. అమెరికా దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌ల ఉన్న మొత్తం 435 స్థానాలకు,ఎగువసభ సెనేట్‌లో ఉన్న మొత్తం 100 స్థానాలలో 35 స్థానాలకు పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్ ఉభయసభల్లో అధికార రిపబ్లికన్‌పార్టీకి కేవలం స్వల్ప మెజార్టీ మాత్రమే ఉంది. గడచిన 22 నెలల్లో ట్రంప్‌పై వ్యతిరేకత 60శాతంగా ఉందని సర్వేలు వెల్లడించాయి.అప్రూవల్ రేటు కేవలం 37 శాతంగా మాత్రమే ఉంది. ఆర్థిక వ్యవస్థ పనితీరుచూసి ఓటు వేస్తామని 84 శాతం ప్రజలు చెప్పినట్లు ఇప్పటికే ఆంగ్ల మీడియా తెలియజేసింది.దేశంలో దిగజారిన ప్రజాస్వామ్యం,దాని పనితీరు ఆధారంగా ఓటు వేస్తామని 73 శాతం మంది,ఆరోగ్య వ్యవస్థ తీరు తెన్నులను దృష్టిలో పెట్టుకుని ఓటు వేస్తామని 68 శాతం మంది,వలసల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఓటు వేస్తామని 58 శాతం మంది చెప్పారట.కానీ ఇటీవలి అమెరికా రాజకీయ చరిత్రలో ముందస్తు సర్వేలు తలక్రిందులైన ఘటనలున్నాయి. జో బైడెన్ గెలుస్తారని సర్వేలు చెప్పాయి. కానీ ఆయన స్వల్ప తేడాతో ఓడిపోయారు. దిగువసభలో ప్రస్తుతం రిపబ్లికన్లకు 218 స్థానాలు ఉండగా,డెమోక్రాట్లకు 214,ఎగువసభలో రిపబ్లికన్లకు 53 స్థానాలు ఉండగా,డెమోక్రాట్లకు 45 స్థానాలు ఉన్నాయి.రిపబ్లికన్లకు కాంగ్రెస్‌లో స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉంది. ప్రస్తుత దిగువసభలో ఒక ఇండిపెండెంట్ ఉండగా, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.సెనేట్‌లో ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని చూసినప్పుడు రిపబ్లికన్లు కాంగ్రెస్‌పై పట్టుకోల్పోయే ప్రమాదం అంచున ఉన్నారు. గడచిన 22 నెలల్లో ప్రభుత్వ పనితీరుపై అసమ్మతి గణనీయంగా పెరిగింది. పలు దేశాలపై సుంకాల భారాలు, ఇరాన్‌పై యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూతపడటంతో చమురు ధర బాగా పెరిగిపోవడం ప్రధానంగా ప్రజలపై ప్రభావం చూపిస్తున్నాయి. 2022 నాటికంటే ఈనాడు పెట్రోలు ధర నాలుగు డాలర్లు ఎక్కువగా ఉంది.

తెలంగాణను సంపూర్ణ కరువు ప్రాంతంగా ప్రకటించాలి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్ నినో ప్రభావంతో రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు సంక్షోభంలో కూరుకుపోతుంటే కేవలం 365 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాలు, పట్టణాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన సోమవారం బహిరంగ లేఖ రాశారు. పంట నష్టపోయిన రైతులకు వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని, రైతు రుణాలు మాఫీ చేసి రైతు భరోసా రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డుదారులకు 14 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలని, ఉపాధి హామీ పనిదినాలను 200కు పెంచి రోజువారీ కూలీ రూ.800 చేయాలని కోరారు.తాగునీరు, పశుగ్రాసం, ఉచిత విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కరువు నివారణకు కేంద్రం నుంచి రూ.50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ సాధించేందుకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్షణమే ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉక్రేన్–రష్యాలపై సైబర్ దాడులు: నకిలీ హెచ్చరికలు

కీవ్: ఉక్రేన్–రష్యాలలో అత్యవసరంగా ప్రజల్ని అప్రమత్తం చేసే యాప్‌లను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులు జరిగాయి. దీంతో నకిలీ హెచ్చరికలు, తప్పుడు హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ పరిణామాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఉక్రేన్‌లో రసాయనాల బెదిరింపులు, వీధిపోరాటాలు జరుగుతున్నాయన్న బెదిరింపులు వచ్చాయని, వీటిని చూసి తాను అన్ని పరిస్థితులను ఎదుర్కొనేందుకు సన్నద్ధమయ్యానని కీవ్ మహిళ ఓలెనా చెప్పారు. అణు బెదిరింపులు వచ్చాయని తాను భావించలేదని, సెంట్రల్ హీటింగ్, వాటర్ సప్లై సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డామని అన్నారు. కానీ ఇవన్నీ చివరకు నకిలీ అని తేలింది. అణుయుద్ధం జరిగే అవకాశాలు లేవని వైమానిక దళం కూడా ముందుగా ఒక స్పష్టత తీసుకుని ఊపిరి పీల్చుకుంది. ఈ సైబర్ దాడులకు సంబంధించి హిట్ కోర్ అనే హ్యాకింగ్ గ్రూప్ కూడా వెలుగులోకి వచ్చింది. ఈ దాడికి వారే బాధ్యులని ప్రకటించుకున్నారు. కాగా ఇలాంటి సందర్భాలలో భౌతికపరమైన హెచ్చరికలపై ఆధారపడాలని, ఆన్‌లైన్ వార్తలను నమ్మకూడదని ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా రష్యా కూడా ఒక ప్రకటన చేస్తూ, తమ యాప్‌లపై సామూహికంగా సైబర్ దాడులు జరిగాయని పేర్కొంది. అత్యవసర మంత్రిత్వశాఖ ఈ పరిస్థితులను చక్కదిద్దే చర్యలు తీసుకుంది. సైబర్ సెక్యూరిటీ నిపుణుడు డాన్‌స్మిత్ మాట్లాడుతూ రష్యా నుండి తీవ్ర ప్రమాదం ఎదురైందనే హెచ్చరికలను సూచిస్తూ ఎమర్జెన్సీ ఎలర్ట్స్ వచ్చాయని, ఇవన్నీ నకిలీ అని చెప్పారు. ఐతే ఈ దాడులు జరగలేదని, తమకు సంబంధం లేదని రష్యా చెప్పింది. ఐతే యుద్ధ రంగానికి సంబంధించి ఇది ఒక అత్యుత్తమమైన సమాచారమని,ఇలాంటివి కూడా జరుగుతాయన్న అనుభవాలు తెలిశాయన్నారు. ఇదిలా ఉండగా, రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ పత్రికా కార్యదర్శి దిమిత్రి పెస్కోవ్ మాస్కోలో మాట్లాడుతూ, రష్యా తరచు సైబర్ దాడులకు గురవుతోందని చెప్పారు.పుతిన్ కార్యాలయ వెబ్‌సైట్లు కూడా ప్రతిరోజూ సైబర్ దాడులకు గురవుతున్నాయని, కృత్రిమ మేధ అభివృద్ధి చెందేకొద్దీ ఈ దాడుల బెడద కూడా పెరుగుతోందని చెప్పారు.

ఇదిలా ఉండగా, ఒలేష్కీ నగరంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించాలని ఉక్రేన్ చేసిన విజ్ఞప్తిని రష్యా తిరస్కరించింది. ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఒలేష్కీ నగరంలో అనేక నెలలుగా చిక్కుకుపోయిన వందలమంది ప్రజలను ఉక్రేన్‌లోని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ బాధితులు తమ కుటుంబాలతో తిరిగి కలుసుకోవడంతో భావోద్వేగాలు పెల్లుబికాయి. ఈ నగరంలో ప్రజలు యుద్ధంవల్ల ఆహారం,నీరు లేక అలమటించిపోయారు.

ఫ్లోరిడా సమీపంలో జెట్ క్రాష్

తొమ్మిదిమంది దుర్మరణం



తల్లహస్సీ: ఫ్లోరిడా సమీపంలో ఒక వాణిజ్యరంగ జెట్ విమానం కుప్పకూలిపోయిన ఘటనలో అందులో ప్రయాణం చేస్తున్న తొమ్మిదిమంది దుర్మరణం పాలయ్యారు.విమానం కూలిపోయేముందుగా పైలట్ తాము పెను ప్రమాదంలో ఉన్నామంటూభూతల కేంద్రానికి 'డిస్ట్రెస్ కాల్' ఇచ్చారు.పామ్ బీచ్ కౌంటీలోని క్రిస్టవెన్ సమీపంలో ఈ వాణిజ్య జెట్ విమానం కూలిపోయింది.తీవ్రమైన మంచు వాతావరణంలో విమానం కూరుకుపోయింది.శరవేగంగా విమానం కిందికి జారిపోతున్న సమయంలో పైలట్ డిస్ట్రెస్ కాల్స్ ఇచ్చారు. ఐతే వాస్తవ కారణాలు ఏమిటో తెలుసుకోవడానికి దర్యాప్తు ప్రారంభించారు. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 11.30 తర్వాత విమానం కూలిపోయింది. లియర్ జెట్–60 వాణిజ్య విమానం ఆస్టిన్ లో బయలుదేరి బహమాస్ వెళుతుండగా ప్రమాదం సంభవించింది.తొలుత 37వేల అడుగుల ఎత్తుకు వెళ్ళేందుకు పైలట్ అనుమతి కోరాడు. ఆ తర్వాత ఎమర్జెన్సీ ప్రకటించాడు. తాము నిమిషానికి 20,000 అడుగుల వేగంతో భూమిని తాకే దిశగా వచ్చేస్తున్నామని ప్రకటించాడు. ఆ తర్వాత 35 సెకన్ల తర్వాత ఇక తమ పని ఐపోయిందని కాక్‌పిట్ నుండి తుది సందేశం అందింది.

నిర్మాణాలు పూర్తయిన 9 ఆసుపత్రులను అందుబాటులోకి తేవాలి

అవసరమైన సామాగ్రి వైద్యపరికరాలు ఏర్పాటు చేయాలి: మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో నిర్మాణాలు పూర్తయిన 9 ఆస్పత్రి భవనాల్లో అవసరమైన ఎక్విప్‌మెంట్స్, ఫర్నీచర్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. డిసెంబర్, మార్చిలో నిర్మాణాలు పూర్తయ్యే భవనాలకు సంబంధించిన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని డిఎస్‌హెచ్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్ల భవన నిర్మాణ పనులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్,జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, టిజిఎంఎస్‌ఐడిసి ఎండి గౌరవ్ ఉప్పల్, వివిధ జిల్లాల డిసిహెచ్‌ఎస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు హాస్పిటళ్లు, మెడికల్, నర్సింగ్ కళాశాలల భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని టిజిఎంఎస్‌ఐడిసి ఎండి గౌరవ్ ఉప్పల్ మంత్రికి వివరించారు. సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ పరిధిలో 9 హాస్పిటల్ భవనాల నిర్మాణం పూర్తయిందని, డిసెంబర్ నాటికి మరో 14 భవనాలు, 2027 మార్చి నాటికి మరో 11 భవనాల నిర్మాణం పూర్తవుతుందని, మరో 45 భవనాల నిర్మాణం వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. కనీసం 90 శాతం మంది పేషెంట్లకు జిల్లాల్లోనే వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో, కమ్యూనిటీ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మూడు సంవత్సరాల్లో డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు సహా ఆరోగ్యశాఖలో సుమారు 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, డిఎస్‌హెచ్ పరిధిలోని హాస్పిటల్స్‌లో ఇటీవలే 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించామని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాల్సిన బాధ్యత డిసిహెచ్‌ఎస్‌లు,హాస్పిటళ్ల సూపరింటెండెంట్లపైనే ఉందన్నారు. ఎల్‌నినో నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డిసిహెచ్‌ఎస్‌లకు మంత్రి సూచించారు. హాస్పిటళ్లలో నీరు, విద్యుత్, ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

రూ.18 వేలు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

శిశు, గర్భిణుల మరణాల నివారణకు అంగన్‌వాడీలు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న రూ.13 వేల వేతనంతో కుటుంబం బ్రతకడం సాధ్యం కాదని, సామాన్య కార్మికుల వేతనాల పెంపుపై నిర్లక్ష్యం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాల అద్దెలు, గ్యాస్, ఆరోగ్యలక్ష్మి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకుండా తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రాలకు నాణ్యతలేని సరుకులు సరఫరా చేస్తున్న టెండర్లను రద్దు చేసి శనగలు, కారం, చింతపండు, గుడ్లు నాణ్యమైనవి పంపిణీ చేయాలని, టీచర్లపై బలవంతంగా రుద్దుతున్న బిఎల్‌ఓ డ్యూటీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పీఫ్, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తూ ఆయాలకు కనీసం రూ.10 వేల వేతనం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఖాళీగా ఉన్న గ్రేడ్2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారి తారకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య వేల్పుల మల్లికార్జున్, భూక్యా శ్రీనివాస్, రెడ్డి అరుణ, విజయ, భారతి, సంధ్య, ఇందిర, మీనాకుమారి, కృష్ణకుమారి, సమ్మక్క, చిన్నారి, శ్రీదేవి, సునీత, సరస్వతి, సుజాత, శోభారాణి, గుర్రం వెంకటేశ్వర్లు, ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించి, బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓట్ బచావో' ర్యాలీలపై అమిత్ షా విమర్శలు సంధించారు. అవి ఓట్లను కాపాడే ర్యాలీలు కాదని, చౌరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకునే ప్రయత్నమని ఆరోపించారు. రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కనివ్వబోమని అన్నారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లతో ఉన్న ఓట్లు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ వల్లే బిజెపి గెలుస్తోందన్న కాంగ్రెస్ ఆరోపణలను అమిత్ షా ఖండించారు. 2014, 2019 ఎన్నికల్లో ఎస్ఐఆర్ లేకుండానే నరేంద్ర మోదీ విజయం సాధించారన్నారు. ఈవిఎంల వల్లే బిజెపి గెలుస్తోందని చెబితే తెలంగాణలో కాంగ్రెస్ ఎలా అధికారంలోకి వచ్చిందని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో బిజెపియేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీతో కాంగ్రెస్ పోటీ పడలేదన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పాలనలో 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో రాహుల్‌రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అసోం, బెంగాల్, హర్యానాలో బిజెపి విజయాలను ప్రస్తావిస్తూ భవిష్యత్తులో తెలంగాణలోనూ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు కాలేదని విమర్శించారు. ఈవిఎంలు, ఎస్ఐఆర్‌పై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మరోసారి స్పష్టం చేసిన అమిత్ షా, కాంగ్రెస్‌కు నిజంగా అభ్యంతరాలు ఉంటే పార్లమెంట్‌లో చర్చకు రావాలన్నారు. గెలిచినప్పుడు ప్రజలు గెలిపించారని, ఓడిపోయినప్పుడు ఈవిఎంలను నిందించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని విమర్శించారు. ఈ మహా పాదయాత్రలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, బిజెపి పార్లమెంటరీ పార్టీ సభ్యులు, ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రులు గంగాపురం కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు డి.కె. అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, బిజెపి ప్రధాన కార్యదర్శులు టి.వీరేందర్ గౌడ్, డాక్టర్ గౌతం రావు, కాసం వెంకటేశ్వర్లు తదితర నేతలు పాల్గొన్నారు.

హోర్ముజ్ తెరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

''రెండు రోజుల ప్రణాళిక''గా కుదించడానికి దోహదపడిందని చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సెషన్ ప్రారంభం సందర్భంగా సెప్టెంబరు నెలాఖరున ఇరాన్ నాయకులు న్యూయార్క్‌లో పర్యటించారు.ఈ సమావేశాలకు హాజరైన అనేకమంది నాయకులతో చర్చలు జరిపారు.ఈ సమయంలోనే ఏడు రోజుల ప్రణాళిక ప్రతిపాదనను అమెరికాకు మధ్యవర్తుల ద్వారా ఇరాన్ సమర్పించింది.మధ్యవర్తుల ద్వారా అమెరికా ప్రతినిధులతో చర్చలు కూడా జరిగాయి.తాము ఏడు రోజుల ప్రణాళిక అమలుకు కట్టుబడి ఉన్నామని,దీని అమలుకు అమెరికా భరోసా ఇవ్వాలని అబ్బాస్ అరాఘ్చి అన్నారు.అమెరికా సద్భావన ప్రదర్శించాలని,మనస్ఫూర్తిగా శాంతిని కోరుకుంటే ఈ ప్రణాళిక అమలు చేయడం,హోర్ముజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకలకు తెరవడం సాధ్యమేనని అన్నారు.ఇరాన్ విధించిన షరతులు అమెరికా నెరవేరిస్తే ఈ ఏడురోజుల ప్రణాళిక ప్రకారం ఆరో రోజున హోర్ముజ్ జలసంధిని రాకపోకలకు తెరుస్తామని,ఏడో రోజున రెండు దేశాలమధ్యా చర్చలు ప్రారంభమవుతాయని చెప్పారు.పశ్చిమాసియా నుండి అమెరికా తన సైన్యాలను పూర్తిగా ఖాళీచేసి వెళ్ళిపోవడం,హోర్ముజ్ జలసంధిలో దిగ్బంధనం ఎత్తివేయడం,స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం,లెబనాన్ సహా అన్ని రంగాలలో యుద్ధం శాశ్వత ప్రాతిపదికపై విరమించడం వంటి షరతులు ఇరాన్ విధించింది.

మభ్యపెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసిన నిధులు, తమకు రావాల్సిన హక్కు లు, అభివృద్ధి,యువతకు కల్పించిన ఉద్యోగాలు, రై తుల సంక్షేమానికి తీసుకున్న చర్యలు, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం చేసిన మేలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌కు వచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అమిత్ షా సభతో తెలంగాణకు ఒరిగేదేమీలేదని, అమిత్‌షా హైదరాబాద్‌లో సభలు, పాదయాత్రలు నిర్వహించడం కాకుండా ముందుగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. తెలంగాణ ప్రజల ఓటు హక్కు, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' అంటూ ఆధారంలేని ఆరోపణలు చేయడం బిజెపి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మహేష్ ‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బిజెపి ఆటలు సాగవని, వచ్చే ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న ఎనిమిది ఎంపి స్థానాలు కూడా దక్కవని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ హామీల పరిస్థితి ఏమిటని ఆయన నిలదీశారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించే విషయంలో కేంద్రం వైఖరేంటని, రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా, కేంద్ర గ్రాంట్లను పూర్తిస్థాయిలో విడుదల చేసి న్యాయం చేశారా అని ఆయన ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. తెలంగాణ ప్రజలు మతం, భావోద్వేగాల పేరుతో సాగించే రాజకీయాలను అర్థం చేసుకున్నారని, ఎన్నికలు వచ్చినప్పుడే రాష్ట్రం గుర్తుకు రావడం, ఆ తర్వాత సమస్యలను పట్టించుకోకపోవడం బిజెపికి అలవాటుగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తుంటే, బిజెపి మాత్రం ప్రభుత్వంపై విమర్శలకే పరిమితమైందన్నారు. కేంద్రం రాజకీయ వివక్ష చూపుతూ నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

'మురసు'

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తీవ్ర వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, ఈ మేరకు ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సోమవారం నుండి గురువారం వరకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో (గరిష్టంగా 60 కి.మీ) బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. మంగళ, బుధవారాల్లో వర్ష తీవ్రత మరింత పెరిగుతుందన్నారు. నల్లగొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్నారు. సూర్యాపేట, మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, గంటకు 50 నుండి 70 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధ, గురువారాల్లో వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నాలుగో రోజు నుండి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టనుందన్నారు. గురు, శుక్రవారాల్లో చాలా జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయన్నారు. శని, ఆదివారాల్లో కేవలం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కోత కోసిన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు సూచించారు.

మళ్లీ కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న హింస ఆమోదయోగ్యం కాదు. ఎలాంటి మనోవేదనలు లేదా విభేదాలు ఒక మనిషి ప్రాణం తీయడాన్ని సమర్థించలేవు' మరో ప్రకటనలో దిఖో అన్నారు. కిప్జెన్ కుకీ సామాజిక వర్గానికి చెందినవాడు కాగా, దిఖో నాగ వర్గానికి చెందినవాడు. ఇదిలా ఉండగా, సేనాపతి జిల్లాలో మృతదేహాలు లభ్యం కావడంపై నాగ పీపుల్స్ ఆర్గనైజేషన్ ప్రశ్నలు లేవనెత్తింది. ఎన్‌పిఓ అధ్యక్షుడు కుబా పీటర్ విలేకరులతో మాట్లాడుతూ 'మేము ఏ హత్యనైనా ఖండిస్తాము, కానీ సాక్ష్యాలను తారుమారు చేయడాన్ని లేదా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నాన్ని కూడా అంతే తీవ్రంగా ఖండిస్తాము. నిజానిజాలు నిరూపించడానికి, జవాబుదారీతనం ఉండేలా చూడటానికి, ఇంకా మత ఉద్రిక్తతలు పెరగకుండా నివారించడానికి నిష్పక్షపాత, పారదర్శక, స్వతంత్ర విచారణ జరపాలని మేము డిమాండ్ చేస్తున్నాము' అని అన్నారు. ఈ ఘటనపై దిఖో రాజీనామా చేయాలని కాంగ్‌పోక్పికి చెందిన గిరిజన ఐక్యతా కమిటీ (సిఒటియు) డిమాండ్ చేసింది. తఫో కుకీ గ్రామాన్ని సేనాపతి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పరిధి నుంచి కాంగ్‌పోక్పి ఎస్‌పి పరిధికి బదిలీ చేయాలని కూడా కోరింది. నిందితులను అరెస్టు చేసే వరకు మృతదేహాలను అంత్యక్రియల కోసం గ్రామానికి తీసుకెళ్లబోమని కమిటీ తెలిపింది. కాంగ్‌పోక్పి, సేనాపతి జిల్లాల సరిహద్దుల వెంబడి యువకుల కోసం పోలీసులు, సిఆర్‌పిఎఫ్, అసోం రైఫిల్స్ సంయుక్త బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని అధికారులు తెలిపారు. అలాంటి ఒక ఆపరేషన్‌లో భాగంగా, సంయుక్త బృందాలు రెండు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి అని ఒక పోలీసు అధికారి తెలిపారు. 'ఎన్‌హెచ్–2కు తూర్పున ఉన్న ఎస్‌పి రోడ్డు వెంబడి సాధారణ ప్రాంతంలో మణిపూర్ పోలీసులు, కోబ్రా, సిఆర్‌పిఎఫ్, అసోం రైఫిల్స్, ఆర్‌ఎఎఫ్‌లతో కూడిన సంయుక్త బృందాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి' అని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పి రోడ్డు సేనాపతి, కాంగ్‌పోక్పి జిల్లాలను కలిపే ఒక కొండ ప్రాంతం. శనివారం నోనీ జిల్లాలో ప్రత్యర్థి సాయుధ వర్గాల మధ్య జరిగిన కాల్పుల ఘటనలో కుకీ వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించారని పోలీసులు తెలిపారు. వారి మృతదేహాలు ఆదివారం రాత్రికి చురాచంద్‌పూర్ జిల్లాకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో కుకీ, నాగా వర్గాల మధ్య జాతి ఘర్షణలు చెలరేగినప్పటి నుండి తమెంగ్లాంగ్, నోనీ, కామ్‌జాంగ్, ఉఖ్రుల్, కాంగ్‌పోక్పి జిల్లాల్లో 50 మందికి పైగా మరణించగా, డజన్ల కొద్దీ ఇళ్లు తగలబడ్డాయి.

న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు భారత తుది జట్టు



న్యూజిలాండ్‌తో ఐదు టి–20ల సిరీస్‌ను గెలుచుకున్న భారత్.. వన్డే సమరానికి సిద్ధమైంది. బుధవారం హామిల్టన్ వేదికగా జరిగే తొలి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. టి–20 సిరీస్ తరహాలోనే ఈ మ్యాచ్ లోనూ గెలిచి వన్డే సిరీస్‌ను ఘనంగా ప్రారంభించాలనే లక్ష్యంతో భారత్ ఉంది. మరోవైపు చివరి రెండు టి–20ల తరహాలోనే సమష్టి ప్రదర్శనతో వన్డేల్లో శుభారంభం చేయాలని న్యూజిలాండ్ భావిస్తోంది. భారత వెటరన్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ సిరీస్ ఆడుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. సీనియర్ ఆటగాళ్ల రీఎంట్రీతో టీమిండియా కాంబినేషన్‌లో మార్పులు జరగనున్నాయి. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ విభాగంలో ఆటగాళ్లు మారనున్నారు.

ఓపెనర్లుగా గిల్, రోహిత్... కెప్టెన్ శుభమన్ గిల్‌తో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నారు. ఈ ఇద్దరు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే భారత్‌కు తిరుగుండదు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. కెఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ చేయనున్నాడు. ఈ నలుగురిలో ఏఇద్దరు ఆడినా భారత్ భారీ స్కోర్ చేస్తోంది. నమన్ ధీర్, నితీష్ కుమార్‌రెడ్డి ఆల్‌రౌండర్లుగా ఆడనున్నారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే కుల్దీప్ యాదవ్ బరిలోకి దిగుతాడు. లేదంటే అక్షర్ పటేల్‌కు అవకాశం దక్కుతుంది. అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కాంబోజ్ పేస్ బాధ్యతలు పంచుకునే అవకాశం ఉంది. సిరాజ్ బెంచ్‌కె పరిమితమయ్యే ఛాన్స్ ఉంది. ఆకిబ్ నబీని ఆడించాలనుకుంటే అన్షుల్ కాంబోజ్ బెంచ్కు పరిమితమవుతాడు.

న్యూజిలాండ్‌తో తొలి వన్డే అదే భారత తుది జట్టు(అంచనా)... శుభమన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్/కుల్దీప్ యాదవ్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్/మహమ్మద్ సిరాజ్, అన్షుల్ కాంబోజ్/ఆకిబ్ నబీ.

తొలి మూడు వన్డేలకు భారత్ జట్టు: శుభమన్ గిల్, రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్‌రాహుల్, అక్షర్ పటేల్, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, రుతురాజ్ గైక్వాడ్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, మహమ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి(తొలి వన్డేకు మాత్రమే), ఆకిబ్ నబీ.

సింధు ఖాతాలో హైలో టైటిల్



సార్‌బ్రూకెన్(జర్మనీ): హైలో ఓపెన్ బ్యాడ్మింటన్–500 టోర్నమెంట్‌లో భారత్ కు ఒకేరోజు డబుల్ బొనాంజా. మహిళల, పురుషుల సింగిల్స్ టైటిల్స్ భారత షట్లర్లు దక్కించుకున్నారు. విమెన్స్ సింగిల్స్ టైటిల్‌ను పివి.సింధు నెగ్గితే మెన్స్ కేటగిరీలో లక్ష్యసేన్ విజేతగా నిలిచాడు. ఈ టోర్నీలో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సింధు.. 21–12, 21–14తో డెన్మార్క్ షట్లర్ లినె కార్స్‌ఫెల్ట్‌ను వరుస గేమ్‌లో ఓడించి ఈ సీజన్‌లో జపాన్ ఓపెన్ తర్వాత రెండో టైటిల్‌ను తన ఖాతా లో వేసుకుంది. 39నిమిషాల్లోనే పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్లో సింధు.. ప్రత్యర్థికి కోలుకునే అవకాశమే ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. తొలి గేమ్‌లో సింధు తనదైన క్రాస్ కోర్టు విన్నర్లతో 8–5తో ఆధిక్యంలోకి వెళ్లింది. డెన్మార్క్ అమ్మాయి ర్యాలీలను పొడిగించేందుకు యత్నించినా ఆమెను నెట్ వద్దకు తీసుకొచ్చి బోల్తా కొట్టించిన సింధు.. 17–12తో గేమ్‌ను గెలుచుకునేందుకు చేరువైంది. లినె నెట్ వద్ద తప్పులు చేస్తుండటంతో దానిని సద్వినియోగం చేసుకుని తొలి గేమ్‌ను నెగ్గిన ఆమె రెండో గేమ్‌ను పెద్దగా కష్టపడకుండానే ముగించింది.

లక్ష్యకు తొలి టైటిల్.... ఈ సీజన్‌లో వరుస ఓటములతో డీలాపడ్డ లక్ష్యసేన్ హైలో ఓపెన్‌లో సత్తాచాటాడు. మెన్స్ సింగిల్స్ ఫైనల్స్‌లో అతడు 21–17, 21–10తో ప్రపంచ ఆరో నంబర్ షట్లర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)ను ఓడించి ఈ ఏడాది తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఈ టోర్నీలో సేన్‌కు ఇది రెండో టైటిల్ కావడం విశేషం. తద్వారా హైలో ఓపెన్‌ను రెండు సార్లు గెలుచుకున్న భారత షట్లర్‌గా అతడు రికార్డులకెక్కాడు.

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు తిలక్‌వర్మ కెప్టెన్సీ

జట్టులో అభిషేక్, వైభవ్



న్యూఢిల్లీ: రైజింగ్ స్టార్ ఆసియాకప్(మెన్స్ టోర్నీ కోసం ఇండియా–ఎ జట్టును ప్రకటించారు. భారత జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ని ఎంపిక చేశారు. 15 మంది సభ్యులతో కూడిన ఇండియా–ఎ జట్టును సోమవారం బిసిసిఐ ప్రకటించింది. తిలక్‌వర్మను కెప్టెన్‌గా నియమించారు. రజిత్ పటిదార్ వైస్ కెప్టెన్సీ చేయనున్నారు. నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లో ఈ టోర్నీ జరగనున్నది. ఇటీవల కివీస్‌తో జరిగిన సిరీస్‌లో ఆడిన భారత జట్టు బృందంలోని ఆటగాళ్లు ఇండియా–ఎ జట్టులో చోటు దక్కించుకున్నారు. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపైనే ఫోకస్ పెట్టారు. ఫినిషర్ పాత్రను రింకూ సింగ్ పోషించనున్నాడు. ప్రభసిమ్రన్, కుమార కుషాగ్రా..కీపింగ్ బాధ్యతలను చేపట్టనున్నారు. సూర్యాంశ్ షెడ్జ్, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగం, హర్ష్ దూబే, తనుష్ కోటియాన్.. ఆల్‌రౌండర్లుగా బరిలోకి దిగనున్నారు. పేస్ బౌలింగ్‌లో హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్ ఉన్నారు. భారత జట్టు గ్రూపు–బిలో ఉన్నది. దాంట్లో పాక్, నేపాల్, యుఎఈ జట్లు ఉన్నాయి. నవంబర్ 20న నేపాల్‌తో ఇండియా తొలి మ్యాచ్ ఆడనున్నది. గ్రూపులో బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, హాంగ్కాంగ్, చైనా ఉన్నాయి.

యువతరంగం

పాత ఉద్యమాలకు భిన్నమైన నేటి పోరాటం





నేటి యువజన ఉద్యమాలను 1960, 1970 దశకాల విద్యార్థి ఉద్యమాలతో పోలిస్తే కొన్ని మౌలికమైన తేడాలు కనిపిస్తాయి. అప్పటి యువత ప్రధానంగా రాజకీయ స్వేచ్ఛ, సామాజిక సమానత్వం, సాంస్కృతిక స్వేచ్ఛ, యుద్ధ వ్యతిరేకత వంటి అంశాలపై పోరాడింది. ఆ కాలంలో అనేక దేశాల్లో సంక్షేమ వ్యవస్థలు, సంఘటిత కార్మిక ఉద్యమాలు బలంగా ఉండేవి. నేటి యువత మాత్రం ప్రాథమిక ఆర్థిక భద్రత, ఉద్యోగం, కనీస వేతనం, గృహవసతి, వైద్యం వంటి అవసరాల కోసం పోరాడుతోంది. అప్పటి ఉద్యమాలకు కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకత్వాలు దిశానిర్దేశం చేసేవి. నేటి ఉద్యమాలు ప్రధానంగా సామాజిక మాధ్యమాల ద్వారా వేగంగా విస్తరిస్తున్నాయి. వాటికి ఒకే నాయకత్వం ఉండకపోవచ్చు. వివిధ ప్రాంతాల్లోని యువత తమ స్థానిక సమస్యలను ప్రపంచవ్యాప్త ఆర్థిక అసమానతలతో అనుసంధానించుకుంటోంది. అయితే స్పష్టమైన ఉమ్మడి కార్యాచరణ లేకపోవడం, భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉద్యమాల దీర్ఘకాలిక ప్రభావాన్ని పరిమితం చేసే అవకాశం కూడా ఉంది. ఈ నిరసనల ప్రభావం రాజకీయ వ్యవస్థలపైనా పడుతోంది. యువత సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలపై విశ్వాసం తగ్గుతోంది. అవినీతి, బంధుప్రీతి, అసమాన అవకాశాలు ప్రజాస్వామ్య వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. మరోవైపు నిరసనలు తీవ్రతరం కావడం వల్ల పెట్టుబడులు, ఆర్థిక కార్యకలాపాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. అయితే శాంతియుత ప్రజా ఉద్యమాలు ప్రభుత్వాలను బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చేయగలవు. నిర్లక్ష్యానికి గురైన సమస్యలను రాజకీయ చర్చలోకి తీసుకురాగలవు.

ఈ సంక్షోభానికి పరిష్కారం యువత నిరసనలను అణచివేయడంలో లేదు. ప్రజా సంక్షేమ వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రభుత్వ విద్యా, వైద్య సేవలను విస్తరించడం, గిగ్ కార్మికులకు కనీస వేతనం, బీమా, సామాజిక భద్రత కల్పించడం, సంపద కేంద్రీకరణను తగ్గించే ప్రగతిశీల పన్నుల విధానాలను అమలు చేయడం అవసరం. విద్యను ఉపాధి అవసరాలకు అనుసంధానిస్తూ నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ పరిరక్షణ, హరిత పరిశ్రమల్లో కొత్త ఉద్యోగాలను సృష్టించాలి. అభివృద్ధి ఫలాలు అన్ని తరాలకూ సమానంగా అందేలా ప్రభుత్వ ఆర్థిక విధానాలు రూపుదిద్దుకోవాలి. స్థూలంగా చూస్తే, నేటి యువత పోరాటం కేవలం ఉద్యోగాల కోసం సాగుతున్న ఆందోళన కాదు. అది ఎలాంటి సమాజంలో జీవించాలి, అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కాలి, ప్రభుత్వానికి ప్రజల పట్ల ఎంత బాధ్యత ఉండాలి అనే ప్రశ్నలతో ముడిపడిన సామాజిక ఉద్యమం. మార్కెట్ అభివృద్ధి చెందడం మాత్రమే దేశాభివృద్ధికి కొలమానం కాలేదు. ఆ అభివృద్ధిలో యువతకు గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రత, సమాన అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు లభించినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. యువత భవిష్యత్తును భద్రపరచడం అంటే ఒక తరాన్ని ఆదుకోవడం మాత్రమే కాదు; ప్రజాస్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని, దేశ భవిష్యత్తును కాపాడుకోవడం కూడా.

ఉపాధి, భద్రత, భవిష్యత్తు కోసం

యువత ప్రపంచవ్యాప్త పోరాటం

ప్రపంచవ్యాప్తంగా యువత వీధుల్లోకి వస్తోంది. ఫ్రాన్స్, స్పెయిన్ వంటి అభివృద్ధి చెందిన జి7 దేశాల నుంచి భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల వరకు యువత నిరసనల స్వరం బలంగా వినిపిస్తోంది. దేశాలు వేరు, రాజకీయ పరిస్థితులు వేరు, సమస్యల తీవ్రతలో తేడాలున్నా ఈ ఉద్యమాల వెనుక ఒక ఉమ్మడి ఆవేదన కనిపిస్తోంది. చదువుకున్నా ఉద్యోగం దొరకని పరిస్థితి, దొరికిన ఉద్యోగంలో భద్రత లేకపోవడం, పెరిగిపోతున్న జీవన వ్యయం, అందుబాటులో లేని విద్య, గృహవసతి, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కావడం యువతను అసహనానికి గురిచేస్తున్నాయి. ఈ అసంతృప్తికి మూలంగా కనిపిస్తున్నది నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు. యువత నిరసనలు కేవలం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు కావు. అవి తమ భవిష్యత్తుపై, సమాజంలోని ఆర్థిక అసమానతలపై, ప్రజాస్వామ్య వ్యవస్థల బాధ్యతపై యువత సంధిస్తున్న మౌలిక ప్రశ్నలు.



ప్రభుత్వ ఉద్యోగులుగా ‘అంగన్‌వాడీ’లను గుర్తించాలి

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫస్టో హామీ మేరకు రూ.18 వేలు వేతనం ఇవ్వాలి

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల కలెక్టరేట్‌ల ముట్టడి : విజయవంతం



మంచిర్యాల...

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్రంలో ఐసిడిఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.18 వేలు వేతనాన్ని వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధానకార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలతో కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎడమ సుమతి, ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెఎస్.రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బరిగల వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎండి.జానీ, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చలం పాండురంగారావు, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు సుజిత, కోట్ల శోభ, డి.కవిత, ఎ.సరిత, కె.వజ్రమ్మ, ఎం.వనజ, అరుణ, సునీత, అంజలి, టి.కవిత తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్ : అంగన్‌వాడీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు వారి సమస్యలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్ హెల్పర్ అసోసియేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజారాం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాళ్లు పద్మ రేఖ, అంగన్‌వాడీ నాయకురా లు ఆర్. స్వప్న, జి. రమ, బి.సుమిత్ర, సునీత, సరస్వతి, అరుణ, షాహిదా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల : అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయిశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా నలుమూలల నుంచి అంగన్‌వాడీలు భారీగా తరలి వచ్చి కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యాక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగరి భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు దయావతి, లక్ష్మీ, లావణ్య, శారద, వనిత, హిమగిరి, షామిం సుల్తానా, సుమలత, సునీత, లక్ష్మీ, పద్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు సుతారి రాములు, అందే వంశీ, జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి.ఉస్మాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, ఎండి.నమీర్, కిరణ్ కుమార్, బీజనపల్లి మనోహర్ తదితరులు మద్ధతు తెలిపి పాల్గొన్నారు.

మంచిర్యాల : కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో హామీ ప్రకారం అంగన్‌వాడీలకు నెలకు రూ.18 వేలు వేతనం చెల్లించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముట్టడించి, కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భూపతి రమాదేవి, తోకల సరస్వతి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ కలిందర్ అలీ ఖాన్, కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పి.సురేఖ, నేరేళ్ల అరుణ, కె.తిరుమల, ఇంద్ర, శంకరమ్మ, కుసుమకుమారి, పద్మారెడ్డి, ఎ.అరుణ, సరోజ, బి శైలజ, కనకలక్ష్మి, శారద, సంధ్య, జాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిర్ర లక్ష్మీనరసమ్మ, ఆర్.ఎల్లారీశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో మహబూబాబాద్ కలెక్టరేట్ ముట్టడించి, ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు లలిత, కీసర సౌమ్యశ్రీ, రజియా, మరియా, గుగులోతు సక్కుబాయి, నేలకుర్తి హైమావతి, గుగులోతు రాజమ్మ, కవిత, శివలింగేశ్వరి, మైముదా, సుజాత, వరలక్ష్మి, సరిత, శ్రీల,త జ్యోతి, ఎఐటియుసి నాయకులు వెలుగు శ్రావణ్, తండా శ్రీనాథ్, ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు నెలకు రూ.18వేల వేతనం అమలు చేయాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ఎఐటియుసి జాతీయ సమితి సభ్యుడు శింగు నర్సింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సిహెచ్.సీతామహాలక్ష్మి, ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు గాదె లక్ష్మినారాయణ , అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్. ఝాన్సీ, ఎస్‌కె.హస్నాబీ, బాధ్యులు శ్రీదేవి, ఆదిలక్ష్మి, కె.లక్ష్మి, తారా, అమృత, ఝాన్సీ, జ్యోతి, నిర్మల, మంగమ్మ, రేణుక, జానకి పాల్గొన్నారు.

కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కరీంనగర్ జిల్లాకలెక్టర్ కార్యాలయం ముట్టడించి ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ చిత్రామిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా గౌరవాధ్యక్షుడు సమ్మయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నగర కార్యదర్శి కిమ్మసారపు నరసయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్ప్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రజిత, డి.రజిత, నాయకులు డి.భారతి, కె.అరుణ, బి.విజయ, ఎస్.ధనలక్ష్మి, కె.కమలక్క, శారద, ఆర్.సంధ్య, సుజాత, రాజాదేవి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ : తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారి పాండుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, సంఘం నాయకులు ఎం.సువర్ణ, సులోచన, ఎ.ఊసమ్మ, రాము సాగర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం ఆధ్వర్యంలో వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు కొల్లూరి నర్సయ్య, విజయ, సుజాత, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మావల : అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు ధరడే ఛాయా, ఏ.చంద్రకళ, కళ్లేపెల్లి గంగయ్య, ఇందుమతి, సంగీత, సుశీల తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల...

కరీంనగర్...



ఖమ్మం...

మహబూబాబాద్...

పెద్దపల్లి...

నాగర్‌కర్నూల్...

నల్లగొండ...

సూర్యాపేట...

ఆదిలాబాద్...

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం

దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని బెట్టే తండా, రాళ్లవాగు తండా గ్రామాల్లో ఇటీవల వీచిన ఈదురుగాలులు, కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటలను మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించారు. సోమవారం రైతులతో కలిసి దెబ్బతిన్న వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టానికి సంబంధించిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అకాల గాలివానల కారణంగా పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.అనంతరం సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి, గాలివానల కారణంగా జరిగిన పంట నష్టాన్ని వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని, పంట నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వరం పరిష్కారం

రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి



ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 158 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవిన్యూ శాఖ 102, హౌసింగ్ 12, ఉపాధి కల్పన 7, ఎస్సీ కార్పొరేషన్ 5, గ్రామీణ అభివృద్ధి శాఖ 4, సర్వే ల్యాండ్స్ 4, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, మండల పరిషత్ 3, విద్య 2, వైద్య ఆరోగ్య 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2, మైన్స్, విద్యుత్, సివిల్ సప్లై, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఈ.డి.ఎం , వ్యవసాయ, సంక్షేమ, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణా రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగి రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ సాత్విక్, జెడ్పీ సీఈఓ శోభా రాణి, డి.పి.ఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా సిద్ధం కావాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట : విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే విషయ పరిజ్ఞానంతోపాటు మానసికంగా కూడా సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాత ఎస్పి కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు సోమవారం జిల్లా ఎస్పి కె. నరసింహతో కలిసి ఆయన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలంటే తీవ్ర పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ పోటీని తట్టుకునే మానసిక ధైర్యంతో ఉండి ఉద్యోగం సాధించాలన్నారు. జిల్లా ఎస్పి కె. నరసింహ మాట్లాడుతూ మొత్తం 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం అందిస్తున్నట్లు వివరించారు. నిపుణులైన అధ్యాపకులు, ఫిజకల్ ఈవెంట్స్ శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్లు అనూష, రవితేజ, సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్, ఆర్మడ్ డిఎస్పి నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం



ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి): పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్కట్‌పల్లి గ్రామంలో వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే చిన్న తుమ్మలగూడెం గ్రామానికి చెందిన బాకీ నరసింహ (56) కుమార్తె నోముల అరుణ జ్యోతికి ఎనిమిదేళ్ల క్రితం రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన నోముల వంశీతో వివాహం జరిగింది.వీరికి కృతికేష్ అనే కుమారుడు, విద్యశ్రీ అనే కుమార్తె ఉన్నారు.భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో రెండేళ్ల క్రితం నార్కట్‌పల్లికి వచ్చి నివాసం ఉంటున్నారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అదృశ్యమైన అరుణ జ్యోతి,ఆమె ఇద్దరు పిల్లల ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌లో లేదా నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

బోధన, పరిశోధనలో మెరుగుపడాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : అధునాతన సాంకేతిక పోకడలను ఆకళింపు చేసుకుంటూ అధ్యాపకులు బోధన,పరిశోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి అన్నారు.సోమవారం ఎంజీయూలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ విభాగం, ఎస్పివోసీ ఎడ్యునెట్ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఇంజనీరింగ్ లోని వివిధ విభాగాల అధ్యాపకులకు పైథాన్,మెషిన్ లెర్నింగ్,ప్రాంప్ట్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధ, శాఫ్ టెక్ స్కిల్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ జయంతి, డీన్ ఆచార్య రేఖ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి, ఆచార్య సాంబశివరావు, ఎడ్యునెట్ ప్రతినిధులు సాయికృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

జోగిని హత్య కేసు... నిందితుల అరెస్టు

రూ.1.73కోట్ల సొత్తు స్వాధీనం

యాదాద్రి ఎస్పి ఆక్షాంశ్ యాదవ్ వెల్లడి



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో సంచలనం కలిగించిన పూజారి రాళ్ళబండి సుధాకర్ హత్య నిందితులను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుండి రూ.1.73 విలువైన నగదు,బంగారు,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ హత్య కేసుకు సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆక్షాంశ్ యాదవ్ చౌటుప్పల్ డిఎస్పీ కార్యాలయ ఆవరణలో సోమవారం వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పవన్‌కుమార్(21),ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హర్ష సంతోష్ పాండే(24) లు సుధాకర్‌తో పరిచయం పెంచుకున్నారు.ఈ నెల 31న చౌటుప్పల్‌లోని సుధాకర్ ఇంటికి వచ్చారు.సుధాకర్ పూజారిగా పనిచేస్తుండగా భక్తులు ఇచ్చిన బంగారు,వెండి ఆభరణాలు,డబ్బులు ఇచ్చేవారు. ఈ విషయాన్ని గమనించిన నిందితులు వాటిని ఎలాగైన ఎత్తుకెళ్ళాలని నిర్ణయించుకుని సుధాకర్‌ను హత్య చేయడానికి పథకం వేశారు. సుధాకర్ మేనల్లుడి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడి తిరిగి ఇంటికి వెళ్లాడు.అర్ధరాత్రి 11 గంటలకు మేనల్లుడు ఫోన్ చేయగా పవన్,హర్ష సంతోష్ లతో మాట్లాడుతున్నానని, తర్వాత నిద్రపోతానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. నవంబర్ 1 అర్ధరాత్రి 12:38 గంటలకు మృతుడి ఫోన్ నుండి రెండు వాట్సప్ మేసేజ్‌లు రావడంతో అనుమానం వచ్చి మేనమామ సుధాకర్ ఇంటికి వెళ్ళి చూడగా ఇంటి ముందున్న స్కార్పియో కారు కనిపించలేదు. ఇంటి డోర్‌లు తీసి ఉండడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్ళి చూడగా సుధాకర్ విగత జీవిగా పడి ఉన్నాడు.వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి పోలీసులు చెరుకొని పరిశీలించారు.అప్పటికే సుధాకర్ హత్యకు గురై మృతి చెంది ఉన్నాడు.కత్తి పోట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 1న తెల్లవారుజామున నిర్మల్ జిల్లా గంజాల్ టోల్‌ప్లాజా వద్ద నిర్మల్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అక్కడి నుండి చౌటుప్పల్ పోలీసులు చౌటుప్పల్ స్టేషన్‌కు తరలించారు.

నిందితుల నుండి కిలో 319.33 గ్రాముల బంగారు ఆభరణాలు,3కిలోల600.66 గ్రాముల వెండి వస్తువులు,రూ.9,03,300 నగదుతో పాటు స్కార్పియో కారు,హత్యకు ఉపయోగించిన కత్తి,మృతుడి ఫోన్‌లు,నిందితులు ఫోన్‌లు, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.1.73కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. హత్య కేసును 3గంటల్లో చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన చౌటుప్పల్ డిఎస్పీ పటోళ్ళ మధుసూధన్‌రెడ్డి,సిఐ డి.సతీష్ రెడ్డి,సిసిఎస్ సిఐ ప్రవీణ్‌కుమార్,ఎస్సై కనకటి యాదగిరి,రవీందర్,అజయ్‌భార్గవ్ లతో పాటు పోలీసు సిబ్బందిని.నిర్మల్ జిల్లా పోలీసులను ఎస్పీ ఆక్షాంశ్ యాదవ్ అభినందించారు.

'యాదాద్రి'ని కరువు జిల్లాగా ప్రకటించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల



ప్రజాపక్షం /భువనగిరిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎలినినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో సాగు చేసిన వరి పంటలు నీరు లేక ఎండిపోతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాల పాలవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జిల్లాలో క్షేత్రస్థాయిలో పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి, యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం అందించాలని, పంటల సాగు కోసం చేసిన అప్పుల నుంచి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో సాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జక్క దయాకర్ రెడ్డి అధ్యక్షత జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పల్లె మల్లారెడ్డి , నాయకులు ఉట్కూరి కృష్ణ, చిన్నం మల్లేష్, నరిగే యాదయ్య, సోలిపురం నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు

మండలంలోని చెర్వుఅన్నారం క్రాస్ రోడ్ వద్ద ఘటన



ప్రజాపక్షం/నకిరేకల్ : హైదరాబాద్‌విజయవాడ 65 నెంబర్ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల శివారులోని చెర్వు అన్నారం క్రాస్ రోడ్ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు,క్షతగాత్రుడు ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వాసు(22),అతనికి సోదరుడు వరస అయ్యే జొన్నలగడ్డ ప్రశాంత్‌లు గత కొంతకాలంగా హైదరాబాదులో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు తమ స్వగ్రామానికి వెళ్లేందుకు సోమవారం హైదరాబాదు నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో నార్కెట్ పల్లి వద్ద హైవేపై నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన గోగుల స్వాతి (30) వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనకు నకిరేకల్ వరకు లిఫ్ట్ చేయాల్సిందిగా కోరగా ముగ్గురు కలిసి నకిరేకల్ వైపు వెళ్తుండగా కట్టంగూర్ మండల పరిధిలోని చెరువు అన్నారం క్రాస్ రోడ్ వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్టేక్ చేసే క్రమంలో వెనకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వారిపైనుంచి వెళ్లడంతో జొన్నలగడ్డ వాసు, గోగుల స్వాతిలు ప్రమాద స్థలంలోనే అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న శాలిగౌరారంసిఐ రాజశేఖర్,కట్టంగూర్ ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దగ్గుల క్రాంతి తెలిపారు.

నూతన పరిశోధనలకు వేదిక సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్



ప్రజాపక్షం/నల్లగొండ : దక్షిణ భారత చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటడంతో పాటు,చరిత్రపై నూతన పరిశోధనలకు సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ వేదిక కానుందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.ఈ నెల 13,14,15 తేదీల్లో ఎంజీయూలో నిర్వహించనున్న 45వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ద్వారా చారిత్రక అంశాలపై విస్తృత చర్చలు, పరిశోధనలు జరగనున్నాయని తెలిపారు.ఈ మూడు రోజుల జాతీయ స్థాయి సదస్సును విద్యార్థులు,పరిశోధకులు,అధ్యాపకులు, చరిత్రాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సోమవారం నల్లగొండలోని ఎంజీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ దక్షిణ భారతదేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ చరిత్రపై సమగ్ర విశ్లేషణకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులు, యూనివర్సిటీలు,డిగ్రీ కళాశాలల అధ్యాపకుల్లో చారిత్రక పరిశోధనల పట్ల ఆసక్తి, జిజ్ఞాస పెరుగుతుందని అన్నారు.ప్రభుత్వ విభాగాలకు సైతం విలువైన సమాచారం, విజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన 45వ సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను ఎంజీయూలో నిర్వహించడం యూనివర్సిటీతో పాటు నల్లగొండ జిల్లాకు గర్వకారణమని ఉపకులపతి పేర్కొన్నారు.అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ ప్రియ,ఆచార్య విజయబాబుతో కలిసి సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ పనస రామకృష్ణ, డాక్టర్ షరీఫ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ,హుజూర్‌నగర్‌కే నిధులా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



ప్రజాపక్షం/మునుగోడు: మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ, తన కష్టానికి తగిన స్థాయిలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం లేదని మునుగోడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తాను మంత్రిని కాకపోవచ్చు.. ముఖ్యమంత్రిని కాకపోవచ్చు..కానీ వారికంటే ఎక్కువ సామర్థం, క్రియేటివిటీ తనకు ఉన్నాయని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నా,ఆశించిన స్థాయిలో నిధులు అందడం లేదని అన్నారు. ముఖ్యంగా నీటిపారుదల శాఖ నుంచి మునుగోడు నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయడం లేదని విమర్శించారు.అదే సమయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సొంత నియోజకవర్గాలైన కోదాడ, హుజూర్‌నగర్‌లకు అధికంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆరోపించారు.ఆయన రాష్ట్రానికి మంత్రిగా వ్యవహరిస్తున్నారా.. లేక కేవలం హుజూర్‌నగర్ నియోజకవర్గానికే మంత్రిగా పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు.మునుగోడు అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని, ప్రాంతాలవారీ వివక్ష లేకుండా అన్ని నియోజకవర్గాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

విద్యుత్తును పొదుపు చేయండి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు విద్యుత్తును ఆదా చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా రెడ్కో ఆధ్వర్యంలో సేవ్ ఎనర్జీ పేరున ఈ నెల 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో చేపట్టనున్న చర్యలను కలెక్టర్ వివరించారు.సేవ్ ఎనర్జీ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రజలు, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా చిన్న చిన్న చిట్కాల ద్వారా విద్యుత్ ను ఎలా ఆదా చేసుకోవాలో చెప్పాలని,సోలార్ ఎనర్జీని వాడడం, ఈవేస్టేజ్ తదితర అంశాలపై జిల్లా అధికారులకు సూచించారు.జిల్లా,మండల,గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది ఇకపై ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు అన్ని కార్యాలయాలలో సూర్యరశ్మి ఎక్కువగా ఉన్న చోట లైట్లు,ఫ్యాన్లు వేసుకోవద్దని, ఎయిర్ కండిషన్ ను 25 డిగ్రీలకు మించి పెట్టుకోకూడదని, విద్యుత్ ఆదా పద్ధతులను కింది స్థాయి వరకు తెలియజేయాలని చెప్పారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీసర్వేలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారికి సంబంధించిన ఆస్తులను తప్పనిసరిగా ఎన్యుమరేషన్ చేయించుకొని ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జనజాతీయ గౌరవ దివస్ సెలబ్రేషన్స్ పై రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, రెడ్కో ప్రతినిధి అశోక్ తదితరులు హాజరయ్యారు.

ప్రజావాణికి 104 దరఖాస్తులు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం జరుగు ప్రజావాణికి జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 104 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, జడ్పి సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఈఓ శ్రీనివాస్, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిఎంహెచ్ఓ వెంకటరమణ, సిపిఓ కిషన్, సిఎఫ్ఓ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పాడి గేదెలు మృతి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : వ్యవసాయ పొలంలో విద్యుత్ షాక్ తగలడంతో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు బండి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రెండు పాలిచ్చే గేదెలు మేతకోసం వెళ్లాయి. ఈ క్రమంలో ఒకరి వ్యవసాయ పొలంలోకి వెళ్లిన గేదెలకు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రమైన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. మృతి చెందిన రెండు పాడి గేదెల విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కండ్ల ముందే పాలిచ్చే రెండు గేదెలు మృత్యువాత పడటంతో బాధిత రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

ఎల్ నినో..వర్షాభావంతో 'గృహజ్యోతి'కి షాక్

పెరుగుతున్న విద్యుత్ వినియోగం



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఎల్ నినో ప్రభావం..వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గృహజ్యోతి పథకానికి షాక్ తగులుతుంది. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 200 యూనిట్ల విద్యుత్ దాటే అస్కారం ఉంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో తీవ్ర చలి ఉండాల్సి ఉండగా ఎల్ నినో, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగానే ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం పెరుగుతుందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆశించిన దాని కంటే విద్యుత్ వినియోగం ఎక్కువగానే పెరిగిందన్నారు. నెలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న కుటుంబాలు ఆ పరిమితిని దాటితే జీరో బిల్లుకు బదులుగా సాధారణ బిల్లుల మాదిరిగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగితే విద్యుత్ వినియోగం అదే స్థాయిలో పెరిగే అవకాశం ఉంటుందని, నెలకు 170నుండి 200యూనిట్ల మధ్య విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్యాన్లు, ఏసిలు ఎక్కువ సేపు నడవటం, కూలర్ల వినియోగం పెరగడం వంటి కారణాలతో నెలవారి విద్యుత్ బిల్లు పెరిగే అస్కారం ఉంటుంది. విద్యుత్‌ను పొదువుగా వినియోగిస్తేనే జీరో విద్యుత్ బిల్లును పొందేందుకు అస్కారం ఉంటుందని అంటున్నారు. ఒకవైపు విద్యుత్ అధికారుల సూచనలు, మరోవైపు ప్రభుత్వ ప్రకటనలతో వినియోగదారులు సందిగ్దంలో పడిపోయారు.

విద్యుత్ సరఫరాలో కోతలు

విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు సమయపాలన లేకుండా కోతలు విధిస్తూ కాలం వెలదీస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి మొదలుకొని మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల వరకు విద్యుత్ కోతలు అంచలంచలుగా పెరుగుతున్నాయి. అధికారులు చేస్తున్న సూచనలను పరిగణలోకి తీసుకున్న ప్రజలు ఎలాగైనా తమకు గృహజ్యోతి పథకం వర్తించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గిస్తున్నారని చెప్పవచ్చు. కానీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా కొన్ని ప్రాంతాలలో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల 200యూనిట్లు దాటి సాధారణ బిల్లులు చెల్లింపులకు సిద్ధమవుతున్నారు. గృహజ్యోతి పథకం ప్రయోజనం పొందుతున్న కుటుంబాలు వినియోగంపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అవసరం లేని సమయాల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, టీవి లు, ఇతర విద్యుత్ పరికరాలను నిలిపి వేయాలని సూచనలు చేస్తున్నారు. విద్యుత్‌ను ఆదాచేసే ఎల్ఈడి బల్బులతో పాటు సమర్థవంతమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని, నెలవారీగా 200యూనిట్లు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు.

డివిజన్‌లో 41,281 గృహజ్యోతి లబ్దిదారులు

షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో మొత్తం 41,281 గృహజ్యోతి లబ్దిదారులు ఉన్నారని విద్యుత్ డిఇ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌లో మొత్తం 28,954 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, 90,802విద్యుత్ కనెక్షన్లు గృహ అవసరాలకు ఉన్నాయని, గృహజ్యోతి పథకం కింద 41,281 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని డిఇ తెలిపారు. 14,250 కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఇప్పటి వరకు విద్యుత్ వినియోగం 114మెగావాట్లు అవసరం ఉందని, డిమాండ్‌కు తగ్గినంతనే విద్యుత్ వస్తుందని తెలిపారు. బోరుబావుల వద్ద పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యవసాయ పంటలు ఎండిపోకుండా ఉండేందుకు విద్యుత్‌ను ఉన్నదానికంటే అదనంగా మారో నాలుగు గంటల పాటు ఇస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్ లో మాత్రం ఆరుతడి పంటలను సాగుచేసేందుకు రైతులు కృషి చేయాలని కోరారు.

పెంబిలో అక్రమ ఇసుక డంపు సీజ్

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇసుక నిల్వల స్వాధీనం



ప్రజాపక్షం/పెంబి : మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపుపై రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా డంపు చేసిన ఇసుకను రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు.మండల కేంద్రంలో అక్రమంగా ఇసుక నిల్వ ఉంచినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి,అక్కడ నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ ఇసుక నిల్వలు,అనుమతులు లేకుండా ఇసుక తరలింపు వంటి చర్యలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు,ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమని,ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై రెవెన్యూ శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిఒ అనిల్, ఆర్ఐ శ్రవణ్‌తో పాటు రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక దండారి దర్బార్: ఆడ జంగు



ప్రజాపక్షం / కాసిపేట: ఆదివాసీల విశిష్ట సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన దండారి దర్బార్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకుడు ఆడ జంగు పిలుపునిచ్చారు. కాసిపేట మండలంలోని సాల్పలవాగు వద్ద నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎంపిడిఒ కార్యాలయంలో తహసీల్దార్ , ఎంపిడిఒలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆడ జంగు మాట్లాడుతూ 3వ తేదీ సాయంత్రం దండారి ఉత్సవాలు ప్రారంభమై, 4వ తేదీన దండారి దర్బార్ కార్యక్రమం ఘనంగా కొనసాగుతుందని తెలిపారు. కాసిపేట మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదివాసీలు భారీ సంఖ్యలో తరలిరానున్నారని పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక అయిన సంప్రదాయ గుస్సాడీ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఈ దర్బార్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాపూర్ సర్పంచ్ రాందాస్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ‘ఆల్ఫోర్స్ విద్యార్థుల’ జయకేతనం



ప్రజాపక్షం/భైంసా : క్రీడారంగంలో ఆల్ఫోర్స్ హైస్కూల్, భైంసా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మహమ్మద్ రేహాన్ అండర్ 17 విభాగంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి గట్కా పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు పాల్గొన్న ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నాడు.తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా పోటీలకు సైతం ఎంపికయ్యాడు. మరోవైపు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు జరిగిన ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెదరేషన్ నేషనల్ ఫెదరేషన్ కప్ 2026–27 పోటీల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు పతకాలతో సత్తా చాటారు. హర్థిత్య – అండర్ 12 డబుల్ అండర్ విభాగంలో కాంస్యం. రిథుశ్రీ – అండర్ 14 డబుల్ అండర్ విభాగంలో కాంస్యం. రిథుశ్రీ, శ్రీనిధి, అనన్య – అండర్14 ఫ్రీస్టైల్ టీమ్ విభాగంలో స్వర్ణం. రీతిక – అండర్ 14 ఫ్రీస్టైల్ టీమ్ విభాగంలో రజతం. అద్విత– అండర్12 స్పీడ్ స్ప్రింట్, డబుల్ అండర్ విభాగాల్లో రెండు రజత పతకాలు సాధించారు. విద్యార్థుల సాధించిన విజయాలపై ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అండ్ కాలేజెస్ చైర్మన్ నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.విజేతలతో పాటు వారికి శిక్షణ అందించిన పిఇటిలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు.

తలమడుగును కరువు మండలంగా ప్రకటించాలి: రైతు జెఏసి



ప్రజాపక్షం/తలమడుగు: తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు జెఏసి ఆధ్వర్యంలో రైతులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయి అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించకపోవడం సరికాదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆందోళనలో నల్ల పద్మాకర్ రెడ్డి, సర్పంచ్ ఎలుగు రాజన్న, శేఖర్‌రామ్‌రెడ్డి, ఆశన్న, ఇంద్రాసేన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాపక్షం/మాక్లూర్ : నవీపేట్ మండలంలోని గాంధీనగర్‌లో రోడ్డు ప్రమాద సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జన్నెపల్లి గ్రామవాసి పిట్టలు నర్సయ్య తన పొలం నుండి వడ్లను తీసుకరావటానికి వెళ్లే తరుణంలో గాంధీనగర్ వాసి పోతిరెడ్డి మల్లీశ్వరి (42) రోడ్డుపై ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పిట్టల నవీన్ తాగి ఉండటంతో ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. మృతురాలి భర్త భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రాష్ట్రంలో కరువును...

కాంగ్రెస్ తెచ్చిందనడం అవివేకం

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలు వారి అవివేకానికి నిదర్శనమని, ఈ ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి కన్నెర్రతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, యాభై ఏళ్ల నుండి సముద్రంలో భూతాపం పెరిగి ఎల్ నినో రూపంలో విలయతాండవం చేస్తోందనే నిజాలు తెలియని విచిత్ర పరిస్థితిలో విపక్ష నేతలున్నారని విమర్శించారు. ఎల్లంపల్లి, కడెంలోకి ఈ మధ్య కురిసిన అకాల వర్షాలతో వరదనీరు చేరిందని, తాగుకు సరిపడా నీరు ఉన్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో కరువు పరిస్థితులు లేవని అన్నారు. నీళ్ల కరువు ఉన్నందున రైతులందరూ రెండు పంటలు వేయవద్దని, అలాగే నీటిని వృథా చేయవద్దని కోరారు. కడెం డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లు పగుళ్లు తేలినందున 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీరు రావడం లేదని తెలిపారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య తీరిపోనున్నట్లు చెప్పారు. కార్మికుల ఆదాయపు పన్నును యాజమాన్యమే భరిస్తుందని, డిపెండెంట్ ఎంప్లాయి సమస్య కూడా పరిష్కారం అవుతుందన్నారు. మంచిర్యాల నియోజకవర్గం గడ్డ కాంగ్రెస్ అడ్డా అని తాజాగా నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ పార్టీకి వ్యక్తిగతంగా నాకు అనూహ్య స్థాయిలో ప్రజల మద్దతు లభించిందని పేర్కొన్నారు. మంచిర్యాల ప్రజల రుణం తీర్చుకోవడానికి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.
ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షురాలు సురేఖ, టిపిసిసి ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మేయర్ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామిగిరి బానేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ ఇలాత్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని సూచించారు. ఈ నిబంధనలను పాటించకుండా ప్రజలపై ధరల భారం మోపే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లోబడి బియ్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా గజానన్ రైస్‌మిల్ ఇండస్ట్రీ వారు జిల్లా కేంద్రంలో గాంధీ గంజ్ కమాన్ గోశాల రోడ్డుకు ఆనుకుని ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్‌లెట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. నిర్ణీత ధరల కంటే అధిక రేట్లకు విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బిపిటి స్టీమ్ రైస్‌బ్యాగ్‌ను రూ.1510కి, హెచ్ఎంటీ రకం బస్తా రూ.2030 చొప్పున అవుట్‌లెట్ ద్వారా విక్రయాలు జరుపుతామని గజానన్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు హితెన్ భీమాని తెలిపారు. ఆధార్ కార్డును పరిశీలిస్తూ ఒక కుటుంబానికి నెలకు 26 కిలోలతో కూడిన ఒక బియ్యం బస్తా మాత్రమే విక్రయించేలా ఏర్పాట్లు చేశామని, దీంతో ఏక మొత్తంలో కొనుగోళ్లకు అస్కారం లేకుండా అందరికీ నిర్ణీత ధరకు బియ్యం అందాలనే సదుద్దేశ్యంతో ఆధార్ కార్డు విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమల్ కిషోర్, ప్రియాన్ బీమాని, రవీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహారంపై అవగాహన



ప్రజాపక్షం/మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారంపై సిడిపిఒ ఫాతిమా, సూపర్‌వైజర్ రచన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఫాతిమా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహార కార్యక్రమాలు వాటితో లభించే ప్రయోజనాలపై వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజూ అన్నం, పప్పు, సాంబారు, కూరగాయలతో కూడిన పౌష్టికాహారం అలాగే పాలు, ప్రతిరోజూ ఒక ఉడికించిన గుడ్డు ఇస్తారని తెలిపారు. సూపర్‌వైజర్ రచన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తల్లిపాలతో పాటు బాలామృతాన్ని కూడా పిల్లలకు అందజేయాలని సూచించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని సర్పంచ్ భూమన్న, ఉపసర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది శమంత, సుభాషిని, పంచాయతీ కార్యదర్శి నవీన్, సాయిలు, నవీన్ పాల్గొన్నారు.

బొగ్గు సరఫరా నిలిపివేతకు ఉద్యమిస్తాం

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య





ప్రజాపక్షం / శ్రీరాంపూర్: సింగరేణికి రావాల్సిన రూ. 60 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించకుంటే విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా నిలిపివేతకు ఉద్యమిస్తామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సిహెచ్‌పి వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పలువురు యువ కార్మికులు ఆయన సమక్షంలో ఎఐటియుసిలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘంగా ఆర్ఎల్‌సి చర్చల ద్వారా సాధించిన 24 ప్రధాన డిమాండ్ల ఒప్పందాలు పూర్తిగా అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థలు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వీడాలని, లేనిపక్షంలో బొగ్గు నిలిపివేత ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం వేలంలో పాల్గొని కొత్త గనులను దక్కించుకోవాలని సూచించారు. 12వ వేజ్ బోర్డు డిమాండ్ల రూపకల్పన కోసం కార్మికులు తమ సూచనలు నాయకులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, బుచ్చయ్య, జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, రాజ్ కుమార్, జిల్లాల రవి, సాయి రాజ్, తిరుపతి, గజ్జి రమేష్, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, ఓదెలు, నారాయణ, లచ్చన్న పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలి

సింగరేణిలో మైనింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, కుదిరిన 24 కీలక డిమాండ్ల ఒప్పందాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని సిసి నరసయ్య భవన్‌లో నిర్వహించిన బెల్లంపల్లి రీజియన్ సంయుక్త మైనింగ్ స్టాఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ గనుల్లో పనిచేయడానికి అనర్హులైన వారికి ఉపరితల విభాగాల్లో ఉద్యోగాలు కల్పించాలని, ఓవర్‌మెన్, జూనియర్ మైనింగ్ ఇంజినీర్ల పదోన్నతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హత కలిగిన వారికి ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పదోన్నతులు ఇవ్వాలని, ఉన్నత చదువులకు ఎన్ఓసిలు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఉద్యోగులకు అర్హతలేని పనులు అప్పగించరాదని, నిలిపివేసిన ఇంక్రిమెంట్లను సమీక్షించి అర్హులకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మైనింగ్ సూపర్‌వైజరీ స్టాఫ్‌గా ఎదిగేందుకు తగిన శిక్షణ, అవకాశాలు కల్పిస్తూ సమస్యలను కాలపరిమితితో పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు మిర్యాల రంగయ్య, కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బాజీ సైదా, రాజేశ్వర రావు, రాజశేఖర్, అడ్డూ శ్రీనివాస్, బాలకృష్ణ, అఫ్రోజ్ ఖాన్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బోనస్ ఇచ్చే పార్టీ కాదు..

బోగస్ హామీల కాంగ్రెస్ ప్రభుత్వం!

11న నిర్మల్‌లో యువగర్జన సభ
ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బోనస్ ఇచ్చే పార్టీ కాదని, బోగస్ హామీలతో ప్రజలను మభ్యపెట్టే పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.నిర్మల్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు గత పాలనను గుర్తు చేసుకుంటున్నారని, రాష్ట్రంలోని ప్రతి పల్లె, పట్టణంలో కెసిఆర్ పాలన తిరిగి రావాలని కోరుకుంటున్నారని అనిల్ జాదవ్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో 11వ తేదీన నిర్మల్ పట్టణంలో 50 వేల మందితో భారీ ఎత్తున యువ గర్జన బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ సభకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి యువ గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.యువతలో పార్టీ పట్ల ఆదరణ పెరుగుతోందని, 5వ తేదీన భారీ సంఖ్యలో యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరనున్నారని వెల్లడించారు. యువత భాగస్వామ్యంతో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్ రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్, లోలం శ్యాంసుందర్, పట్టణ అధ్యక్షుడు రాము, వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
చట్ట ప్రకారం న్యాయం అందించాలి
ఎస్పి జానకి షర్మిల



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించి, చట్టపరంగా పరిష్కారం చూపాలని ఎస్పి జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతతో పరిశీలించి, సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చట్ట పరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని, ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఎస్పి జానకి షర్మిల స్పష్టం చేశారు.

యువత మైదానాల వైపు అడుగులేయాలి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : నేటి ఆధునిక కాలంలో చిన్నారులు, యువత స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేందుకు రోజుకు కనీసం ఒక గంటపాటు క్రీడా మైదానాలకు పంపాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బషీరాబాద్ జడ్‌పిహెచ్ఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన 70వ అండర్14, 17 బాలబాలికల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు. మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాలకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువు, విజ్ఞానం ఎంత కీలకమో, వారి శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వానికి ఆటలు కూడా అంతే ప్రధానమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో క్రీడా సంస్కృతిని విస్తరింపజేయాలన్నదే తన ఆకాంక్ష అని అందువల్లే నియోజకవర్గవ్యాప్తంగా క్రీడా పోటీల నిర్వహణను నిరంతరం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతం చేస్తున్న 400 మంది గ్రామ యువతకు, గ్రామాభివృద్ధి కమిటీ సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులకు, నిర్వహణ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, అధికారులు పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గోదావరి శుభ్రత పనులు ప్రారంభం



ప్రజాపక్షం /ఖానాపూర్ : పవిత్ర గోదావరి నది కాలుష్యం కోరల్లో చిక్కుకుందని ‘ప్రజాపక్షం’ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ అధికారులు స్పందించారు. గోదావరి నదిలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలపై ప్రజాపక్షం ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే.ఈ వార్తకు స్పందించిన మున్సిపల్ అధికారులు వెంటనే శుభ్రత పనులను ప్రారంభించారు.నది పరివాహక ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ, నదిని కాలుష్యం బారి నుండి కాపాడేందుకు చర్యలు చేపట్టారు.ప్రజా పక్షం వార్తకు స్పందించి చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు స్థానికులు, భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో గోదావరిని పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే

కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : అత్యాధునిక సాంకేతిక పరికరాలతో భూ రీ సర్వే చేస్తున్నాట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ వివరించారు. సోమవారం కలెక్టర్ భూ రీ సర్వే పరికరాలను భూ సర్వే ఎడి కిషన్, సంబధిత శాఖ ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ సర్వేలో కచ్చితత్వాన్ని అమలు చేయడానికి, పకడ్బందీగా సర్వే నిర్వహించడానికి, సమయ భావాన్ని తగ్గించి, పారదర్శకమైన భూ సర్వే కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది ఉన్నారు.

సురక్షితమైన బాల్యం కల్పించడమే ‘సురక్షిత్ బచ్చన్ అభియాన్’

సెషన్స్ న్యాయమూర్తి మాధవి కృష్ణ

ప్రజాపక్షం /సంగారెడ్డి : సురక్షిత బచ్చన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ భద్రత, బాలలపై జరిగే నేరాల నివారణపై అవగాహన కల్పించేందుకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో దేశవ్యాప్త పాఠశాలల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా న్యాయమూర్తులు, న్యాయాధికారులు పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా , సెషన్స్ న్యాయమూర్తి మాధవి కృష్ణ సంగారెడ్డిలోని విద్యానగర్‌లో ఉన్న సెయింట్ ఆంథోనిస్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి సతీష్‌కుమార్, సంగారెడ్డిలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి కార్తీక్ సంగారెడ్డిలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ధన లక్ష్మి సంగారెడ్డిలోని ఫసల్ వాడలో ఉన్న సరస్వతి శిశు మందిరంలో ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి , సంగారెడ్డిలోని శ్రద్ధ హైస్కూల్‌లో విద్యార్థులకు బాలల హక్కులు వ్యక్తిగత భద్రత రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాలలపై జరిగే హింస లైగింక వేధింపులు , దోపిడి ఇతర అనుచిత చర్యలను నివారించాల్సిన అవసరాన్ని వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, ఆన్‌లైన్ భద్రత, బాలల హక్కులు ,బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా అసురక్షిత పరిస్థితి ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు, సంబందిత అధికారుల సహాయం తీసుకోవాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షించడం వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయాధికారులు పేర్కొన్నారు. బాలల భద్రత సంక్షేమం, గౌరవప్రదమైన బాల్యాన్ని నిర్ధారించడంలో తల్లిదండ్రులు ,ఉపాధ్యాయులు ,విద్యాసంస్థలు ,పోలీసు శాఖ న్యాయ సేవాధికార సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవశ్యకతను ఈ కార్యక్రమాల ద్వారా తెలియజేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
03-11-2026
www.prajapaksham.in



దుర్మార్గపు చర్య

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐడిబిఐ అధికారులు, ఉద్యోగుల ఐక్య వేదిక (యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ ఐడిబిఐ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద రెండు రోజుల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన రాంబాబు మాట్లాడుతూ ఐడిబిఐ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కొద్దిమంది కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. బ్యాంకులు, విమానాశ్రయాలు, ఓడరేవులు, బొగ్గు గనులు, విద్యుత్ వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఐడిబిఐ విక్రయం ఉద్యోగుల భద్రతకు ముప్పు కలిగించడమే కాకుండా, సామాజికంగా అణగారిన వర్గాలు, దివ్యాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులను నిర్వీర్యం చేసే ప్రమాదం ఉందన్నారు. ప్రైవేటీకరణను నిలిపివేసి, ప్రజా పెట్టుబడులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూ బ్యాంకును మరింత బలోపేతం చే యాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ ఐడిబిఐ విక్రయ ప్రక్రియను 'గ్రేట్ ఇండియన్ రాబరీ'గా అభివర్ణించారు. సుమారు రూ.9,500 కోట్ల లాభాలతో నడుస్తున్న బ్యాంకును విదేశీ సంస్థ ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఐడిబిఐ విక్రయాన్ని ఉద్యోగులు, ప్రజలు ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం (ఎఐబిఓఎ) చైర్మన్ వి. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఐడిబిఐని విదేశీ సంస్థకు అప్పగించడం దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజలు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ఉద్యోగ సంఘాలతో కనీసం చర్చించకుండానే విక్రయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం దుర్మార్గమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే విక్రయ ప్రక్రియను రద్దు చేసి, ఐడిబిఐ బ్యాంకును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అంజనేయ ప్రసాద్, బిఇఎఫ్ఐ అధ్యక్షుడు వెంకట్రామయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి భరత్, కాంగ్రెస్ ఎ మ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, ఎఐబిఓఎ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు ఐ. హరనాథ్, వైస్ చైర్మన్ కె. మురళి, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ ఐడిబిఐ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ నాయకులు ఇ.వి.సోమసుందర్, బి. విఠల్ రావు పాల్గొన్నారు.

ఎల్ నినో కరువు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితర నాయకులు పరిశీలించారు. పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగు కోసం చేసిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ భారంగా మారిందని రైతులు నాయకుల ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు.

కరువును జాతీయ విపత్తుగా గుర్తించాలి

ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో అనేక గ్రామాలు సాగునీరు, తాగునీటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులో లేకపోవడంతో రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురవక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయక నిధులు విడుదల చేయాలని కోరారు.పంటలు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించడంతోపాటు వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు,గ్రామీణ పేదలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని సూచించారు.కరువు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోయి పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వెంకట రెడ్డి అన్నారు.ప్రతి రేషన్ కార్డుదారుడికి 10 కిలోల బియ్యంతోపాటు పప్పులు,వంట నూనె తదితర నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించి, కూలి రేట్లు పెంచాలని, ప్రతి జాబ్‌కార్డు కలిగిన కుటుంబానికి తగిన పనిదినాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల ప్రజల సాగునీటి, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే వచ్చే ఎన్నికల్లోపే డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు,గ్రామాలకు తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కరువు మండలాల ప్రకటనలకే పరిమితం కావొద్దు: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 20 మండలాలను కరువు మండలాలుగా, మరో 8 మండలాలను మధ్యంతర కరువు మండలాలుగా గుర్తించినప్పటికీ, జిల్లా మొత్తం కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లాను సంపూర్ణ కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేవలం కరువు మండలాలుగా ప్రకటించి చేతులుదులుపుకోకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.పంటల సాగు కోసం బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ మాఫీ చేయడంతోపాటు రుణాలను రీషెడ్యూల్ చేయాలని కోరారు. అప్పులు చెల్లించాలని రైతులపై బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయకుండా ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. పంటలు చేతికందక, పెట్టుబడులు తిరిగి రాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని,వారిని అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీకొన్ని ప్రాంతాల్లో ప్రారంభోత్సవాలకే పరిమితమవుతున్నాయని నెల్లికంటి సత్యం విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పండించిన ధాన్యం తడిసి నష్టపోకుండా వెంటనే కొనుగోలు చేయాలని, గోనె సంచులు,రవాణా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజా చారి,తీర్పాటి వెంకటేశ్వర్లు,నల్పరాజు రామలింగయ్య,తూము బుచ్చి రెడ్డి,మండల కార్యదర్శులు చాపల శ్రీను,సుదనబోయిన రమేష్,శ్రీరామదాసు కనకాచారి నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల బెయిలు రద్దుపై తీర్పు రిజర్వు



ప్రజాపక్షం/హైదరాబాద్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కులం పేరుతో దూషించారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు టి. మధుసూదన్, ఎన్. నవీన్‌కుమార్‌రెడ్డిలకు కింది కోర్టు మంజూరు చేసిన బెయిలును రద్దు చేయాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ పూర్తయింది. సోమవారం జరిగిన విచారణలో పోలీసుల తరఫున వాదనలు వినిపిస్తూ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండానే మేజిస్ట్రేట్ బెయిలు మంజూరు చేశారని, వాటిని రద్దు చేయాలని కోరారు. ఎమ్మెల్సీల తరఫున వాదనలు వినిపిస్తూ స్పీకర్‌ను కులం పేరుతో దూషించారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తనపై హైకోర్టు గతంలోనే ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతలను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసేందుకే బెయిలు రద్దు పిటిషన్ దాఖలు చేశారని పేర్కొంటూ దాన్ని కొట్టివేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

క్లీన్, ట్రాఫిక్ ఫ్రీ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టిపి) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జిహెచ్ఎంసితో పాటు సిఎంసి, ఎంఎంసి, ఎంఎంసి పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సిఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్య లు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్, ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సిఎం అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ జి.సృజన తదితరులు పాల్గొన్నారు.













Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com